PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 189 | విజయవాడ, మంగళవారం 13 ఫిబ్రవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 13 February 2024 | Rs

వైసిపి రాజ్యసభ అభ్యర్థులుగా వైవి సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి, గొల్ల బాబూరావు నామినేషన్ దాఖలు

3

రైతు పక్షమా... అమెరికాకు దాసోహమా?

• డబ్ల్యుటిఓలో భారత్ వైఖరిపై సర్వత్రా ఆసక్తి

లోపలి పేజీలో..

ఐఆర్, పిఆర్‌సి ఊసే లేదు

• పెదవి విరుస్తున్న ఉద్యోగులు • యథాతథంగా ఉద్యమ కార్యాచరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగుల సమస్యలపై సోమవారం సాయంత్రం మంత్రివర్గ ఉపసంఘం జరిపిన చర్చలు ఐఆర్, పిఆర్‌సి వంటి కీలకాంశాల ఊసు లేకుండా సాగాయి. దీంతో ఉద్యోగసంఘాలు పెదవి విరుస్తున్నాయి. ఉద్యమ కార్యాచరణలో ఎటువంటి మార్పు లేదని ప్రకటించాయి. సచివాలయంలో సోమవారం సాయంత్రం మంత్రి వర్గ ఉప సంఘం ఉద్యోగ సంఘాలతో పెండింగ్ అంశాలు, బిల్లుల చెల్లింపులు తదితర అంశాలపై భేటీ నిర్వహించింది. ఈ చర్చల్లో 12వ పిఆర్‌సి విధి విధానాల గురించి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోగా, కనీసం ఐఆర్ 30శాతమైనా ప్రకటించకపోతుందా అని అని ఆశించిన ఉద్యోగుల ఆశలపై ప్రభుత్వం నీళ్లు కుమ్మరించింది. చర్చల్లో మార్చి 31లోగా ఉద్యోగులు బకాయిల్లో కొంత మేర చెల్లిస్తామని ప్రభుత్వం హామీనిచ్చింది. ఆర్థికశాఖ కార్యదర్శి సత్యనారాయణ బకాయిలు జిపిఎఫ్, జడ్‌పిపిఎఫ్ కలిపి రూ.946కోట్లు, ఇందులో క్లాస్ ఫోర్ ఉద్యోగులకు సంబంధించిన రూ.67కోట్లు ఉన్నట్లు సమావేశంలో దీనిలో ఫిబ్రవరి నెలాఖరుకు రూ.60కోట్లు బకాయిలు చెల్లిస్తామని, మిగిలిన అన్ని బకాయిలు మార్చి 31లోగా చెల్లిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల్లో ఎపి జిఎల్‌ఐ రూ.516కోట్లు, టిఎ, డిఎలు కలిపి రూ.275కోట్లు,

ఉద్యోగ సంఘాలతో సమావేశమైన మంత్రి వర్గ ఉప సంఘం

మెడికల్ బిల్లులు రూ.118కోట్లు, సిపిఎస్ మ్యాచింగ్ గ్రాంట్ బకాయిలు రూ.2,800కోట్లు, సిపిఎస్ 90శాతం డిఎ బకాయిలు రూ.2,100కోట్లు, సరెండర్ లీవ్ బకాయిలు రూ.2250కోట్లు, పెన్షనర్స్ బెనిఫిట్స్ రూ.280కోట్లు, డిఎ అరియర్స్ రూ.4,500కోట్లు, 11వ పిఆర్‌సి బకాయిలు రూ.7,800కోట్లు ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ భేటీలో ప్రభుత్వం తరపున రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి, సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఆర్థికశాఖ కార్యదర్శి కెవివి సత్యనారాయణ, సర్వీసెస్ శాఖ కార్యదర్శిభాస్కర్, జిఎడి అదనపు కార్యదర్శి ఎన్ శ్రీనివాసులు పాల్గొనగా, మునిసిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎపి ఎన్‌టియు అధ్యక్షులు సాయి శ్రీనివాస్, పిఆర్‌టియు అధ్యక్షులు యు.కృష్ణయ్య, ఎపిటిఎఫ్ అధ్యక్షులు జి.హృదయరాజు, ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ, ఎపి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఎస్ బాలాజీ, ఎపి ప్రభుత్వ డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు సంసాని, ఆల్ ఎపి ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల మిగతా 2లో

రేషన్ షాపుల్లో మోడీ పోస్టర్లా... కుదరదు

• కేరళ సిఎం విజయన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళలోని రేషన్ షాపుల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని కేంద్రం జారీ చేసిన ఆదేశాలు సరి కాదని, వీటి అమలు కష్టమని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. సోమవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, కేరళలో ప్రజాపంపిణీ వ్యవస్థ అత్యంత పటిష్టంగా ఉందని, గతంలో ఎన్నడూ లేని విధంగా మోడీ ప్రభుత్వం సొంత ప్రచారం కోసం దీనిని వాడుకోవాలని చూడడం అభ్యంతరకరమని అన్నారు.. జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ) కింద పనిచేస్తున్న రేషన్ పంపిణీ వ్యవస్థను ఎన్నికల ప్రచారానికి వాడుకోవాలి చూడడం సరికాదన్నారు. ఇదే విషయాన్ని తమ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తుందని అన్నారు. ఈ అంశాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లే విషయం పరిశీలిస్తామని అన్నారు.

రేషన్ షాపుల్లో 14 వేలకు పైగా ప్రధాని మోడీ పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని, ఆహారోత్పత్తులతో కూడిన క్యారీ బ్యాగ్‌లపై కేంద్ర ప్రభుత్వం లోగోలను ముద్రించాలని ఎఫ్‌సిఐతోపాటు కేరళ ఆహార శాఖకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి జిఆర్ అనిల్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 550 రేషన్ షాపుల్లో ప్రధాన మంత్రి సెల్ఫీ పాయింట్లను నెలకొల్పాలని కూడా కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని మంత్రి తెలిపారు.

డిఎస్‌సి-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు

మార్చి 15 నుంచి డిఎస్‌సి

• 30 వరకు పరీక్షలు
• నోటిఫికేషన్ విడుదల చేసిన మంత్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గానూ రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సి-2024కు నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేసింది. రాష్ట్ర సచివాలయంలోని కలెక్టర్ల కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ డిఎస్‌సి-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ డిఎస్‌సి ద్వారా 2,280 ఎస్‌జిటి పోస్టులు, స్కూల్ అసిస్టెంట్లు 2,299, టిజిటిలు 1,264, పిజిటిలు 215, ప్రిన్సిపల్స్ 42 పోస్టులు కలిపి మొత్తం 6,100 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులకు సంబంధించిన ఫీజులను ఈ నెల 12 నుంచి 21 వరకు చెల్లించవచ్చని తెలిపారు. భర్తీ చేసిన దరఖాస్తులను ఈ నెల 22 వరకు తీసుకుంటామని అన్నారు. మార్చి 5 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. మార్చి 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ ద్వారా పరీక్షను నిర్వహించనున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 122 కేంద్రాల్లో డిఎస్‌సి పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మార్చి 31న ప్రాథమిక కీ విడుదల చేస్తామని, ఏప్రిల్ 1న ప్రాథమిక కీపై అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. ఏప్రిల్ 2న ఫైనల్ కీ విడుదల చేసి ఏప్రిల్ 7న డిఎస్‌సి -2024 ఫలితాలు విడుదల చేస్తామని చెప్పారు. 2018 సిలబస్ ప్రకారమే డిఎస్‌సి పరీక్షలు వుంటాయన్నారు. జనరల్ కేటగిరి అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితి 44 ఏళ్లు కాగా, రిజర్వ్ కేటగిరి అభ్యర్థులకు మరో ఐదేళ్ల గడువు ఎక్కువ అని అన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్ మాట్లాడారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలున్నా, ఫిర్యాదులు చేయాలన్నా 9505619127, 9705655349 నెంబర్లకు ఫోన్ చేయొచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ http//cse.gov.in వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

డిఎస్‌సి 2024 జిల్లాల వారీ పోస్టులు 2

గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్

• 52 మందికి అస్వస్థత
• ఏరియా ఆస్పత్రికి ఏనిమిది మంది తరలింపు

బొలెరోను ఢీకొన్న లారీ

• ముగ్గురు మృతి
• రిసెప్షన్‌కు వెళ్లి వస్తుండగా ప్రమాదం

3

తమిళనాడు గవర్నర్ వికృత పోకడ

అసెంబ్లీ నుండి అర్ధంతరంగా వెళ్లిపోయిన వైనం

కేంద్రాన్ని విమర్శించే ప్రసంగం చదవనంటూ వ్యాఖ్యలు

చెన్నై : సోమవారం అసెంబ్లీ సమావేశాల నుండి గవర్నర్ రవి అర్ధంతరంగా లేచి వెళ్లిపోయారు. కేంద్రాన్ని విమర్శించేలా తమిళనాడు ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగాన్ని చదివేందుకు ఆయన తిరస్కరించారు. మధ్యలోనే ప్రసంగాన్ని ఆపివేసి, జాతీయ గీతాన్ని ఆలపించేవరకు వుండకుండానే సత్వరున లేచి వెళ్ళిపోయారు.

2024 సంవత్సరానికి అసెంబ్లీ సమావేశాల ప్రారంభోత్సవ ప్రసంగం చేయడం తన గౌరవంగా భావిస్తున్నానని తొలుత వ్యాఖ్యానిస్తూ కేవలం నాలుగు నిముషాల పాటు మాత్రమే ఆయన మాట్లాడారు. డిఎంకె ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగంలో కొన్ని పేరాలతో తాను ఏకీభవించలేనని, వాస్తవిక, నైతిక ప్రాతిపదికన వాటితో విభేదిస్తున్నానని గవర్నర్ సొంత భాష్యం చెప్పారు. రాజ్యాంగ నియమాలను, సభా మర్యాదలను ఆయన మరోసారి తుంగలో తొక్కారు. జాతీయ గీతానికి తగిన గౌరవం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. తమిళ భాషను ప్రశంసిస్తున్న గీతాన్ని సభా ప్రారంభానికి ముందుగా ఆలపించడం, సమావేశాల ముగింపులో జాతీయ గీతాన్ని ఆలపించడం తమిళనాడులో సంప్రదాయంగా వస్తోంది.

తమిళనాడు అసెంబ్లీలో ప్రసంగిస్తున్న గవర్నర్ రవి

గవర్నర్ వెళ్లిపోవడంతో ఆ తర్వాత ఆ ప్రసంగాన్ని స్పీకర్ ఎం.అప్పవు చదివి వినిపించారు. బిజెపి ఎంఎల్‌ఎలతో సహా పాలక, ప్రతిపక్ష సభ్యులందరూ సమావేశం ముగిసేవరకు సభలోనే వున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్ల కేంద్రం అనుసరిస్తున్న వివక్షను ఎత్తిచూపుతూ ఆ ప్రసంగం సాగింది. జిఎస్‌టి, చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయకపోవడం వంటి అంశాలను ప్రస్తావించింది. పైగా తమిళనాడు పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) అమలు చేసేందుకు అనుమతించేది లేదని తేల్చి చెప్పింది. దీనివల్ల భిన్నత్వంలో ఏకత్వం అన్న ఉద్దేశ్యానికే తీవ్రమైన ముప్పు మిగతా 7లో

సమాన పనికి సమాన వేతనం

విద్యుత్ స్ట్రగుల్ కమిటి మహాధర్నాలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్‌రంగంలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి అమలు చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థలన్నింటిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మహాధర్నాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను తక్షణం పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న పోరాటాలకు పిడిఎఫ్ అండగా వుంటుందని అన్నారు. ఈ ధర్నానుద్దేశించి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటి చైర్మన్ పి సుదర్శన్‌రెడ్డి, జనరల్ సెక్రటరి వి సుబ్బి రెడ్డి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావులు మాట్లాడారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, అవుట్‌సోర్సింగ్, ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని వారు కోరారు. పర్మనెంట్ ఉద్యోగులు చేస్తున్న పనినే కాంట్రాక్టు కార్మికులు చేస్తుంటే ఉద్యోగులతో

అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, పి సుదర్శన్‌రెడ్డి, వి సుబ్బి రెడ్డి, ఎవి నాగేశ్వరరావు తదితరులు

సమానముగా వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశాలు వున్నా విద్యుత్ సంస్థల్లో అమలుకావడం లేదన్నారు.అలాగే కాంట్రాక్టు కార్మికులకు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వున్న వేతనభేదాలను తొలగించాలని కోరారు. విద్యుత్ సంస్థల్లో ప్రమాదకరమైన పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు అతితక్కువ వేతనాలను ఇస్తున్నారని అన్నారు. విద్యుత్ సంస్థల్లో వున్న థర్డ్ పార్టీ విధానంతో కార్మికులకు పూర్తిగా అన్యాయం జరుగుతోందని, తక్షణం థర్డ్‌పార్టీ విధానాన్ని రద్దు చేసి యాజమాన్యాలే నేరుగా వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులకు పిఆర్‌సి బకాయిలను, అరియర్స్‌ను చెల్లించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో వున్న మూడు డిఎలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అలాగే విద్యుత్ కార్మికులందరికీ నగదురహిత వైద్యసౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ రూ 10లక్షల గ్రాట్యుటిని చెల్లించాలని అన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పదన్నోతలను సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్‌కమిటి నాయకులు సూరిబాబు, ఎం మోహన్‌రావు, బి గంగయ్య , రాజు, చంద్ర శేఖర్, రసూల్ తదితరులు మాట్లాడారు.

బల పరీక్షలో నెగ్గిన నితీష్

పాట్నా : బీహార్ సిఎం నితీష్ కుమార్ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం సోమవారం విశ్వాస పరీక్షలో గట్టెక్కింది. ప్రతిపక్ష మహాఘట్ బంధన్ వాకౌట్ మధ్య జరిగిన ఓటింగ్‌లో విశ్వాస తీర్మానానికి అనకూలంగా 129 ఓట్లు వచ్చాయి. బలపరీక్షకు ముందే ఆర్జెడికి చెందిన స్పీకర్ అవద్ బిహారి చౌదరిని అవిశ్వాస తీర్మానం ద్వారా ఎన్డీయే తొలగించింది. స్పీకర్ స్థానంలో జెడి(యు)కు చెందిన డిప్యూటీ స్పీకర్ మహేశ్వర్ హజారీని కూర్చోబెట్టింది. విశ్వాస పరీక్షలో హజారీ ఓటును కూడా లెక్కించాలని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సూచించారు. ఓటింగ్‌లో టై ఏర్పడినప్పుడే స్పీకర్ స్థానంలో ఉన్న సభ్యుడు తన ఓటు వినియోగించుకునే వీలుంటుంది. 243 మంది సభ్యులున్న బీహార్ అసెంబ్లీలో ప్రభుత్వానికి సాధారణ మెజార్టీ లభించాలంటే కనీసం 122 మంది సభ్యుల మద్దతు అవసరం. జెడియుకి చెందిన ఒక ఎంఎల్ఎ బలపరీక్షకు గైర్హాజరయ్యారు. మరో ఎంఎల్ఎ హజారి డిప్యూటీ స్పీకర్‌గా సమావేశానికి అధ్యక్షత వహిస్తున్నందున ఆయన ఓటు వేయడానికి వీలుండదు. అందువల్ల ఎన్‌డిఎకి 126మంది సభ్యులే వున్నారు. ఈ పరిస్థితుల్లో ముగ్గురు ఆర్‌జెడి సభ్యులు నితీష్ శిబిరంలోకి ఫిరాయించారు. దీంతో నితీష్ బలం 129కి పెరిగింది. బిజెపి ఒక ఒప్పందాన్ని కుదుర్చుకునే భారతరత్న అవార్డులు ఇస్తోందని, బీహార్‌లో బిజెపిని అడ్డుకుంటామని బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ స్పష్టం చేశారు.

షరతులు అంగీకరిస్తేనే...

కెఆర్ఎంబికి ప్రాజెక్టుల అప్పగింతపై తెలంగాణ అసెంబ్లీ తీర్మానం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం విధించిన షరతులను అంగీకరిస్తేనే ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణా నది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి)కి అప్పగించాలని, షరతులను అంగీకరించకపోతే అప్పగించేది లేదని తెలంగాణ అసెంబ్లీలో తీర్మానించారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంతి ఉత్తమ కుమార్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. పరీవాహక ప్రాంతం, కరువు పీడిత ప్రాంతం, బేసిన్ జనాభా, సాగు చేయదగిన ప్రాంతం ఆధారంగా రెండు తెలుగు రాష్ట్రాలకు నీటి కేటాయింపులు చేయాలి చేయాలని, కృష్ణా వాటర్ డిస్‌పూట్ ట్రిబ్యునల్ (కెడబ్ల్యుడిటి) ప్రకారం ప్రాధాన్యతపై మొదట బేసిన్ అవసరాలు తీర్చాలని, సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) నిబంధనల ప్రకారం శ్రీశైలం నుంచి జలాలను వినియోగించుకోవడానికి అనుమతి ఇవ్వాలని, కృష్ణా బేసిన్ బయట ప్రాజెక్టులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిని తరలించరాదని అసెంబ్లీ డిమాండ్ చేసింది. ఈ షరతులకు అంగీకరించకుండా కృష్ణా ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. 'కృష్ణా నది దక్షిణ తెలంగాణా ప్రాంతాలకు నీటిపారుదల, తాగునీటి అవసరాలకు జీవనాధారం. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 811 టిఎంసిల నీటిని కేటాయించారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా గణనీయమైన నీటిపారుదల సామర్థ్యాన్ని సృష్టించాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కృష్ణా బేసిన్ అవసరాలపై తగిన శ్రద్ధ చూపకపోవడంతో అప్పటి ప్రభుత్వం తెలంగాణకు 299 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిల నీటి భాగస్వామ్యానికి రెండు రాష్ట్రాల మధ్య తీవ్ర అన్యాయమైన నిష్పత్తికి అంగీకరించింది. ఎపి పునర్ వ్యవస్థీకరణ చట్టం 2014 ద్వారా, రెండు రాష్ట్రాల మధ్య నీటి భాగస్వామ్యాన్ని నియంత్రించడానికి కెఆర్ఎంబి సృష్టించబడింది. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఉమ్మడి ప్రాజెక్టులు అంటే... శ్రీశైలం డ్యాం, నాగార్జునసాగర్ డ్యామ్‌లను కెఆర్ఎంబి నియంత్రణకు అప్పగించాలని కూడా అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించింది' అంటూ తెలంగాణ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సోమవారం అసెంబ్లీలో తీర్మానంలో పేర్కొన్నారు. ఈ తీర్మానంపై చర్చ సందర్భంగా అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. కృష్ణా ప్రాజెక్టులను కెఆర్ఎంబికి అప్పగించేందుకు మీరే

అసెంబ్లీలో మాట్లాడుతున్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

అంగీకారం తెలిపారని మంత్రి ఉత్తమ్, బిఆర్ఎస్ సభ్యులు హరీష్‌రావు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఈ సమయంలో సిఎం రేవంత్‌రెడ్డి కల్పించుకొని, దొంగలకు సద్ది మోసే విధానం మంచిది కాదని బిఆర్ఎస్ సభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సభలో కృష్ణా జలాలపై చర్చ జరుగుతుంటే విపక్షనేత కెసిఆర్... ఫామ్ హౌస్‌లో పడుకుంటారా? ఆయన నిబద్ధత ఇదేనా? అని ప్రశ్నించారు. తీర్మానానికి అనుకూలమా? వ్యతిరేకమా? స్పష్టం చేయాలని ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీని కోరారు. హరీష్‌రావు మాట్లాడుతూ మిగతా 2లో

చేనేత కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- ధర్మవరం టౌన్

అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలో సోమ వారం చోటుచేసుకుంది. హిందూపురం రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... ధర్మవరం పట్టణం కేతిరెడ్డి కాలనీకి చెందిన నీలూరి రామాంజినేయులు (50) రెండు కూలి మగ్గాలు ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించు కుంటున్నారు. చేనేతలో నేసిన చీరకు గిట్టుబాటు ధర లభించలేదు. ముడిసరుకుల కోసం, కుటుంబ అవసరాల కోసం రూ.3.50 లక్షల వరకు అప్పులు చేశారు. వీటిని ఎలా తీర్చాలా అంటూ తరచూ తీవ్ర మనోవేదనకు గురయ్యేవారు. ఈ క్రమంలో కేతిరెడ్డి కాలనీ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే కీమెన్ గమనించి హిందూపురం రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రామాంజినేయులుకు భార్య సరోజమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

బుల్డోజర్ కూల్చివేతలు ఫ్యాషన్ అయిపోయింది

• స్థానిక సంస్థల అధికారులపై మధ్యప్రదేశ్ హైకోర్టు ఆగ్రహం 7

పట్టణాల్లో నిరుద్యోగిత 6.5%

మహిళల నిరుద్యోగిత రేటు 8.6 శాతం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం రేటు మూడో త్రైమాసికంలో (అక్టోబరు-డిసెంబరు 2023) 15 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న వ్యక్తులకు 6.5 శాతంగా నమోదైంది. మహిళల నిరుద్యోగిత రేటు 8.6 శాతం నమోదైంది. ఈ మేరకు కేంద్ర గణాంకాల, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో శ్రామికశక్తి భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్‌పిఆర్) 2022 మూడో త్రైమాసికంలో 48.2 శాతం నుండి 15 ఏళ్ళ, అంతకంటే ఎక్కువ వయసు గల వ్యక్తుల కోసం 2023 మూడో త్రైమాసికంలో 49.9 శాతానికి పెరుగుతున్న ధోరణిని చూపించిందని మంత్రిత్వశాఖ తెలిపింది. అదే కాలంలో, మహిళా శ్రామికశక్తి భాగస్వామ్య రేటు 22.3 శాతం నుంచి 25 శాతానికి పెరిగింది. ఇది ఎల్ఎఫ్‌పిఆర్‌లో మొత్తం పెరుగుతున్న ధోరణిని ప్రతిబింబిస్తుందని తెలిపింది. వర్కర్-పాపులేషన్ రేషియో (డబ్ల్యుపిఆర్)లో పెరుగుతున్న ట్రెండ్ గుర్తించింది. పట్టణ ప్రాంతాల్లో

ఎల్ఎఫ్‌పిఆర్ అక్టోబర్ - డిసెంబర్ 2022లో 44.7 శాతం నుండి అక్టోబర్ - డిసెంబర్ 2023 నాటికి 46.6 శాతానికి పెరిగింది. పురుషుల్లో ఈ కాలంలో ఇది 68.6 శాతం నుండి 69.8 శాతానికి పెరిగింది. మహిళల్లో ఇది 20.2 శాతం నుండి 22.9 శాతానికి పెరిగింది. ఏప్రిల్-జూన్ 2023లో పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు ఏడాది క్రితం 7.6 శాతం నుండి 6.6 శాతానికి తగ్గింది. ప్రధానంగా దేశంలో కోవిడ్-సంబంధిత పరిమితుల అస్థిరమైన ప్రభావం కారణంగా ఏప్రిల్-జూన్ 2022లో నిరుద్యోగం ఎక్కువగా ఉంది.

కృష్ణా జలాల వివాదం కేసు మార్చి 13కు వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా జలాల వివాదం కేసు విచారణను సుప్రీంకోర్టు మార్చి 13కు వాయిదా వేసింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కృష్ణా ట్రిబ్యునల్-2 టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టిఒఆర్) కృష్ణా ట్రిబ్యునల్-2కు సంబంధించిన టిఒఆర్‌పై స్టే విధించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గత విచారణ సందర్భంగా కేంద్రం, తెలంగాణ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఎపి దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. మరోసారి ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఎపి ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ... కేసుకు సంబంధించి ప్లీడింగ్స్ పూర్తయ్యాయని, వాదనలకు కొంత సమయం కావాలని కోరారు. ఇందుకు అంగీకారం తెలిపిన ధర్మాసనం విచారణను మార్చి 13కు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది.

గ్రూప్ -2 ప్రిలిమ్స్ పరీక్షలు

- 40 రోజులు వాయిదా వేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రూపు-2 ప్రిలిమ్స్ పరీక్షలు 40 రోజులు వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఐదేళ్ల తర్వాత ఎఫిషియన్సీ విడుదల చేయడం జరిగినప్పటికీ నిరుద్యోగులకు సరిపడినంత గడువు లేకుండా ఈ నెల 25న పరీక్షల తేదీగా ప్రకటించడం సరికాదన్నారు. ఈ మేరకు సోమవారం ఎపిపిఎస్‌సి ఛైర్మన్‌కు డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న లేఖ రాశారు. 2016 నోటిఫికేషన్ విడుదల నాటి నుంచి ప్రిలిమ్స్ వరకు దాదాపు 108 రోజులు, 2018లో నోటిఫికేషన్ విడుదల సందర్భంగా ప్రిలిమ్స్ దాదాపు 126 రోజులు సమయం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఉద్యోగోన్నతుల కమిటీలో సోషల్ వెల్ఫేర్ కార్యదర్శిని నియమించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగోన్నతులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఐఎఎస్ అధికారుల కమిటీలో సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి, సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శులను మినహాయించడం తగదని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగోన్నతులకు సంబంధించి అధ్యయనం చేసేందుకు వేసిన కమిటీలో సాధారణ పరిపాలన, సాంఘిక సంక్షేమశాఖ అధికారులను మినహాయించడం సరైందికాదన్నారు. ఉద్యోగి పనిచేసే పోస్టులో సీనియారిటీని కాదని ఉద్యోగంలో చేరిన తేదీ నుండి సీనియారిటీని తీసుకోవాలని కోరారు.

గిరిజన సంక్షేమశాఖలో జిల్లాల అధికారులను నియమించండి

- ఎపి గిరిజన సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన సంక్షేమశాఖలో రాష్ట్ర వ్యాప్తంగా చాలా జిల్లాల్లో అధికారులు, సరైన సిబ్బంది లేకపోవడంతో గిరిజనులకు సక్రమంగా సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, ప్రభుత్వం తక్షణమే అధికారులను నియమించాలని ఎపి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి గోపిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎన్‌టిఆర్, అన్నమయ్య అనంతపురం జిల్లాల్లో గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారులు లేరని తెలిపారు. పేరుకు ఇన్‌ఛార్జులున్నా గిరిజనులకు అందుబాటులో వుండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కార్యాలయాలకు వెళితే సమాధానం కూడా చెప్పడం లేదని అన్నారు. ఇటీవల ఎన్‌టిఆర్ జిల్లా జి కొండూరులో కిడ్నీ వ్యాధితో చనిపోతున్న వాళ్లకు ఎలాంటి సాయం అందడం లేదని తెలిపారు. చనిపోయిన కుటుంబాలకు మట్టి ఖర్చులు కూడా అందడం లేదని అన్నారు. ట్రైకార్ పథకాలు అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖలో వున్న సీనియారిటీ జాబితా తయారుచేసి ప్రభుత్వానికి పంపించి తక్షణం ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రభుత్వ విధాన నిర్ణయాల వెనుక ఆయాచిత లబ్ధి

- రఘురామ పిల్ విచారణార్హతపై 15న హైకోర్టు విచారణ

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయాల వెనుక సిఎం వైఎస్ జగన్, ఆయన ఆప్తులకు ఆయాచిత లబ్ధి చేకూరుతోందని, ఈ వ్యవహారాలపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత (పిల్) వాజ్య విచారణార్హతపై ఈ నెల 15న విచారణ చేస్తామని హైకోర్టు ప్రకటించింది. నర్సాపురం వైసిపి ఎంపి కనుమూరి రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిల్ సోమవారం విచారణకు వచ్చింది. వైఎస్ జగన్ తరపు న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ కల్పించుకుని, పిటిషనర్ దాఖలు చేసిన రిప్లై కౌంటర్ ఆదివారం రాత్రి అందిందని, వాదనలకు గడువు కావాలని కోరారు. దీంతో విచారణను ఈ నెల 15కు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తులు జస్టిస్ యు దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

యాత్ర-2 డైరెక్టరుకు భూములు కట్టబెట్టడం తగదు: సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన వ్యక్తిగత జీవితాన్ని ప్రమోట్ చేసుకునేందుకు నిర్మించిన యాత్ర-2 సినిమా దర్శకుడు మహి వి రాఘవకు ప్రభుత్వ భూములను కట్టబెట్టడం తగదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. పర్యాటకంగా ప్రసిద్ధిగాంచిన హార్సీలీ హిల్స్‌పై భూమిని ఇవ్వడంపై ఆగ్రహించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి వ్యక్తిగత జీవితంపై సినిమా తీసిన దర్శకుడుకు వీలైతే తన ఇడుపులపాయలోని సొంతభూమి ఇవ్వాలి తప్ప ప్రభుత్వ భూమి ఇవ్వడం సరైందికాదన్నారు. తక్షణం హార్సీలీ హిల్స్ భూముల కేటాయింపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు పునర్నిర్మాణం కోసం మానవహారాలు

- అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకూ ఊరూరా కదిలిన ప్రజలు

ప్రజాశక్తి - అనకాపల్లి, మునగపాక, అచ్యుతాపురం విలేకరులు

అచ్యుతాపురం మండలం హరిపాలెంలో మానవహారం చేపట్టిన స్థానికులు

శిథిలమైన రోడ్డును వెంటనే పునర్నిర్మాణం చేయాలని, భారీ వాహనాలను తిరగకుండా నియంత్రించి ప్రజల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి బైపాస్ రోడ్డు నుంచి అచ్యుతాపురం వరకూ సోమవారం భారీ మానవహారాలు జరిగాయి. రహదారి పునర్నిర్మాణ పోరాట కమిటీ ఆధ్వర్యాన అనకాపల్లి బైపాస్ రోడ్డు, నాగులాపల్లి, ఒంపోలు, మునగపాక, అచ్యుతాపురం, తిమ్మరాజుపేట, కొండకర్ల జంక్షన్, హరి పాలెం తదితర చోట్ల ఈ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కదిలివచ్చిన ప్రజానీకం రహదారి సమస్యపై పెద్దపెట్టున నినాదాలు చేశారు. మునగపాక మండల కేంద్రంలో జరిగిన మానవహారాన్ని ఉద్దేశించి సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె లోకనాథం మాట్లాడుతూ ఏళ్ల తరబడి రోడ్డు శిథిలమై ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వాలు మారుతున్నా రహదారి కష్టాలు తీరడంలేదని అన్నారు. అచ్యుతాపురంలోని కంపెనీలకు భారీ వాహనాలు పరవాడ, రాంబిల్లి మార్గాల మీదుగా వెళ్లాల్సి ఉండగా సమయం కలిసొస్తుందని అనకాపల్లి బైపాస్ నుంచి వెళ్లడంతో రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. కంపెనీల నుంచి వచ్చే సిఎస్ఆర్ నిధులతో రహదారులతో పాటుగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు. కానీ ఆ నిధులు దళారుల జేబుల్లోకి వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు రాబట్టుకుని రహదారుల పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పది రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభం కాకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో రహదారి పునర్నిర్మాణ కమిటీ కన్వీనర్ కాంగ్రెసు రామసదాశివరావు, సిపిఎం నాయకులు వివి.శ్రీనివాసరావు, కర్రి అప్పారావు, అనకాపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ పైడారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, పలు రాజకీయ పార్టీల నాయకులు, గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

డిఎస్‌సి 2024 జిల్లాల వారీ పోస్టులు

నెం	జిల్లా	ఎస్‌జిటి	స్కూల్ అసిస్టెంట్	టిజిటి	మొత్తం
1	శ్రీకాకుళం	104	130	49	283
2	విజయనగరం	103	97	84	284
3	విశాఖపట్నం	101	133	95	329
4	తూర్పుగోదావరి	108	182	102	392
5	పశ్చిమగోదావరి	102	145	59	306
6	కృష్ణా	103	111	65	279
7	గుంటూరు	109	170	137	416
8	ప్రకాశం	111	299	93	503
9	నెల్లూరు	104	140	102	346
10	చిత్తూరు	101	97	139	336
11	కడప	105	81	103	289
12	అనంతపురం	107	164	115	386
13	కర్నూలు	1022	550	121	1693
	మొత్తం	**2,280**	**2,299**	**1,264**	**5,843**

ఎస్‌జిటి- 2280, ఎస్ఎ- 2299, టిజిటి-1264,
పిజిటి- 215, ప్రిన్సిపల్ 42, మొత్తం-6,100

ఆదినారాయణ మృతి ప్రజా సైన్సుకు తీరని లోటు

- జెవివి రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉమ్మడి రాష్ట్రంలో సైన్సుపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు అహర్నిశలూ కృషి చేసిన జన విజ్ఞాన వేదిక (జెవివి) తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ ఆదినారాయణ మృతి సైన్సు ఉద్యమానికి తీరని లోటని జెవివి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గేయానంద్, కుర్ర రామారావు అన్నారు. ఈ మేరకు ఆదినారాయణ మృతిపట్ల వారు సోమవారం సంతాపాన్ని తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు. ఆదినారాయణ 73 ఏళ్ల వయసులోనూ ప్రజలకు సైన్సు పట్ల అవగాహన కల్పించేందుకు తపించేవారని తెలిపారు. ప్రొఫెసర్ ఆదినారాయణ 2016-18 మధ్య తెలంగాణ రాష్ట్ర జెవివి అధ్యక్షులుగా నిజాయతీగా, అంకిత భావంతో పనిచేశారని పేర్కొన్నారు. ప్రయోగాల ద్వారా సైన్సు టీచింగ్ అనే శిక్షణ కార్యక్రమాల్లో ఆయనది కీలకమైన పాత్ర అని కొనియాడారు. సైన్సు టీచింగ్‌కు సంబంధించిన జెవివి తయారు చేసే మ్యాన్యువల్స్‌ను రూపొందించేవారని తెలిపారు. తెలంగాణలోని జనగామ పట్టణంలో జరుగుతున్న చెకుముకి సంబరాల్లో పాల్గొంటూ గుండెపోటుతో మరణించారని తెలిపారు. తన జీవితంలోనే చివరి క్షణం దాకా, ప్రజా సైన్సు కోసం పని చేశారని కొనియాడారు. ఆదినారాయణ మృతి పట్ల జెవివి ఎపి రాష్ట్ర కమిటీ సంతాపాన్ని తెలుపుతుందని పేర్కొన్నారు.

కెసిఆర్ అసమర్థతతో తెలంగాణకు తీరని నష్టం

- జలదోపిడీని అడ్డుకుంటాం
- తెలంగాణ అసెంబ్లీలో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

అసెంబ్లీలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు

కృష్ణా జలాల వాటా, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి)కు ప్రాజెక్టుల అప్పగింతపై సోమవారం తెలంగాణ అసెంబ్లీలో మాటల తూటాలు పేలాయి. ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. తప్పు మీదంటే... మీదని అధికార, విపక్ష సభ్యులు వాగ్వివాదానికి దిగారు. తమ దగ్గర ఉన్న పైళ్లు, కాగితాలు, వీడియో క్లిప్పింగ్‌లను సాక్ష్యాల కింద చూపే ప్రయత్నం చేశారు. 'కృష్ణా ప్రాజెక్టులపై వాస్తవాలు... బిఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలు' పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కారు నోట్ విడుదల చేశారు. కృష్ణా నదిపై ప్రాజెక్టులను కెఆర్ఎంబికి అప్పగించవద్దని ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చ జరిగింది. కెసిఆర్ పదేళ్ల పాలనలో జరిగిన తప్పుడు విధానాలే ఇప్పుడు తెలంగాణకు శాపాలయ్యాయని ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏకరువు పెట్టారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో జరిగిన జలదోపిడీని అడ్డుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాజెక్టులను కెఆర్ఎంబికి అప్పగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బచావత్ ట్రిబ్యునల్ ఎలాంటి నీటి కేటాయింపులూ చేయకున్నా ఎపికి 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు కేటాయించేందుకు కెసిఆర్ అంగీకరించారన్నారు. కృష్ణా జలాల్లో 70 శాతం హక్కులు పొందేందుకు తెలంగాణకు అర్హత ఉన్నా, కెసిఆర్ ఆ దిశగా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో జరిగిన అవినీతి స్వతంత్ర భారతంలో ఎప్పుడూ జరగలేదని దుయ్యబట్టారు. జగన్, కెసిఆర్ గంటల తరబడి ఏకాంత చర్చలు చేశారని, అలయ్‌బలయ్ చేసుకున్నారని, కలిసి బిర్యానీలు తిన్నారని విమర్శించారు. కెసిఆర్ చాలా గొప్పవారని ఎపి అసెంబ్లీలో జగన్ పొగిడారని గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ అసెంబ్లీకి రాని ప్రతిపక్ష నేత కెసిఆర్... నల్లగొండ సభకు ఎలా వెళతారని ప్రశ్నించారు. ఇఎన్‌సి మురళీధర్‌రావును బిఆర్ఎస్ తమకు అనుకూలంగా మాట్లాడించిందని ఆరోపించారు. రిటైరైనా పదేళ్ల పాటు బిఆర్ఎస్ సర్కారు ఆయనను కొనసాగించిందన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు సభను తప్పుదోవపట్టిస్తున్నారని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు మాట్లాడుతూ పిపిటి ద్వారా ప్రభుత్వం అబద్ధాలు చెప్పిందని విమర్శించారు. కెఆర్ఎంబికి ప్రాజెక్టులను అప్పగించబోమని ప్రభుత్వం ప్రకటన చేయడం తెలంగాణ ప్రజలు, బిఆర్ఎస్ విజయమని అన్నారు.

నల్లగొండలో సభ పెడుతున్నందునే మంత్రి ఈ ప్రకటన చేశారని, తప్పులను సవరించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు వ్యాఖ్యపై కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లాను మోసం చేసినందునే ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్‌ను ఓడించారన్నారు. ఎపి సిఎం జగన్ అక్కడ అసెంబ్లీలో చెప్పిన తర్వాత కూడా తామే తప్పు చేసినట్టు మాట్లాడితే ఎలా? అని నిలదీశారు. బిఆర్ఎస్ పుణ్యామా అని తాగునీటికి ట్యాంకర్లు పెట్టాల్సి వస్తోందని అన్నారు. కృష్ణా జలాల విషయంలో ముక్కు నేలకు రాసి కెసిఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోమటిరెడ్డి డిమాండ్ చేశారు.

ఐఆర్, పిఆర్‌సి ఊసే లేదు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్, పాల్గొన్నారు.

త్వరలో 12వ పిఆర్‌సి : మంత్రి బొత్స

చర్చల సారాంశాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ మీడియాకు వెల్లడిస్తూ పిఆర్‌సిని త్వరిత గతిన ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇప్పటికే పిఆర్‌సి కమిషన్ వేశామన్నారు. అయితే, ఎప్పుడు పిఆర్‌సి వేస్తారన్న విషయాన్ని ఆయన స్పష్టం చేయలేదు. ఉద్యోగ సంఘాలు మధ్యంతర భృతిని కోరాయని ఆ అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

ప్రభుత్వం దాట వేత ధోరణి: యుటిఎఫ్

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దాట వేత ధోరణి అవలంబించిందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తాము ప్రభుత్వం ముందు ఉచ్చిన ప్రతిపాదనలను వివరించారు. ప్రభుత్వం ఏ సమస్య పరిష్కారానికి ముందుకు రాని నేపథ్యంలో ఇప్పటికే ఎపిజెఎసి ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ యధావిధిగా కొనసాగుతుందన్నారు. సిపిఎస్ , జిపిఎస్ రద్దుతో పాటు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ మెమో 57పరిధిలోకి వచ్చే వారికి పాత పెన్షన్ అమలు చేయాలని, సరెండర్ లీవ్, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎ, 11వ పిఆర్‌సి బకాయిలు, సిపిఎస్ వారికి 90శాతం డిఎ బకాయిలు, మెడికల్ బిల్స్, పెన్షనర్లకు తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ సవరించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మంత్రి వర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్లారు. వీటితో పాటు 12వ పిఆర్‌సికి సంబంధించి 30శాతం ఐఆర్ ప్రకటించాలని, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న వారికి కారుణ్య నియామకాలు చేపట్టాలని, కెజిబివిలకు మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలని, అంతర్ జిల్లా బదిలీలు జరపడంతో పాటు ఎంటిఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, ఎఎఎస్ అమల్లో ఉన్న ఇబ్బందులను సవరించాలని, హైస్కూల్ ప్లస్ వారికి ఇవ్వాల్సిన అడిషనల్ ఇంక్రిమెంట్ అమలు చేయాలని, ఎపిజిఎల్ఐ లావాదేవీలను పునరుద్ధరించాలని, ఆన్‌లైన్ ఆలస్యమైతే ఫిజికల్‌గానైనా అనుమతించాలని యుటిఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

యధాతథంగా ఉద్యమ కార్యాచరణ: ఎపి ఎన్‌జిఓ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిరుత్సహపరిచిందని ఎపి ఎన్‌జిఓ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎపి జెఎసి ప్రకటించిన 14నుంచి 27వరకు షెడ్యూల్ మధ్యంతర భృతి విషయంలో ప్రభుత్వం స్పందించలేదని,పిఆర్‌సి కమిషన్ వేసినా ఆయన కమిషన్ వేసినా ఆయన కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా లేదన్నారు.

బకాయిలు తెలిశాయి : బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల్లో కొత్త దనం ఏమీ లేదని, ప్రభుత్వం ఉద్యోగులకు ఎంత బకాయి పడిందో ఈ సమావేశం ద్వారా తెలుసుకోగలిగామని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మార్చి నెలాఖరుకు కొన్ని బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పిందని, రూ.600కోట్లు ఎపిజిఎల్ఐ బకాయిలు ఉన్నాయన్నారు. సిపిఎస్ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ కూడా రూ.2500కోట్ల మేర చెల్లింపులు చేస్తామని ప్రభుత్వం హామీనిచ్చిందన్నారు. హత్యకు గురైన తహశీల్దార్ రమణయ్య కుటుంబానికి రూ.50లక్షల పరిహారంతో పాటు కారుణ్య నియామకం కింద కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పినట్లు ఆయన వెల్లడించారు.

డిఎ, మధ్యంతర భృతిపై చర్చించాం: సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకటరామిరెడ్డి

డిఎ, మధ్యంతర భృతిపైనా సమావేశంలో చర్చించామని సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. రూ.5,600కోట్ల మేర ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు మార్చి 31నాటికి చెల్లిస్తామని ప్రభుత్వం వెల్లడించిందన్నారు. సిపిఎస్ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ రూ.2,400కోట్లు పెండింగ్‌లో ఉందని మార్చి 31నాటికి జమచేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు.



ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుకు కృషి చేయాలని కోరుతూ లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

కేసుల మాఫీ కోసం ఎంపీల తాకట్టు

- ఏనాడైనా ప్రధానిని ప్రత్యేక హోదా అడిగారా?
- శంఖారావం సభలో జగన్‌కు లోకేష్ ప్రశ్న

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

తన కేసుల మాఫీ కోసమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రానికి ఎంపీలను తాకట్టు పెట్టారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. శంఖారావం యాత్రలో భాగంగా రెండో రోజు సోమవారం నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. 25 మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానన్న జగన్... హోదా కోసం ఏనాడైనా ప్రధానిని అడిగారా? అని ప్రశ్నించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్ పేరు కూడా ఛార్జిషీట్‌లోకి రాబోతుందని అన్నారు. ఇసుక పేరుతో జగన్ లూటీ చేశారని ఆరోపించారు. మాజీ సైనికుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్తరాంధ్రను ఎంపీలు విజయసాయిరెడ్డి, వైవి.సుబ్బారెడ్డి దోచేస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక తిన్నదంతా కక్కిస్తామన్నారు. రెండో రోజూ పలువురు లోకేష్‌ను కలిసి వినతిపత్రాలు అందించారు. సిపిఎస్‌తోపాటు మోసపూరిత జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఎపి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని, గోపాలమిత్ర పథకాన్ని పునరుద్ధరించి గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇలా పలు రకాల సమస్యలపై పలువురు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

ఓటర్ల బదిలీ పట్ల అప్రమత్తం : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : వైసిపి తమ అభ్యర్థులతోపాటు ఓటర్లను కూడా ఒకచోట నుంచి మరొక చోటుకు బదిలీ చేస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి విమర్శించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాపోరు రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి 29 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిల్లో ప్రజాపోరు యాత్ర నిర్వహిస్తామన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో స్థానికంగా లేనివారి పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయన్నారు. విశాఖలో కూడా కేంద్ర ఎన్నికల సంఘం విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ధన్యజీవి వెంకటస్వామి

- సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-పొదిలి

కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరించడంతో పాటు తాను నమ్మిన పార్టీకి వారసత్వాన్ని అందించిన ఘనత వెంకట స్వామికి దక్కుతుందని రాజ్యసభ మాజీ సభ్యులు, సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి.మధు అన్నారు. కెల్లంపల్లి మాజీ సర్పంచ్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తండ్రి వెంకటస్వామి సంతాప సభ సోమవారం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో మధు మాట్లాడుతూ.. కలరా వ్యాధి ప్రబలి గ్రామాలలో ప్రజలు తీవ్ర అనారోగ్యం బారిన పడిన కష్టకాలంలో కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు వైద్యం నేర్చుకుని పేదలకు వైద్యం అందించిన గొప్ప వ్యక్తి వెంకటస్వామి అని కొనియాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అభ్యుదయ విలువలు పాటిస్తూ... ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ.. గ్రామంలో సంస్కృతి, సంప్రదాయాలను వెంకటస్వామి పరిరక్షించారన్నారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. కట్టుబాట్లతో కునారిల్లుతున్న వెనుకబడిన గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతం చేశారని తెలిపారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిఐటియు రాష్ట్ర నాయకులు కె. సుబ్బరావమ్మ, సిపిఎం ప్రకాశం జిల్లా కార్యదర్శి హనీఫ్, సీనియర్ నాయకులు వై.సిద్ధయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఎం ప్రకాశం, బాపట్ల, నెల్లూరు, ఎన్‌టిఆర్, అంబేద్కర్ కోనసీమ జిల్లాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. తమ తండ్రి ఎంతో ఆత్మాభిమానం కలిగిన వ్యక్తి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. ఈ విషాద సమయంలో తనకు, తన కుటుంబానికి సానుభూతి తెలిపిన వారందరికీ శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

సమ్మె ఒప్పంద జిఓలను వెంటనే విడుదల చేయాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం యూనియన్ నేతలతో కుదుర్చుకున్న ఒప్పందాలకు సంబంధించిన జిఓల జారీ చేయడంలో అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్షులు కె నాగభూషణం, ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మె పోరాటం వాయిదా వేసి నెలరోజులు గడిచినప్పటికీ పెంచిన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియో, మట్టి ఖర్చులు, సంక్షేమ పథకాలు, పర్మినెంటు సిబ్బందికి సరెండర్ లీవులు, జిపిఎఫ్ అకౌంట్లకు సంబంధించి జిఓలను జారీ చేయడంలో ప్రభుత్వం వెంటనే జిఓలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. చర్చల సందర్భంగా ఏ విధమైన షరతులు లేకుండా సమ్మెకాలం వేతనం చెల్లిస్తామని ఒప్పుకున్న ప్రభుత్వం.. ఇప్పుడు అందుకు భిన్నంగా 17 రోజులకు సమానంగా సెలవు దినాల్లో పనిచేయాలని నిబంధన విధించడం ఏ మాత్రం సమర్థనీయం కాదని, వెంటనే షరతులను ఉపసంహరించి సమ్మెకాలం వేతనాన్ని మున్సిపల్ కార్మికులతోపాటు కోవిడ్, వరదలు, కొత్తగా తీసుకున్న కార్మికులు, క్లాప్ ఆటో, డ్రైవర్లతోపాటు ఎన్ఎంఆర్ కార్మికులకు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికై 14న రూ.1000 కానుక, సమ్మెకాలం వేతనం వెంటనే చెల్లించాలని, ఇతర జిఓలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులందరితో సంతకాలు సేకరించి మేయర్, ఛైర్మన్, కమిషనర్లకు సామూహికంగా రాయభారాలు నిర్వహించాలని, అలాగే 15న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై సామూహిక రాయభారాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిఓలు జారీ చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యోగులు, కార్మికుల జాతీయ సమ్మెల్లో మున్సిపల్ కార్మికులు కూడా పాల్గొంటారని అన్నారు.

అనంత బాలోత్సవంలో చిన్నారుల ప్రదర్శన

'అనంత'లో బాలోత్సవ సంబరం

- ఆకట్టుకున్న ప్రదర్శనలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పిల్లల పండుగ అనంత బాలోత్సవం-2024 సంబరం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానంలో భారతరత్న, మాజీ ప్రధానమంత్రి పివి.నరసింహారావు ప్రాంగణంలో అనంత బాలోత్సం నిర్వహించారు. ఈ వేడుక మూడు రోజుల పాటు జరగనుంది. కల్చరల్, అకడమిక్ కలిపి 64 ఈవెంట్లలో చిన్నారులు ప్రదర్శన చేశారు. అంతకు మునుపు అనంత బాలోత్సవ కమిటీ చైర్మన్ షమీమ్ షఫీవుల్లా, ఇతర ప్రముఖులతో కలిసి జాతీయ జెండాను ఎగుర వేశారు. ఆ తర్వాత నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ... పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి అనంత బాలోత్సవం చక్కటి వేదికగా నిలిచిందన్నారు. ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో శాస్త్రవేత్తలు ఎంతో మంది ఉన్నారని, శాస్త్రీయమైన శాస్త్రవేత్తలు చాలా తక్కువ మంది ఉన్నారని, నేటి బాలలందరూ శాస్త్రీయమైన భావాలను అలవర్చుకుని శాస్త్రీయమైన భారతదేశాన్ని స్థాపించుకోవడంలో భాగస్వామ్యులు కావాలని కోరారు. మొదటి రోజు పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, అనంత బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, కోశాధికారి జిలాన్, లలితా కళాపరిషత్ అధ్యక్షులు ప్రభాకర్, కార్యదర్శి పద్మజ, జెవివి నాయకులు డాక్టర్ ప్రసూన, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, రవికాంత్ రమణ తదితరులు పాల్గొన్నారు.

షరతులు అంగీకరిస్తేనే...

(మొదటిపేజీ తరువాయి)

బిఆర్ఎస్ పార్టీ తలపెట్టిన నల్గొండ సభ వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తీర్మానం పెట్టిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ప్రాజెక్టులను కెఆర్ఎంబికు అప్పగించిందని విమర్శించారు. కృష్ణా జలాల వినియోగంపై మంత్రి ఉత్తమ్ అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సభ్యులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు మేలు జరిగేలా గత సిఎం కెసిఆర్ వ్యవహరించారని ఆరోపించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ టెండర్లను అపెక్స్ సమావేశంలో అడ్డుకునే అవకాశం ఉన్నా ఆ సమావేశానికి ఆయన ఉద్దేశపూర్వకంగా హాజరు కాలేదని విమర్శించారు. పోతిరెడ్డిపాడు నుంచి నీటిని అక్రమంగా తరలించుకుపోతున్నా అడ్డు చెప్పలేదన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో జరిగిన జలదోపిడీని అడ్డుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులను ఒత్తిడికి గురిచేసి తాము చెప్పినట్లే చేయాలని గత ప్రభుత్వం వారితో తప్పులు చేయించిందని దుయ్యబట్టారు. అధికారుల్లో బిఆర్ఎస్ ఏజెంట్లు చాలామంది ఉన్నారని, వారిపై త్వరలో చర్యలు ఉంటాయని అన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ చంద్రబాబు రెండోసారి సిఎం కాకూడదని కెసిఆర్ భావించారన్నారు. జగన్‌కు రాజకీయంగా లబ్ధి చేకూర్చాలనే ప్రాజెక్టుల విషయంలో మెతకవైఖరి ప్రదర్శించారని విమర్శించారు.

చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంటు కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. చంద్రబాబుకు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే అందుబాటులో లేకపోవడంతో వాయిదా వేయాలని చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోరారు. మూడు వారాల తరువాత విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎపి ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ స్పందిస్తూ.. కౌంటర్ దాఖలుకు గతంలో సమయం తీసుకుని ఇప్పుడు మళ్లీ వాయిదా కోరుతున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. చంద్రబాబు తరపున కౌంటర్ దాఖలు చేశారని చెప్పారు. విచారణకు తేదీని నిర్ణయించాలని కోరారు. తొలుత రెండు వారాల తరువాత లిస్ట్ చేయాలని ఆదేశించిన ధర్మాసనం, రంజిత్ కుమార్ విజ్ఞప్తితో ఈ నెల 26కు వాయిదా వేసింది.

వైసిపి రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రం నుండి మూడు రాజ్యసభ స్థానాలకు జరుగుతున్న ఎన్నికలకు వైసిపి అభ్యర్థులు వైవి సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి, గొల్ల బాబురావు సోమవారం నామినేషన్‌లను దాఖలు చేశారు. రాష్ట్ర శాసనసభలోని అసెంబ్లీ జాయింట్ సెక్రటరి, రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. అంతకుముందు క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరికి బిఫామ్‌లు అందచేశారు. నామినేషన్లు దాఖలు చేసిన అనంతరం వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు వైసిపిలో అధిక ప్రాధాన్యత వుంటుందని అన్నారు. గతంలో నలుగురు బిసిలను రాజ్యసభకు పంపితే, ప్రస్తుతం దళితుడైన గొల్ల బాబూరావుకు అవకాశం కల్పించారని అన్నారు. శాసన సభలో అత్యధిక బలం తమకే ఉందని, పోటీలో వున్న ముగ్గురం విజయం సాధిస్తామని చెప్పారు. కోట్లు ఖర్చు చేసినా దొరకని రాజ్యసభ స్థానాన్ని దళితుడినైన తనకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని ఈ సందర్భంగా గొల్ల బాబూరావు అన్నారు. చంద్రబాబునాయుడు గతంలో దళితుడైన వర్ల రామయ్యను ఓడిపోయే సీటుకు పోటీపెట్టి అవమానించారని చెప్పారు.

25 వేల పోస్టులు ప్రకటించాలి

- డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిమాండ్

ప్రజాశక్తి - యంత్రాంగం

25వేల టీచర్ పోస్టులతో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విశాఖ, ఏలూరు కలెక్టరేట్ల వద్ద సోమవారం డిఎస్‌సి అభ్యర్థులు ధర్నా చేశారు. దగా డిఎస్‌సి కాదు, మెగా డిఎస్‌సి కావాలని, ఐదు సంవత్సరాలకు 6,100 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడం సిగ్గుచేటని విమర్శించారు. 117 జిఒ రద్దు చేయాలని, మొత్తం ఖాళీ పోస్టులకు మెగా డిఎస్‌సి విడుదల చేయాలని, అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, కె.సంతోష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు పదిలక్షల మంది నిరుద్యోగులు డిఎస్‌సి కోసం ఎదురు చూస్తుంటే 6,100 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. తెలుగు మీడియం తీసివేసి 15 వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిన ఉదంతాన్ని గుర్తుచేశారు. ఇప్పటికీ రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు తొమ్మిది వేలు ఉన్నాయని, వాస్తవాలన్నింటినీ దాచిపెట్టి ఖాళీలు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏలూరులో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ..ఖాళీగా ఉన్న 25 వేల పోస్టులను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

పెద్దిరెడ్డి ఇంటి ముట్టడికి ఎన్ఎస్‌యుఐ యత్నం

'దగా డిఎస్‌సి వద్దు... మెగా డిఎస్‌సి కావాలి' అని డిమాండ్ చేస్తూ మంత్రి పెద్దిరెడ్డి ఇంటిని ఎన్ఎస్‌యుఐ నాయకులు ముట్టడించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఎస్‌వి యూనివర్సిటీ నుంచి తిరుపతిలోని మంత్రి ఇంటికి ర్యాలీగా వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని వెనక్కి పంపివేశారు. ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు నాగమధు యాదవ్, జెన్నే మల్లికార్జున, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కారాజు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు, నిరుద్యోగులు

బిజెపి విధానాలకు మద్దతిస్తున్న వైసిపి, టిడిపి, జనసేనను ఓడించండి

- సిపిఎం నాయకులు వై వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

బిజెపి విధానాలకు మద్దతిస్తున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలోని సిపిఎం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తోన్న బిజెపికి అధికార, ప్రతిపక్ష పార్టీలు సమర్థిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజి, రైల్వే జోన్ ఇవ్వకపోయినా ఈ పార్టీలు నోరు మెదపడంలేదన్నారు. రాష్ట్రంలో ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకుంటున్న వైసిపి, టిడిపిలు ఢిల్లీలో బిజెపితో చెలిమి చేసి ప్రజల ప్రయోజనాలకు నష్టం చేస్తున్నాయని విమర్శించారు. విశాఖ స్టీల్ పరిశ్రమను అమ్మేస్తున్నప్పటికీ ప్రశ్నించడంలేదన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని, బిజెపికి మద్దతిస్తున్న పార్టీలను ఓడించాలంటూ ఈ నెల 20న విజయవాడలో జరగనున్న బిజెపి వ్యతిరేక, లౌకిక పార్టీల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా నాయకులు పి శంకరరావు పాల్గొన్నారు.

మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో కలిసి ధర్నా చేస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

మార్గదర్శకాలు తూచ తప్పక పాటించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

కేంద్ర ఎన్నికల సంఘం కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాలు, సూచనలను తూచ తప్పక పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో లోక్‌సభ, లోక్‌సభ పరిధిలోని శాసనసభ నియోజకవర్గ ఎఆర్‌ఒల తొలివిడత శిక్షణ కార్యక్రమం సోమవారం విశాఖలోని ఎయు కెమికల్ ఇంజనీరింగ్ బ్లాక్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని, అందుకోసమే శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఇవిఎంలు, ఓటర్ల జాబితా, ఎన్నికల అధికారులు ప్రధానమని, ఆ ప్రక్రియ పూర్తయిందని అన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఆర్‌ఒలతోపాటు ఎఆర్‌ఒలు కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతల్లో వెయ్యి మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. తొలి విడత శిక్షణను సోమవారం విశాఖ, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో ప్రారంభించామని, ఈ నెలాఖరులోగా మిగిలిన శిక్షణ కార్యక్రమాలు పూర్తి కానున్నాయని వివరించారు. శిక్షణ కోసం జాతీయ స్థాయి మాస్టర్ ట్రైనీలు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాతీయ మాస్టర్ ట్రైనీ సమీర్ అహ్మద్ జాన్, డిఆర్‌ఒ కె.మోహన్‌కుమార్, విశాఖ, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల జాయింట్ కలెక్టర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముకేశ్ కుమార్ మీనా

బొలెరోను ఢీకొన్న లారీ

- ముగ్గురు మృతి
- రిసెప్షన్‌కు వెళ్లి వస్తుండగా ప్రమాదం

ప్రజాశక్తి-అగళి (సత్యసాయి జిల్లా)

వివాహ రిసెప్షన్ ముగించుకుని సంతోషంగా ఇంటి వస్తున్న వారిని మృత్యువు రూపంలో లారీ కబళించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా..ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీ సత్యసాయి జిల్లా అగళి మండలం ఇరిగేపల్లి రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం పలు కుటుంబాల్లో చీకటిని నింపింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. సత్యసాయి జిల్లా రొళ్ల మండలం దాసప్పపాళ్యంకు చెందిన మద్దరంగప్ప కూతురు వివాహ రిసెప్షన్ కర్ణాటక రాష్ట్రం శిరా పట్టణం హుజ్జహీరనహల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు మద్దరంగప్ప బంధువులు 14 మంది బొలేరో వాహనంలో వెళ్లారు. వేడుక అనంతరం తిరుగు పయనమయ్యారు. అర్ధరాత్రి 11.45 గంటలకు శిరా నుంచి రొళ్ల వైపునకు వస్తుండగా హిందూపురం నుంచి శిరా వైపు వెళ్తున్న సిమెంట్ లారీ వేగంగా వచ్చి బొలేరో వాహనాన్ని ఢీకొంది. దీంతో బొలేరో వాహనం పల్టీలు కొట్టడంతో నిశిరాత్రిలో ఒక్కసారిగా హాహాకారాలు మిన్నంటాయి. ఈ ప్రమాదంలో బొలేరోలో ఉన్న దాసప్పపాళ్యం గ్రామానికి చెందిన కాంతప్ప (40), అమ్మజక్క (35), తిమ్మప్ప (43) అక్కడికక్కడే మరణించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన ఆరుగురిని చికిత్స నిమిత్తం హిందూపురం, తుముకూరు, మడకశిర ఆస్పత్రులకు తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. అతివేగమే ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిడ్కో ఇళ్లు అప్పగించకుండానే వడ్డీలా?

- ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
- లబ్ధిదారులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - మండపేట(డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా)

టిడ్కో ఇళ్లను అప్పగించకుండానే బ్యాంకు వడ్డీ ఎందుకు కట్టాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో కలిసి సోమవారం ఆయన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వడ్డీ కట్టాలంటూ టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకులు నోటీసులు పంపించాయన్నారు. కౌన్సిల్ సమావేశంలో లబ్ధిదారులు ఫ్లాట్లు స్వాధీనం చేసుకునే వరకు వడ్డీ కట్టక్కరలేదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇచ్చిన హామీని నిలబెట్టు కోవాలని డిమాండ్ చేశారు. ఫ్లాట్ల కోసం ఏడేళ్ల క్రితం ఒక్కొక్కరూ రూ లక్ష చెల్లించారని, వాటిని నేటికీ అప్పగించలేదన్నారు. టిడ్కో ఫ్లాట్లు తనఖా పెట్టి బ్యాంకుల నుంచి కోట్లాది రూపాయలను ప్రభుత్వం తీసుకుందన్నారు. కానీ పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఒక్క రూపాయి చెల్లించలేదని, ఈ డబ్బంతా ఎక్కడికి పోయిందని? ఆయన ప్రశ్నించారు. టిడ్కో ఇళ్లకు పార్టీ రంగులు వేసుకోవడంలో చూపిన శ్రద్ధ పనులు పూర్తి చేయడంలో లేదని విమర్శించారు. కమీషనర్ ఇచ్చిన హామీ మేరకు మిగిలిన ఫ్లాట్లను వారం రోజుల్లో అప్పగించి బ్యాంకు రుణాల వడ్డీ ప్రభుత్వమే భరించాలని లేదా మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, టిడిపి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్

- 52 మందికి అస్వస్థత
- ఎనిమిది మందిని ఏరియా ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - రామచంద్రపురం (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామం సమీపం ఆదివారపుపేటలో డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 52 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. డీహైడ్రేషన్ గురైన ఎనిమిది మంది విద్యార్థులను రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆదివారం రాత్రి చికెన్‌తో భోజనం చేసిన 500 మంది విద్యార్థుల్లో 52 మంది వాంతులు, విరేచనాలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్రమత్తమైన ప్రిన్సిపల్ వెంటనే వారికి వైద్య సాయం అందించారు. బర్ల ధనుష్, కుంచె రామచరణ్, కె.ప్రసాద్, కె.జాయ్, రెడ్డి సురేంద్ర, గుర్రాల కార్తీక్, చిట్టూరి సత్య ప్రసాద్, సింగలూరు దినేష్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వారిని రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి ప్రిన్సిపల్ తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాలతో గురుకులంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని తమ పిల్లల గురించి ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడిందని, భయపడాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు.

రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

మారుతి సుజుకి ఎగిరే కారు వస్తోంది..!

న్యూఢిల్లీ : మారుతి సుజుకి కొత్తగా ఎగిరే కార్లను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది. జపాన్‌కు చెందిన మాతృసంస్థ సుజుకితో కలిసి 'ఎలక్ట్రిక్ ఎయిర్ కాప్టర్లు' డెవలప్ చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పేర్కొంది. దీనిలో పైలెట్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చని సమాచారం. డ్రోన్ల కంటే పెద్దగా, సంప్రదాయ హెలికాప్టర్ల కంటే చిన్నగా ఉండే ఈ చాప్టర్లకు మారుతి సుజుకి స్కై డ్రైవ్ పేరును పెట్టనుంది. 1.4 టన్నుల తేలికపాటి బరువు ఉండటంతో ఇళ్లపైనా కూడా వీటిని ల్యాండింగ్, టేకాఫ్ చేయవచ్చని తెలిపింది. రోడ్డు మార్గంలో ఉబెర్, ఓలా క్యాబ్ సర్వీసుల మాదిరిగానే మారుతి సుజుకి ఈ చాప్టర్లను ఎయిర్ టాక్సీలుగా వినియోగించాలని భావిస్తోన్నామని సుజుకి మోటార్ గ్లోబల్ ఆటోమొబైల్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ కెంటో ఒగురా పేర్కొన్నారు. ఈ ప్రక్రియ విజయవంతమైతే ప్రజా రవాణాలో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. భారత్‌లో వినియోగానికి గల అవకాశాలు, వాస్తవిక పరిస్థితులను అధ్యయనం చేసేందుకు అనుమతించాలని కోరుతూ విమానయాన రంగ నియంత్రణ సంస్థ డిజిసిఎతో సంప్రదింపులు చేస్తున్నామని ఒగురా తెలిపారు.

పేటియంపై చర్యలు వెనక్కి తీసుకోలేం..!

- వారంలోనే తదుపరి నిర్ణయాలు
- స్పష్టం చేసిన ఆర్‌బిఐ గవర్నర్

ముంబయి : పేటియం పేమెంట్ బ్యాంక్‌పై చర్యలు కొనసాగుతాయని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. పేటియంపై ఆర్‌బిఐ నియంత్రణ చర్యల్ని సమీక్షించేది లేదని శనివారం పేర్కొన్నారు. ఫిబ్రవరి 29 నుంచి పేటియం పేమెంట్ బ్యాంక్ లిమిటెడ్ (పిపిబిఎల్) డిపాజిట్లు సేకరించకూడదని, రుణాలు జారీ చేయరాదని ఆర్‌బిఐ ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. వినియోగదారుల ఖాతాలు, ప్రీ పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్‌లు, వాలెట్‌లు, ఫాస్టాట్యాగ్‌లు, నేషనల్ కామన్ మొబిలిటీ (ఎన్‌సిఎంసి) కార్డులు తదితరాల్లో క్రెడిట్ లావాదేవీలు లేదా టాప్‌అప్‌లు చేయకూడాదని స్పష్టం చేసింది. ఈ దెబ్బతో పేటియం షేర్లు పాతాలానికి పడిపోతున్నాయి. మరోవైపు పేటియం ఖాతాదారులు సగానికి పైగా జారి పోయారు. ఇతర చెల్లింపు వేదికలను ఆశ్రయిస్తున్నారు.

పిపిబిఎల్‌పై ఆంక్షల నేపథ్యంలో శనివారం రిజర్వ్ బ్యాంక్ సెంట్రల్ బోర్డు 606వ సమావేశంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. దీనికి శక్తికాంత దాస్ హాజరయ్యారు. భేటీ వివరాలను శక్తికాంత దాస్ మీడియాకు వెల్లడించారు. ఫిన్‌టెక్ సంస్థలపై క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఆర్‌బిఐ చర్యలకు దిగుతుందని అన్నారు. తమ రెగ్యులేటరీ సంస్థ ఫిన్‌టెక్ సంస్థలకు మద్దతునిస్తూనే.. ఖాతాదారుల ప్రయోజనాలకు కూడా పెద్దపీట వేస్తుందన్నారు. పేటియం విషయంలో తీసుకున్న నిర్ణయాలు, చర్యలను ఎప్పటికప్పుడూ వెల్లడిస్తామని శక్తికాంత తెలిపారు. ఈ వారంలో ఎఫ్ఎక్యు (తరుచుగా ఎదురయ్యే ప్రశ్నలపై వివరణలు జారీ చేస్తామన్నారు. అప్పటి వరకు అందరూ వేచి చూడాలని సూచించారు. పేటియం తీవ్ర నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిందని.. అనేక సార్లు సమయం ఇచ్చామని ఇది వరకు ఆర్‌బిఐ గవర్నర్ పేర్కొన్న విషయం తెలిసిందే. సరిదిద్దుకోవడానికి అవకాశాలు ఇచ్చిన ఉపయోగించుకోలేదన్నారు. పేటియం కెవైసి లేకున్నా అనేక ఖాతాలు ఇచ్చిందని.. ఒకే పాన్ కార్డ్‌పై వందలాది ఖాతాలను తెరిచిందని.. మనీలాండరింగ్ కూడా జరిగిందని ఆర్‌బిఐ వర్గాలు ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. "రిజర్వ్ బ్యాంక్ సంస్థలపై చర్యలు తీసుకునే ముందు చేసిన తప్పుల్ని సరిదిద్దుకునేందుకు తగినంత సమయం ఇస్తుంది. కొన్నిసార్లు ఇది తగినంత సమయం కంటే ఎక్కువగా ఉంటుంది. సంస్థల పట్ల మేం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాం. ఆర్‌బిఐ ఆదేశాల్ని తప్పకుండా పాటిస్తే ఆయా సంస్థలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉండదు." శక్తికాంత దాస్ పేర్కొన్నారు.

డైరెక్టర్ మంజూ గుడ్‌బై..

పేటియం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్‌కు స్వతంత్ర డైరెక్టర్ మంజూ అగర్వాల్ రాజీనామా చేశారు. దీన్ని ఆ సంస్థ ధృవీకరించింది. ఇంతక్రితం ఆమె వైదొలిగినట్లు వార్తలు వచ్చాయి. సోమవారం పేటియం సూచీ 0.73 శాతం పతనమై.. రూ.416.80కి పడిపోగా.. గడిచిన నెల రోజుల్లో ఏకంగా 41.64 శాతం లేదా రూ.297 పతనమైంది. దీంతో ఇన్వెస్టర్లు లబోదిబో మంటున్నారు.

బిల్లులన్నీ వచ్చే ఏడాదికే..!

- చెల్లింపులపై అనధికార ఆంక్షలు
- గగ్గోలు పెడుతున్న కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

భారీగా పేరుకుపోతున్న బిల్లులపై ఆర్థికశాఖ కలవరపడుతోంది. రోజురోజుకూ పెరిగిపోతున్న బిల్లులను చెల్లించేందుకు ఖజానాలో కాసుల్లేకపోవడంతో కాంట్రాక్టర్లకు, ఇతర శాఖల అధికారులకు, ఉద్యోగులకు సర్దిచెప్పలేక సతమతమవుతోంది. ఈ ఏడాది బిల్లులను చెల్లించే పరిస్థితి లేకపోవడంతో వాటిల్లో అనేక బిల్లులను వచ్చే ఆర్థిక సంవత్సరానికి బదలాయించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఇప్పటి వరకు దాదాపు రూ.లక్ష కోట్లకుపైగానే పలు రకాల బిల్లులు చెల్లింపులకు నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. వీటిల్లో పాతిక వేల కోట్లకు పైగా బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సినవే ఉన్నట్లు అధికార వర్గాల సమాచారం. మిగిలిన వాటిల్లో పలు శాఖలకు చెల్లించాల్సినవి, ఉద్యోగులకు ఇవాల్సినవి ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ప్రతి ఆర్థిక సంవత్సరం చివరిలో ఇలాంటి బిల్లులను వచ్చే ఏడాదికి బదలాయించడం సాధారణమే అయినప్పటికీ, ఈ ఏడాది ఇలాంటి బిల్లుల మొత్తం మరింత ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తోంది. అనుకున్న స్థాయిలో ఆదాయం సమకూరకపోవడం, ఖర్చులు కూడా గణనీయంగా పెరిగిపోయినట్లు అధికారులే అంగీకరిస్తున్నారు. అలాగే మరికొన్ని వేల కోట్ల విలువైన బిల్లులను ఆయా శాఖలకే తిరిగి పంపిస్తూ, వచ్చే ఆర్థిక సంవత్సరానికి మళ్లీ కొత్తగా పెట్టాలని ఆర్థికశాఖ సూచిస్తున్నట్లు తెలిసింది.

పరపతి ఉన్న వాళ్లకే..

ఖజానా ఎంత కష్టంగా ఉన్నప్పటికీ, బిల్లుల చెల్లింపులు మాత్రం కొంత పరపతి ఉన్నవారికే జరుగుతున్నట్లు ఆర్థికశాఖలోనే లుకలుకలు వినిపిస్తున్నాయి. కొంతమంది అయితే కొద్ది రోజుల క్రితం వరకు జరిగిన శాసనసభ సమావేశాల నేపథ్యంలో అక్కడికే వెళ్లి బిల్లులు చేయించుకున్న వైనం కూడా కనిపించింది. ఇందుకు ఆర్థికశాఖలో పనిచేసే వారే స్వయంగా వారిని అసెంబ్లీలో ఉన్న ఆర్థికశాఖ అధికారుల వద్దకు తోడ్కొని వెళ్లినట్లు సమాచారం. అసెంబ్లీలోకి వెళ్లేందుకు పాసులు లేకపోయినా దగ్గరుండి లోపలికి తీసుకెళ్లడం కూడా చర్చనీయాంశం అవుతోంది. మిగిలిన వారికి మాత్రం అధికారుల దర్శనం జరగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. బిల్లులపై వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక ఆర్థికశాఖ అధికారులు సచివాలయంలో అందుబాటులోనే ఉండటం లేదని కూడా కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

సముద్రంలో దగ్ధమవుతున్న బోటు

సముద్రంలో బోటు దగ్ధం

- రూ.20 లక్షల ఆస్తి నష్టం
- సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి(కాకినాడ జిల్లా)

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు సమీపాన సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల బోటు దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా యు కొత్తపల్లి మండలం ఉప్పాడకు చెందిన సూరాడ కృష్ణకు చెందిన రెండు బోట్లలో 20 మంది మత్స్యకారులు అమీనాబాద్ రేవు నుంచి చేపల వేటకు సోమవారం ఉదయం బయలుదేరారు.

కోనసీమ జిల్లా ఓడలరేవు సమీపంలో చేపలను వేటాడుతుండగా ఒక బోటు ఇంజను నుంచి మంటలు వచ్చాయి. కొద్ది క్షణాల్లోనే బోటుకు వ్యాపించడంతో మత్స్యకారులు సముద్రంలోకి దూకేశారు. ఇది గమనించిన రెండో బోటులోని మత్స్యకారులు వారిని రక్షించారు. ప్రమాదం జరిగిన సమయంలో బోటులో 11 మంది మత్స్యకారులున్నారు. ఇంజను వేడెక్కడంతో ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని మత్స్యకారులు చెబుతున్నారు. బోటు పూర్తిగా కాలిపోవడంతో రూ.20 లక్షల వరకూ నష్టం వాటిల్లిందని వారు తెలిపారు. ఘటనా స్థలాన్ని మెరైన పోలీసులు పరిశీలించారు

స్పైస్‌జెట్‌లో 15% మంది ఉద్యోగులపై వేటు..!

న్యూఢిల్లీ : పొదుపు చర్యల్లో భాగంగా విమానయాన సంస్థ స్పైస్‌జెట్ భారీగా ఉద్యోగులను తొలగించడానికి కసరత్తు చేస్తోంది. గత కొద్ది నెలలుగా ఉద్యోగులకు వేతనాల చెల్లింపుల్లో జాప్యం, ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో నిర్వహణ వ్యయాలను తగ్గించుకోవాలని భావిస్తోన్నట్లు రిపోర్టులు వస్తున్నాయి. స్పైస్‌జెట్‌లో ప్రస్తుతం దాదాపు 9000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 30 విమానాలను నిర్వహిస్తుంది. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా ఉద్యోగులను తొలగించక తప్పడం లేదని స్పైస్‌జెట్ వర్గాలు తెలిపాయి. ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన నేపథ్యంలో దాదాపు 1,350 మందిని తీసివేయనుంది. ఇది మొత్తం సిబ్బందిలో 15 శాతానికి సమానం. జనవరి నెల వేతనం ఇప్పటికీ కొంతమందికి చెల్లించలేదని తెలుస్తోంది. ఇటీవల అమెజాన్, అల్ఫాబెట్, మైక్రోసాఫ్ట్, స్నాప్‌చాట్, ఈబే తదితర సంస్థలు భారీగా ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే.

సిస్కోలోనూ ఉద్వాసన

అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం సిస్కో భారీగా కొలువుల కోతకు సిద్ధం అయ్యింది. వచ్చే వారం నుంచి వేలాది మంది ఉద్యోగులపై సిస్కో వేటు వేయనుందని సమాచారం. ఫిబ్రవరి 14న పూర్తి వివరాలు వెల్లడించే అవకాశాలున్నాయి. సిస్కోలో ప్రపంచ వ్యాప్తంగా 84,900 మంది పని చేస్తున్నారు. 2022 నవంబర్‌లో దాదాపు 5 శాతం ఉద్యోగులను తొలగించింది. కాగా.. ఈ ఏడాది ఎంత మందికి ఉద్వాసన పలకనుందో వేచి చూడాలి.

క్యాప్రీ గ్లోబల్ షేర్ల విభజన

ముంబయి : ఎంఎస్ఎంఇ, అఫర్డబుల్ హౌసింగ్ రంగ ఎన్‌బిఎఫ్‌సి అయినా క్యాప్రీ గ్లోబల్ క్యాపిటల్ లిమిటెడ్ (సిజిసిఎల్) డైరెక్టర్ల బోర్డు స్టాక్ విభజన, 1:1 బోనస్ ఇష్యూకు ఆమోదం తెలిపింది. పబ్లిక్ ఇష్యూ, ప్రయివేట్ ప్లేస్‌మెంట్ ద్వారా నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లు విడతల వారీగా రూ.500 కోట్ల వరకు జారీ చేసేందుకు కంపెనీ బోర్డు అంగీకరించినట్లు పేర్కొంది. జనవరి 27న జరిగిన డైరెక్టర్ల బోర్డు సమావేశంలో రూ.2 ముఖ విలువ కలిగిన ఒక ఈక్విటీ షేరును రూ.1 ముఖ విలువ కలిగిన రెండు ఈక్విటీ షేర్లుగా విభజించనుంది. దీనికి కంపెనీ అసాధారణ సర్వసభ్య సమావేశంలో వాటాదారుల ఆమోదానికి లోబడి స్టాక్ విభజన, బోనస్ కోసం కంపెనీ రికార్డు తేదీని 2024 మార్చి5 గా నిర్ణయించింది.

పసిడి బాండ్ల విక్రయాలు ప్రారంభం

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నాలుగో విడత సావరిన్ పసిడి బాండ్ల సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైంది. సోమవారం నుంచి వివిధ విత్త సంస్థల వేదికల్లో ఆన్‌లైన్‌లో అమ్మకాలను ఆర్‌బిఐ అందుబాటులోకి తెచ్చింది. 16వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సబ్‌స్క్రిప్షన్ అందుబాటులో ఉంటుంది. ఒక్కో గ్రాము ధరను రూ.6,263గా ఆర్‌బిఐ నిర్ణయించింది. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వారికి గ్రాముకు రూ.50 డిస్కౌంట్ ఇస్తోంది. ఎనిమిదేళ్ల తర్వాత పసిడి ధర ఎంత ఉంటే అంత చెల్లిస్తుంది.

HDFC BANK
We understand your world

రిజిస్టర్డ్ ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపత్ మార్గ్, లోయర్ ప్యారెల్(వెస్ట్), ముంబయి-400013 మరియు దీని మరొక ఆఫీసు: రిటైల్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, ఐ-థింక్ టెక్నో క్యాంపస్, కంజుర్‌మార్గ్ (ఈస్ట్), ముంబయి-400042.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కు తాకట్టుపెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన విక్రయాపు సమాచారం మరియు బహిరంగ ప్రకటన

దిగువ పేర్కొన్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ ("ది బ్యాంక్") యొక్క రుణగ్రహీతలకు తెలియజేయునది ఏమనగా బ్యాంక్ వద్ద తనఖాపెట్టి రుణ స్వభావం/సెక్యూరిటీలపై ఓవర్‌డ్రాఫ్ట్‌ల రూపంలో రుణ సౌకర్యం పొందిన సెక్యూరిటీల గురించి దిగువ విధంగా చూపబడినవి.
లోన్ అగ్రిమెంట్ ప్రకారం బకాయి ఉన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో రుణగ్రహీత విఫలమైన కారణంగా, దిగువ పేర్కొన్న రుణ ఖాతా నెంబర్లు డెలింక్వెంట్ స్థితిలో ఉన్నాయి. దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు బ్యాంక్ నుంచి అనేక నోటీసులు పంపడం జరిగింది, చివరిగా దిగువ చూపబడిన తేదీల్లో సేల్ నోటీసు పంపబడింది. దిగువ పేర్కొన్న రుణ ఖాతాలకు సంబంధించి బకాయి ఉన్న మొత్తాన్ని 7రోజుల్లోపు తిరిగి చెల్లించాలి, ఒకవేళ నిర్దిష్ట గడువులోపు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించకపోయినట్టయితే బ్యాంక్ వారు ఇకపై ఎలాంటి నోటీసు జారీ చేయకుండా తనఖాపెట్టిన సెక్యూరిటీలను విక్రయించనున్నారు.
ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా బ్యాంక్‌కు బకాయి ఉన్న మొత్తాలను తిరిగిచెల్లించడంలో రుణగ్రహీతలు అశ్రద్ధచేసి విఫలమయ్యారు కాబట్టి లోన్ అగ్రిమెంట్ ప్రకారం రుణగ్రహీత బ్యాంక్ వద్ద తనఖాపెట్టిన సెక్యూరిటీలను తమకు ఉన్నహక్కులను సద్వినియోగం చేసుకొని **20 ఫిబ్రవరి, 2024** తేదీన లేదా ఆ తరువాత బకాయిలను రాబట్టుకునే క్రమంలో విక్రయించనున్నారు. రుణగ్రహీతలకు తెలియజేయునది ఏమనగా ఏ క్షణంలోనైనా బ్యాంక్ వారు తనఖాపెట్టిన సెక్యూరిటీల విలువ స్టాక్ మార్కెట్ అనుగుణంగా తగ్గినట్టయితే ఒక క్యాలెండర్ ఒకరోజు (1)లోపు సదరు సెక్యూరిటీలను ఎలాంటి నోటీసు ఇవ్వకుండా విక్రయించే అధికారం బ్యాంక్ వారికి ఉంటుందని తెలియజేయనైనది.
తనఖాపెట్టిన సెక్యూరిటీలను విక్రయించిన తర్వాత కూడా బ్యాంక్‌కు రావాల్సిన బకాయి మొత్తం సరిపోక పోయినట్టయితే మిగతా మొత్తాన్ని రుణగ్రహీత/లు బ్యాంక్‌కు చెల్లించాల్సి ఉంటుంది.

క్ర సం.	రుణ ఖాతా నెంబర్	రుణగ్రహీతల పేరు	8 ఫిబ్రవరి, 2024 నాటికి బకాయి మొత్తం	అమ్మకపు నోటీసు తేదీ
1	XXXX1156	రాధాక్రిష్ణ మూర్తి దైవల	57,913.00	12 ఫిబ్రవరి-24
2	XXXX8740	కడా శ్రీనివాస్	33,076.63	05 ఫిబ్రవరి-24
3	XXXX0839	బొర్రా శ్రీహరి	5,15,516.00	05 ఫిబ్రవరి-24

తేది: 13 ఫిబ్రవరి, 2024
ప్రదేశం: ఆంధ్ర ప్రదేశ్
సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

సంపాదకీయం

విద్వేష విధ్వంసం

కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చాక బిజెపి పాలిత రాష్ట్రాల్లో ముస్లిం మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని వారి నివాసాల, దుకాణాల, ప్రార్థనా మందిరాల కూల్చివేతలు యథేచ్ఛగా సాగుతున్నాయని ఇంతకాలం ప్రతిపక్షాలు, ప్రధానంగా వామపక్షాలు ఆందోళన చెందాయి. కాగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో మత ప్రాతిపదికన బుల్డోజర్, జెసిబిలతో నిర్మాణాల కూల్చివేత దురాగతాలపై ఇంటర్నేషనల్ సంస్థ ఆమ్నెస్టీ సాక్ష్యాధారాలతో దేశం కళ్లకు కట్టింది. కూల్చివేతలపై ఆమ్నెస్టీ తయారు చేసిన రెండు నివేదికల్లోనూ బిజెపి ప్రభుత్వాల ఆటవిక న్యాయాన్ని తూర్పారబట్టింది. 'బుల్డోజర్ రాజ్'ను తీవ్రంగా నిరసించింది. తప్పుబట్టింది. బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. ఆమ్నెస్టీ ఉత్తినే ఎక్కడో కూర్చొని నివేదికలు తయారు చేయలేదు. సంఘటనా ప్రదేశాలను సందర్శించింది. ప్రభుత్వ బుల్డోజర్ల కింద ఆస్తులను కోల్పోయిన వందలాది బాధితుల, న్యాయ నిపుణుల, మత పెద్దల, పాత్రికేయుల నుంచి సమాచారం సేకరించింది. వీడియోలను, ఫొటోలను పరిశీలించింది. దేశం వెలిగిపోతోందని, విశ్వగురు అని ప్రచారం లంకించుకున్న బిజెపి, మోడీ ఆమ్నెస్టీ చేసిన నిర్ధారణలపై ఏం సమాధానం చెబుతారు?

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)పై దేశ వ్యాప్తంగా నిరసనలు ఎగసిపడ్డాయి. ఆ సమయంలో రాజధాని ఢిల్లీలో ఆందోళనలు మిన్నంటాయి. వాటిలో పాల్గొన్న ముస్లింలు, మద్దతుదారుల ఆస్తులను బుల్డోజర్లు, జెసిబిలు, ఇతర యంత్రాలతో కూలగొట్టిన హృదయవిదారక దృశ్యాలు నేటికీ ప్రజలు మర్చిపోలేదు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగికి 'బుల్డోజర్ బాబా' పేరు సార్థకమైందంటే ఆ రాష్ట్రంలో విద్వేష విధ్వంస పర్వం ఎంత భయానకమో అర్థం చేసుకోవచ్చు. ఏదైనా కేసులో నేరం ఆరోపించబడిన వారి ఆస్తులను నేలమట్టం చేసి రోడ్డున పడేయడం నిత్యకృత్యమైంది. బిజెపి ఏలుబడిలోని అసోం, గుజరాత్, మధ్యప్రదేశ్‌లు యు.పి దారే పట్టాయి. ప్రభుత్వాలే చట్టాలను తుంగలో తొక్కుతున్నాయి. బాధితులకు కనీసం నోటీసులివ్వట్లేదు. కూల్చివేతల వేళ కనీసం వస్తువులను సైతం తీసుకెళ్లనీకుండా అధికారులు బలప్రయోగంతో అడ్డుకుంటున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులను రోడ్డున పడేస్తున్నారు. రాజ్యం దాడిలో వందలాది కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయి. అవమానాలకు గురవుతున్నాయి. ఈ అమానుషాలకు ప్రభుత్వంలోని ముఖ్యుల ప్రోద్బలం ఉందని ఆమ్నెస్టీ తన విచారణలో కుండబద్దలు కొట్టింది. అందుకు తగ్గట్టుగానే బిజెపి నాయకులు తమ అరాచకాలను 'బుల్డోజర్ న్యాయం' అని సమర్థించుకుంటున్నారు.

ఉత్తరాఖండ్‌లో వాల్ద్వానీ నగరంలో ప్రస్తుతం చెలరేగిన అల్లర్లకు అక్కడి బిజెపి సర్కారే కారణం. రెండ్రోజుల క్రితం బల్‌భూల్‌పురాలో ప్రభుత్వ స్థలంలో కట్టారనే సాకుతో మసీదు, మదర్సాలను అధికారులు నేలమట్టం చేశారు. బాధితులు హైకోర్టును ఆశ్రయించగా, విచారణను 14కు వాయిదా వేసింది. స్టే ఇవ్వలేదన్న తప్పుడు వాదనలతో సర్కారు మసీదు, మదర్సాలపై జెసిబిలు పోనిచ్చి కూల్చిపడేసింది. అందుకు నిరసనగా లేచిన ఘర్షణలలో ఐదుగురు చనిపోయారు. నగరంలో కర్ఫ్యూ విధించారు. బుల్డోజర్లతో ఇళ్లను కూల్చడం అధికారులకు ఫ్యాషనై పోయిందని సోమవారం మధ్యప్రదేశ్ హైకోర్టు వ్యాఖ్యలు అక్కడి బిజెపి ప్రభుత్వ విధ్వంసానికి తిరుగులేని ఉదాహరణ. మొన్నటికిమొన్న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ట తర్వాత ముంబయిలోని మహ్మద్ అలీ రోడ్డులో అల్లర్లు లేచాయి. అక్కడి 40 నిర్మాణాలను మహారాష్ట్ర సర్కారు కూల్చేసింది. రాజ్యాంగ మూల స్తంభాలలో లౌకికత్వం ప్రధానమైనది. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రభుత్వాలే రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడటం ఆందోళనకరం. అంతర్జాతీయ మానవహక్కుల చట్టం, అంతర్జాతీయ ఒప్పందం (ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులు) బలవంతపు, ఏకపక్ష, కక్షపూరిత, విద్వేష కూల్చివేతలకు వ్యతిరేకం. ఆ చట్టాలనూ బిజెపి ప్రభుత్వాలు కాలరాస్తున్నాయి. ఆమ్నెస్టీ పెట్టిన గడ్డితోనైనా పాలకులు బుద్ధి తెచ్చుకుంటారా? ప్రజా ప్రతిఘటనోద్యమాలే వారిని దారికి తేవాలి.

మహనీయుల మాట

ఆలోచనల్లో నిజాయితీ,
మాటల్లో ధైర్యం,
చేతల్లో నిబద్ధత ఉన్నవారే
మనకు అవసరం.
- సరోజినీ నాయుడు,
కవయిత్రి.



కేంద్ర బడ్జెట్ - తిరగబడిన తర్కం

ప్రజా ప్రభాతం

> శ్రామికుల ఆదాయాలు తరిగిపోతున్నప్పుడు రైతుల, కూలీల ఆదాయాలు వేరే దిశలో ఎలా ఉంటాయి? రైతుల ఆదాయాలు పెరిగితేనే డిమాండ్ పెరుగుతుంది. అప్పుడు అదనంగా కార్మికులు అవసరం ఔతారు. దాని వలన ఉపాధి అవకాశాలు బాగా పెరుగుతాయి. పైగా కార్మికుల నిజ వేతనాలు కూడా పెరుగుతాయి. ఇప్పుడు కార్మికుల నిజ వేతనాలు పడిపోతున్నాయంటే దానిని బట్టి రైతుల, కూలీల ఆదాయాలు కూడా పడిపోతున్నాయని - అంటే మొత్తం శ్రామిక ప్రజలందరి ఆదాయాలూ (వ్యవసాయ, వ్యవసాయేతర కూలీలు, రైతులు, చిన్న ఉత్పత్తిదారులు) గత ఐదేళ్ళలో పడిపోయాయని నిర్ధారణ ఔతోంది. దేశ జనాభాలో ఈ శ్రామిక ప్రజలే అత్యధిక భాగం. అంటే దేశ జనాభాలో అత్యధిక భాగం గత ఐదేళ్ళ కాలంలో దిగజారిన జీవన పరిస్థితులను అనుభవిస్తున్నారన్నది తిరుగులేని సత్యం.

మోడీ ఏం చెప్తే అదే సత్యం అన్నది బిజెపి విధానం. ఒకవేళ మోడీ చెప్పినది తప్పు అని నిర్ధారించే ఆధారాలు ఏమైనా ఉంటే అటువంటివి తప్పుడు ఆధారాలు అయి వుండాలి. కనుక వాటిని కప్పిపుచ్చాలి. తన పదేళ్ళ పాలనలో ఉన్నంత గొప్పగా భారతదేశం గతంలో ఏనాడూ లేదని మోడీ చెప్తున్నారు. కాని అధికారిక గణాంకాలు దానికి భిన్నంగా ఉన్నాయి. కాబట్టి ఆ గణాంకాలు తప్పు అని, అసలు గణాంకాలను సేకరించే విధానాన్నే మార్చాలని బిజెపి అంటోంది. మూడవ ప్రపంచ దేశాల్లోకెల్లా పేరుగాంచిన గణాంక వ్యవస్థ మనది. పి.సి. మహల్‌నోబిస్ రూపొందిన జాతీయ శాంపిల్ సర్వే విధానం మనకుంది. ఎంతో కృషి చేసి శ్రద్ధతో రూపొందించిన గణాంక వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం ధ్వంసం చేస్తోంది. 2011-12తో పోల్చినప్పుడు 2017-18లో గ్రామీణ ప్రజల తలసరి వినియోగం అన్ని విధాలా తీవ్రంగా పడిపోయిందని శాంపిల్ సర్వే వెల్లడించింది. అందుకు ఏకంగా ఆ సర్వే ఫలితాలను తొక్కిపెట్టారు. మనకి స్వాతంత్ర్యం రాకముందు నుంచీ దేశంలో జనాభా లెక్కల సేకరణ ప్రతీ పదేళ్ళకోమారు జరుగుతోంది. మోడీ చెప్పేవన్నీ వొట్టి డాబులేనని ఆ జనాభా లెక్కలు ఎక్కడ బైట పెట్టేస్తాయో అన్న భయంతో ఆ జనాభా లెక్కల ప్రక్రియనే నిలిపివేశారు. నిరుద్యోగాన్ని లెక్కించేటప్పుడు వేతనం లేని పనిని కూడా నిరుద్యోగంగానే పరిగణించాలని ఐఎల్‌వో ప్రకటించింది. దానిని అనుసరిస్తే దేశంలో నిరుద్యోగం ఎంత తీవ్ర స్థాయిలో ఉందో బైటపడుతుంది. అందుచేత ఐఎల్‌వో విధానాన్ని పక్కన పెట్టేశారు.

ప్రభాత్ పట్నాయక్

వాస్తవానికి వేతనం లేని పని మాత్రమే కాదు. వేతనం చెల్లించే పనుల్లో కూడా అన్ని రకాల పనులనూ ఉపాధిగా లెక్కించకూడదు. 1930 దశకంలో మహా మాంద్యం నెలకొన్న కాలంలో బ్రిటన్‌లో చాలామంది నిరుద్యోగులు రోడ్ల పక్కన బూట్లు పాలిష్ చేయడానికి తయారయ్యారు. వారేమీ ఆ పనిని ఉచితంగా చేయలేదు. కాని అలాంటి వారినందరినీ ఉద్యోగులుగా లెక్కిస్తే నిరుద్యోగం అంత సంక్షోభ కాలంలో కూడా చాలా తక్కువ స్థాయిలో ఉన్నట్టే నిర్ధారణ వస్తుంది. ఇటువంటి తరహాను "ప్రచ్ఛన్న నిరుద్యోగులు"గా పరిగణించారు. ఐతే ఆనాటి సమాజం సంక్షోభాన్ని తీవ్రమైన విషయంగా పరిగణించింది. బాధాకరమైనది ఏమంటే ప్రస్తుతం భారత దేశంలో పాలకులు సంక్షోభాన్ని కూడా తీవ్రమైన విషయంగా పరిగణించడంలేదు.

ఒకవేళ మోడీ కొట్టుకునే సెల్ఫ్ డబ్బాయే వాస్తవం అయితే బడ్జెట్ గతంలో చెప్పినదాన్నే మళ్ళీ చెప్పడం అన్నది ఆశ్చర్యం కలిగించదు. ఈ బడ్జెట్ నిరుద్యోగాన్ని మరింత పెంచుతుంది. శ్రామిక ప్రజలను మరింత దారిద్ర్యంలోకి నెడుతుంది. సమాజంలో ఇప్పటికే వికృత రూపం దాల్చుతున్న ఆర్థిక అసమానతలను మరింత పెంచుతుంది. కాని ఈ వాస్తవాలను ప్రభుత్వం ఒప్పుకోదు. మీడియాలో ఉన్న భజంత్రీలూ ఒప్పుకోరు. ఎందుకంటే, వారి నాయకుడు అటువంటి సమస్యలేవీ లేనే లేవని ప్రకటించారు కదా! ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ఈ సంగతిని స్పష్టం చేసింది.

ఆర్థిక మంత్రి ప్రసంగాన్ని చూద్దాం. సగటు నిజ ఆదాయాలు 50 శాతం పెరిగాయని ఆమె ప్రకటించారు. బహుశా గత దశాబ్దంతో పోల్చి ఆమె చెప్పి వుండాలి. కాని ఆమె చెప్పినది తలసరి ఆదాయం గురించి. అంతే తప్ప దేశంలో అత్యధిక సంఖ్యాకుల ఆదాయాల గురించి మాత్రం కాదు. జాతీయ సగటు ఆదాయం పెరిగింది కాబట్టి దేశంలో అందరి ఆదాయాలూ పెరిగినట్టే అని, దేశ ఆర్థిక పరిస్థితి చాలా బాగుందని ఆమె చెప్పుకోవడంలో మేధోపరమైన నిజాయితీ లోపించింది.

2011-12, 2017-18 సంవత్సరాల మధ్య కాలంలో దేశంలో పౌష్టికాహార లేమి పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ భారతంలో రోజుకు కనీసం 2200 కేలరీల శక్తినిచ్చే ఆహారాన్ని పొందలేని జనాభా (గ్రామీణ ప్రాంతంలో పేదరికాన్ని నిర్ధారించేందుకు ప్రణాళికా సంఘం నిర్ధారించిన ప్రమాణాల ప్రకారం) 68 శాతం నుండి 80 శాతానికి పెరిగింది. మరి ఈ కాలంలో దేశంలో అత్యధికుల ఆదాయాలు మెరుగుపడ్డాయని ఏ ప్రాతిపదికన చెప్తున్నారు ?

ఈ కాలంలో దేశంలో ఏం జరిగిందనేది ఇక్కడ పరిశీలించడం ముఖ్యం. ప్రజలు చేసే వినిమయాన్ని అంచనా వేయడానికి గతంలో జాతీయ శాంపిల్ సర్వే ఐదేళ్ళకోమారు గణాంకాలు సేకరించేది. ఇప్పుడు దానికి స్వస్తి చెప్పారు. కాని కొన్ని ఇతర గణాంకాల ఆధారంగా మనం కొన్ని నిర్ధారణలకు రావచ్చు. వాటిలో ఒకటి గ్రామీణ ప్రాంతాల్లో వాస్తవ ఆదాయాలకు సంబంధించి గత ఐదు సంవత్సరాల డేటా. వ్యవసాయ పనుల్లో గాని, వ్యవసాయేతర పనుల్లో గాని ఉన్నవారి నిజ ఆదాయాలు గత ఐదేళ్ళలోనూ పడిపోయాయి. పట్టణ ప్రాంతాల్లో సైతం అదే పరిస్థితి ఉండే అవకాశాలు ఉన్నాయి. ఆ యా నిర్ణీత వ్యవధుల్లో నిర్వహించే శ్రామిక సర్వే (పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే) తాజా వివరాల ప్రకారం దేశం మొత్తం మీద, అటు పట్టణాల్లో గాని, ఇటు గ్రామాల్లోగాని సగటు నెలవారీ ఆదాయాలు 2017-18కి, 2022-23కి మధ్య 20 శాతానికి పైగా పడిపోయాయి! అంటే 2017-18 తర్వాత నిజ ఆదాయాలు పడిపోతున్నాయనేది నిస్సందేహం.

స్వాతంత్ర్యం వచ్చినది మొదలు ఎన్నడూ లేనంత తీవ్ర స్థాయిలో నేడు నిరుద్యోగం ఉంది. సిఎంఐఇ (సెంటర్ ఫర్ మోనిటరింగ్ ది ఇండియన్ ఎకానమీ) ప్రకారం దేశంలో ఉన్న ఉద్యోగాల సంఖ్యలో గత ఐదేళ్ళలో నికరమైన పెరుగుదల ఏమీ లేదు. ఒకపక్క నిజ వేతనాలు పడిపోతూ, మరొక పక్క ఉద్యోగాల సంఖ్యలో పెరుగుదల లేకపోవడం చూస్తే శ్రామికులుగా పని చేస్తున్నవారి తలసరి నిజ ఆదాయాలు పడిపోతున్నట్టు స్పష్టం ఔతోంది.

శ్రామికుల ఆదాయాలు తరిగిపోతున్నప్పుడు రైతుల, కూలీల ఆదాయాలు వేరే దిశలో ఎలా ఉంటాయి? రైతుల ఆదాయాలు పెరిగితేనే డిమాండ్ పెరుగుతుంది. అప్పుడు అదనంగా కార్మికులు అవసరం ఔతారు. దాని వలన ఉపాధి అవకాశాలు బాగా పెరుగుతాయి. పైగా కార్మికుల నిజ వేతనాలు కూడా పెరుగుతాయి. ఇప్పుడు కార్మికుల నిజ వేతనాలు పడిపోతున్నాయంటే దానిని బట్టి రైతుల, కూలీల ఆదాయాలు కూడా పడిపోతున్నాయని-అంటే మొత్తం శ్రామిక ప్రజలందరి ఆదాయాలూ (వ్యవసాయ, వ్యవసాయేతర కూలీలు, రైతులు, చిన్న ఉత్పత్తిదారులు) గత ఐదేళ్ళలో పడిపోయాయని నిర్ధారణ ఔతోంది. దేశ జనాభాలో ఈ శ్రామిక ప్రజలే అత్యధిక భాగం. అంటే దేశ జనాభాలో అత్యధిక భాగం గత ఐదేళ్ళ కాలంలో దిగజారిన జీవన పరిస్థితులను అనుభవిస్తున్నారన్నది తిరుగులేని సత్యం. 2011-12 నుంచి 2017-18 మధ్య కాలంలో వీరి వినిమయం బాగా పడిపోయిందని ధ్రువపరిచే గణాంకాలను కూడా దీనికి తోడు చేస్తే శ్రామిక ప్రజల దుర్భర జీవితాలు మనకి దర్శనమిస్తాయి.

ఈ కారణంగానే మోడీ హయాంలో ప్రైవేటు పెట్టుబడులు ఎదుగుదల లేకుండా స్తంభించిపోయాయి. బడా పెట్టుబడిదారులకు, అందునా ఎంపిక చేసిన కొద్దిమంది క్రోనీ పెట్టుబడిదారులకు బిజెపి ప్రభుత్వం ఎంత కొమ్ముగాసినా, ఇదే పరిస్థితి. ఇక ప్రైవేటు చిన్న పెట్టుబడిదారుల పెట్టుబడులూ స్తంభించిపోయాయి. లేదా తరిగిపోయాయి. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు, నిరంకుశమైన లాక్‌డౌన్‌లతో ఈ రంగం నడుము విరిగిపోయింది. కార్పొరేట్ సంస్థల లాభాలలో పెరుగుదల ఉన్నా, వారి పెట్టుబడులలో మాత్రం స్తంభనే కొనసాగుతోంది. తనకు వచ్చిన లాభాలను బట్టి కాకుండా, మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి పెట్టుబడులు పెట్టడం జరుగుతుందన్నది వాస్తవం.

ఐతే పెట్టుబడుల వ్యయం ఏటికేడూ పెరుగుతోందని ప్రభుత్వం వాదించవచ్చు. తన బడ్జెట్ ప్రసంగంలోనూ ఆర్థిక మంత్రి ఇదే వాదన చేశారు. ఇలా పెరగడం వలన ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రైవేటు పెట్టుబడిదారులకు కావలసిన మార్కెట్ విస్తరణ జరుగుతుందని, అప్పుడు వారినుండి పెట్టుబడులు కూడా పెరుగుతాయని ఆ వాదన అంటుంది. ఐతే, ఇక్కడ జరిగిందేమంటే ప్రభుత్వం వైపు నుండి పెరిగిన పెట్టుబడుల వ్యయం ప్రభావం దేశీయ మార్కెట్‌లో కన్నా అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కువగా వ్యక్తం ఔతోంది. అందుచేత దేశీయ మార్కెట్‌లో పెట్టుబడుల పెరుగుదల లేదు. ఇక ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహంలోని మరో భాగం ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా ప్రైవేట్ పెట్టుబడిదారులకు భారీగా రుణాలు ఇవ్వడం. ఇలా రుణాలు పొందినవారిలో క్రోనీ పెట్టుబడిదారులు కూడా ఉన్నారు. "మౌలిక వసతుల కల్పన రంగం"లో పెట్టుబడులు పెట్టడానికిగాను వారికి ఈ రుణాలు ఇస్తున్నట్టు ప్రభుత్వం చెప్తోంది. దీని పర్యవసానంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల దగ్గర పారు బకాయిలు పెద్ద మొత్తాల్లో పేరుకుపోయాయి. అంటే ప్రైవేటు పెట్టుబడిదారులు తీసుకోవలసిన రిస్కును ప్రభుత్వ రంగ బ్యాంకులు తీసుకోవలసి వస్తోందన్నమాట. ఇలా రిస్క్ తీసుకున్నా, ఆ పెట్టుబడులలో అధిక భాగం విదేశీ మార్కెట్‌లోని డిమాండ్‌ను పెంచడానికే దోహదపడుతోంది.

మోడీ ప్రవచించిన "సత్యం" కారణంగా ఈ బడ్జెట్ ఎందుకూ కొరగాకుండా పోయింది. అలాగాక, ఏ లేశమైనా ప్రజల వాస్తవ పరిస్థితులను గనుక బడ్జెట్ పరిగణనలోకి తీసుకుని వున్నట్టైతే అది ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుని వుండేది. నేరుగా ప్రజలకు నగదు బదిలీ చేయడం కాని, కనీస వేతనాల స్థాయిని పెంచి చట్టబద్ధంగా అమలు చేయడం కాని ప్రతిపాదించి వుండేది. ఈ రెండింటిలో రెండూ కాని, ఏ ఒక్కటి కాని చేసినా ప్రజలకు నేరుగా ప్రయోజనాలు లభిస్తాయి. అంతేగాక దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక ఊపు వచ్చి వుండేది. మార్కెట్ బలపడి, ప్రైవేట్ పెట్టుబడులు పెరిగి, ఉపాధి అవకాశాలు కూడా పెరిగివుండేవి.

కాని మన పాలకులకు అటువంటి విధానాలు నిషిద్ధం. నిజానికి దానికి పూర్తి వ్యతిరేక దిశలో నడుస్తున్నారు. ఆహారం, ఎరువులు, ఇంధనం మీద ఇచ్చే సబ్సిడీని రూ.4.13 లక్షల కోట్ల నుండి రూ.3.81 లక్షల కోట్లకు తగ్గించారు. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు ఏ మాత్రం పెంచలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మాదిరిగానే రూ.86,000 కోట్లకే పరిమితం చేశారు. ఈ విధంగా చేయడం "ఆర్థిక విజ్ఞత"ను సూచిస్తోందని భజంత్రీ మీడియా మెచ్చుకుంది. ఇటువంటి "ఆర్థిక విజ్ఞత"ను ప్రదర్శించినందువలన విదేశీ పెట్టుబడులు బాగా తరలి వస్తాయని ప్రభుత్వం కూడా చెప్పుకుంటోంది. అందువలన మన వృద్ధిరేటు ఇంకా పెరుగుతుందని కూడా చెప్తోంది. మన "ఆర్థిక విజ్ఞత" ఎంత గొప్పగా ఉన్నా మన క్రెడిట్ రేటింగ్ (ఆర్థిక స్తోమతను అంచనా వేసే రేటింగ్) మాత్రం చాలా హీనంగానే కొనసాగుతోంది. ఇండోనేషియా కన్నా ఒక మెట్టు దిగువన, థాయ్‌లాండ్ కన్నా రెండు మెట్లు దిగువన మనం ఉన్నాం. జంక్ బాండ్లు (దివాలా ఎత్తిపోయిన కంపెనీల వాటాలకు సంబంధించినవి) కన్నా ఒక్క మెట్టు మాత్రమే మనం పైన ఉన్నాం. అంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి మన "ఆర్థిక విజ్ఞత" అంతగా రుచించలేదన్న మాటేగా !

(స్వేచ్ఛానుసరణ)

సందర్భం

16న దేశవ్యాప్త నిరసనలు - కార్మిక కర్షక ఐక్యత

> భారతదేశంలో గత పదేళ్ళ నుండి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్నది. "దేశం వెలిగిపోతున్నది", సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు, విదేశాల్లో వున్న నల్లధనాన్ని రప్పించి దేశంలో ప్రజలకు పంచడం, మేకిన్ ఇండియా, ఇటీవల అమృత కాల్ లాంటి వంద రకాల నినాదాలతో ఒకవైపు బిజెపి తప్పుడు ప్రచారం చేస్తున్నది. ఇదంతా ప్రజలను మోసగించడానికి చేసే ప్రచార ఆర్భాటమే. మరోవైపు కార్పొరేట్లకు అనుకూలంగా అన్ని విధాలా దేశసంపదను దోచిపెడుతున్నది. ఇటీవల ప్రకటించిన ఆఖరి బడ్జెట్ కూడా కార్పొరేట్లకు పూర్తి అనుకూలంగా వుంది.

దేశవ్యాప్తంగా 11 జాతీయ, కార్మిక సంఘాలు, 550 రైతు సంఘాలకు పాతినిధ్యం వహిస్తున్న కిసాన్ సంయుక్త మోర్చా, అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, కౌలుదారుల సంఘం ఫిబ్రవరి 16న జాతీయ సమ్మె, గ్రామీణ బంద్‌కు పిలుపు నిచ్చాయి. ఈ సమ్మెపై విస్తృత ప్రచారం జరగాలి. ప్రతి కార్మికుడు, వారి కుటుంబానికి, రైతాంగానికి మోడీ విధానాలకు వ్యతిరేకంగా విస్తృతంగా ప్రచారం చేయాలి. అన్ని జిల్లా కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో ఫిబ్రవరి 16న సమ్మె అనంతరం ర్యాలీలు, సభలు జరపాలని కోరుతున్నాం.

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్‌కు "భారత రత్న" బిరుదు ప్రకటించింది. కానీ ఆయన ప్రతిపాదించిన కనీస మద్దతు ధరను గత ప్రభుత్వాలు, నేటి బిజెపి ప్రభుత్వం పూర్తిగా తిరస్కరించాయి. బిరుదులు ఇవ్వడం తేలిక కావచ్చు. కానీ రైతులకు న్యాయం చేయడానికి ప్రభుత్వాలు గుడ్డిగా వ్యతిరేకిస్తున్నాయి. డా॥స్వామినాథన్ రైతాంగానికి మేలు చేసే విధానాన్ని సమగ్రంగా అధ్యయం చేసి ప్రకటించారు. మద్దతు ధర అంటే రైతు పంటను పండించేదానికి అయ్యే ఖర్చు, రైతు కుటుంబం చేసే శ్రమకు అదనంగా 50 శాతం జోడించాలని వివరించారు. ఇది అమలు కానందునే వ్యవసాయం నేడు దివాలా తీసింది. నేటికి భారతదేశంలో ప్రజలు 65 శాతం వ్యవసాయంపైనే ఉపాధికి ఆధారపడి వున్నారు. ఇది అమెరికాలో 2 శాతం మాత్రమే. ఒక మహాకవి చెప్పినట్లు ప్రతి మెతుకులోనూ రైతు శ్రమ ఉంటుంది. రైతు శ్రమకు ప్రభుత్వ విధానాలు నేడు విలువ లేకుండా చేసాయి. వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు వ్యవసాయాన్ని వదిలి పొట్ట కోసం వివిధ ప్రాంతాలకు వలసలు వెళ్ళవలసిన దుస్థితి ఏర్పడింది. సమాజంలో వ్యవసాయంపై ఆధారపడిన వ్యవసాయ కూలి, కౌలు రైతు, చిన్న, మధ్యతరగతి రైతులకు ప్రభుత్వం ఇటువంటి సహాయాన్ని అందించడం లేదు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతమైన అమెరికా, జపాన్‌తో సహా అన్ని దేశాలలో రైతాంగానికి రాయితీలిస్తున్నారు. అయితే మన దేశంలో రైతాంగానికి నేడు ఆధారం లేకపోగా కనీస గౌరవం కూడా దక్కడం లేదని వాపోతున్నారు. వ్యవసాయంపై ఆధారపడిన యువకులకు ఉపాధి కరువైంది. రైతు యువకులను పెళ్ళి చేసుకోవడానికి ఆడపిల్లలు ఇష్టపడడం లేదు.

స్వాతంత్ర్యానంతరం ఎన్నడూ జరగనంతగా 2021-22లో ఆ సేతుహిమాచలమూ 3 రైతు నల్లచట్టాలకు వ్యతిరేకంగా లక్షలాది మంది రైతాంగం మహా ఉద్యమం నడిపారు. ఈ లోగా ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ప్రధానమంత్రి మోడీ దిగివచ్చి "మాఫ్‌కీజియే" (క్షమించండి) అని రైతు వ్యతిరేక 3 నల్ల చట్టాలు వెనక్కు తీసుకుంటామని, రైతులకు గిట్టుబాటు ధర ఇస్తామని, రైతులపై కేసులు ఎత్తివేస్తామని చేసిన వాగ్దానాలు నేటికీ అమలు కాలేదు. రైతులపై 45 వేల పోలీసు కేసులున్నాయి. 742 మంది ఈ ఉద్యమంలో మరణించారు. అత్యంత కిరాతక పద్ధతుల్లో ఈ ఉద్యమాన్ని అణచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించి విఫలమైంది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించిన హామీలు నేటికీ అమలు చేయలేదు. పైగా దొడ్డిదారిన వ్యవసాయ రంగాన్ని అదానీ, అంబానీ తదితర కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలు చేస్తోంది. అటవీ హక్కుల రక్షణ చట్టానికి సవరణలు చేసింది. దీని ప్రకారం గిరిజన భూములన్నీ కార్పొరేట్ల వశమవుతాయి. ప్రపంచ బ్యాంకు ఆదేశంతో కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మోడల్ భూమి హక్కుల చట్టం రూపొందించింది (మన రాష్ట్ర ప్రభుత్వం దానిని చట్టం చేసింది. ఈ చట్టం అమలైతే రైతులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది). ఆహార భద్రతా చట్టాన్ని నిర్వీర్యం చేస్తోంది. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీము తొలగించింది. ఈ కాలంలో బడ్జెట్‌లలో వ్యవసాయ రంగానికి కేటాయించిన రూ.లక్ష కోట్లు వెనక్కి తీసుకుంది. ఫలితంగా రోజురోజుకూ సాగు ఉత్పత్తి ఖర్చులు పెరిగి పెట్టుబడులు కూడా తిరిగిరాని రైతాంగం, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు తల్లడిల్లిపోతున్నారు. ఈ కాలంలో వారి ఆత్మహత్యలు 20 శాతం పెరిగాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ బంద్ జరుగుతున్నది.

భారతదేశంలో గత పదేళ్ళ నుండి మతోన్మాద కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్నది. "దేశం వెలిగిపోతున్నది", సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు, విదేశాల్లో వున్న నల్లధనాన్ని రప్పించి దేశంలో ప్రజలకు పంచడం, మేకిన్ ఇండియా, ఇటీవల అమృత కాల్ లాంటి వంద రకాల నినాదాలతో ఒకవైపు బిజెపి తప్పుడు ప్రచారం చేస్తున్నది. ఇదంతా ప్రజలను మోసగించడానికి చేసే ప్రచార ఆర్భాటమే. మరోవైపు కార్పొరేట్లకు అనుకూలంగా అన్ని విధాలా దేశసంపదను దోచిపెడుతున్నది. ఇటీవల ప్రకటించిన ఆఖరి బడ్జెట్ కూడా కార్పొరేట్లకు పూర్తి అనుకూలంగా వుంది. ఉపాధి హామీ నిధులు పెంచలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఎరువులపై...ప్రత్యేకంగా రైతులకు అవసరమైన యూరియాపై ఇచ్చే సబ్సిడీ రూ.62445 కోట్లు కోత విధించింది. ప్రజల ఆహార భద్రతకు కేటాయింపులో రూ.60470 కోట్లు కోత విధించింది. పేద ప్రజల కోసం నిర్దేశించిన ఉపాధి హామీ పథకానికి రూ.4806 కోట్లు కోత విధించింది. కేంద్ర ప్రభుత్వం గతంలోనే ధాన్య సేకరణను ఉపసంహరించింది. ఈ ఏడాది గోధుమ సేకరణకు కూడా కోత విధించింది. ప్రజలకు అవసరమైన ఆహార ధాన్యాలను నిల్వ ఉంచే ఎఫ్‌సిఐ తదితర గోదాములను 30 సంవత్సరాలకు అదానీ, అంబానీలకు లీజుకు కట్టబెట్టింది. రైల్వే ప్రైవేటీకరణకు పెద్ద పీట వేసింది. సామాన్య ప్రజల ఆశలు ఆడియాసలయ్యాయి. కనీసం పన్ను రాయితీలు వస్తామని ఆశించిన కార్మికులు నిరాశకు గురయ్యారు.

కార్మిక వర్గం స్వాతంత్ర్యం ముందు నుండి సాధించుకున్న కార్మిక హక్కులపై కేంద్ర బిజెపి ప్రభుత్వం దాడి చేస్తున్నది. కేంద్ర బిజెపి విధానాలపై కార్మిక వర్గం పోరాడుతున్నది. అందుకే ముందుగా కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చింది. కార్మిక చట్టాలోని సారాన్ని తీసివేసింది. సమ్మె హక్కును హరించింది. అయినా గత పదేళ్ళలో కార్మిక వర్గం అనేక అద్భుతమైన పోరాటాలు సాగించింది. దేశంలోనే అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేస్తాం లేదా మూసివేస్తామని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో పదేపదే ప్రకటించారు. కార్మికవర్గ పోరాటాల ఫలితంగా ఒక్క భారీ ప్రభుత్వరంగ పరిశ్రమను కూడ అమ్మలేకపోయారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో గత 1100 రోజుల నుండి జరుగుతున్న నిరవధిక పోరాటం అందులో భాగమే. భారీ పరిశ్రమల పూర్తి వాటాలను అమ్మడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. అందువలన పరిశ్రమలను ముక్కలుగా చేసి అమ్మడంలో భాగంగా జాతీయ హైవే రోడ్డులు, రైల్వేలు, విద్యుత్ రంగాలను ముక్కలు చేసి అమ్మాలని ప్రయత్నిస్తున్నది. దీనినే జాతీయ మోనిటైజేషన్ పైప్‌లైన్ అని కేంద్ర ప్రభుత్వం నామకరణ చేసింది.

గత పది సంవత్సరాల మోడీ పాలన కాలంలో అత్యంత ధనవంతులైన కార్పొరేట్లకు రూ.15.32 లక్షల కోట్ల రుణ మాఫీ చేశారు. వి.పి.సింగ్ ప్రధానమంత్రిగా వుండగా రైతులకు దేశవ్యాప్తంగా కేవలం రూ.10 వేల కోట్లు రుణ మాఫీ చేసినందుకే ఆ నాడు బిజెపి గగ్గోలు పెట్టింది. ఆస్తుల దివాళా చట్టాన్ని తీసుకువచ్చి బ్యాంకుల నుంచి అప్పులు తీసుకున్న ధనవంతులకు అప్పులు చెల్లించకుండా ఎగ్గొట్టే అవకాశాలు కల్పించారు. ఈ చట్టం కింద దివాళా ప్రకటించిన 265 కంపెనీల నుంచి కేవలం 27 శాతం ఆస్తులు మాత్రమే రాబట్టారు. 73 శాతం అధికారికంగా చెల్లించకుండా అనుమతించారు. సామ్‌సంగ్, విస్ట్రాన్ లాంటి విదేశీ కంపెనీలకు 1.97 లక్షల కోట్ల రాయితీలిచ్చారు. ఇదంతా ప్రజల సొమ్ము. ప్రజలు బ్యాంకుల్లో దాచుకున్న డబ్బులు ధనవంతులకు కట్టబెట్టే కుట్ర ఇది. ఆయిల్, గ్యాస్ నిక్షేపాల అమ్మకంలో 2023లో 2.23 లక్షల స్క్వేర్ కి.మీటర్ల ఏరియాలోని 26 బ్లాక్‌లను ప్రైవేటు కంపెనీలకు కారుచౌకగా కేంద్ర ప్రభుత్వం అమ్మింది. భారతదేశంలోని ప్రతి 500 కి.మీటర్ల సముద్రతీరంలో ఒక పోర్టును అదానీకి కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. మారక ద్రవ్యాల ఎగుమతి, దిగుమతులకు కేంద్రంగా వున్న ముంద్రాపోర్టు, ఆంధ్రప్రదేశ్ లోని క్రిష్ణపట్నం, గంగవరం పోర్టులు ఈ కోవకు చెందినవే. కేంద్ర గనుల శాఖమంత్రి ప్రైవేటు కంపెనీలకు గనుల తవ్వకాల్లో 25 శాతం ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని, యజమానులు చెల్లించవలసిన 12 శాతం రాయల్టీని 3 శాతానికి తగ్గిస్తూ ప్రకటన చేశారు.

కేంద్ర ప్రభుత్వం ఒకవైపు కార్మికులు రైతులకు వ్యతిరేక విధానాలు అమలు చేస్తోన్నది. వున్న హక్కులను కబళించే విధానాలు కొనసాగుతున్నాయి. మరోవైపున ప్రజలను మతం పేరుతో చీల్చే భావజాలన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నది. అయోధ్యలో నిర్మించిన రామమందిరంపై గత ఆరు మాసాలు చేసిన భారీ ప్రచారం ఇందులో భాగమే. మీడియా మొత్తాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్నది. మతాన్ని రాజకీయాలకు జోడించి ప్రచారాన్ని సాగిస్తున్నది. జనవరి 22న అయోధ్య రామాలయంపై దేశమంతా ఆర్‌ఎస్‌ఎస్ ద్వారా రామభజన చేయించింది. జనవరి 23న మోడీ దర్శనం కోసం రాజకీయ నాయకులంతా ఎదురు చూసే మోడీ భజన చేయించింది. మన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా బారికేడ్ల వెనుక నుంచి మోడీ గారి దర్శనం కోసం ఎదురు చూశారు. గాజాపై దాడి చేసి 26 వేల మందిని ఊచకోత కోసిన ఇజ్రాయిల్... ఆ నరమేధాన్ని ఇంకా కొనసాగిస్తున్నది. కానీ భారత ప్రభుత్వం దీన్ని ముస్లిం వ్యతిరేక ప్రచారంగా మలచడం దారుణం. నూతన విద్యా విధానం పేరుతో చరిత్ర, సైన్స్ సిలబస్‌లో డ్వారిన్ సిద్ధాంతాన్ని తొలగించాలని చూడడం, మణిపూర్‌లో ఒక తెగకు వ్యతిరేకంగా మరో తెగను రెచ్చగొట్టి మారణహోమం సృష్టించడం బిజెపి మతోన్మాద కుట్రలకు మచ్చుతునకలు.

పదమూడు నెలలు పోరాడి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయించిన అనుభవం మన ముందున్నది. ఇటీవలే మన రాష్ట్రంలో అంగన్‌వాడీ మహిళలు నిర్బంధాలను లెక్క చేయకుండా పోరాడి తమ కోర్కెలు సాధించుకోవడం చూశాం. ఈ రెండు సందర్భాల్లోనూ రైతాంగానికి కార్మిక వర్గమూ...కార్మిక వర్గానికి రైతాంగమూ తోడుగా నిలబడింది. ఈ అనుభవాలతో గ్రామీణ ప్రజానీకాన్ని, కార్మిక వర్గాన్ని చైతన్యపరిచి పోరాటం సాగించాల్సి ఉంది. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతున్నాము.



సిహెచ్. నరసింగరావు
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
సిఐటియు

వై. కేశవరావు
సీనియర్ నాయకులు
ఎపి రైతు సంఘం

హల్ద్వానీ హింస

- మరో 25 మంది అరెస్టు
- మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు
- ఇప్పటి వరకు మొత్తం 30 మంది అదుపులోకి
- ఉత్తరాఖండ్ పోలీసులు వెల్లడి
- పోలీసుల తీరు భయభ్రాంతులకు గురి చేస్తున్నది
- అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలి
- హల్ద్వానీలో ముస్లింల ఆందోళన

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ హింసలో మరో 25 మంది అరెస్టయ్యారు. మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ విషయాన్ని రాష్ట్ర పోలీసులు తెలిపారు. ఈనెల 8న హల్ద్వానీలో స్థానిక అధికార యంత్రాంగం ఒక మసీదు, మదర్సాను కూల్చివేసిన తరువాత హింస చెలరేగిన విషయం విధితమే. అరెస్టయినవారిలో 12 మంది పోలీస్ స్టేషన్‌పై దాడికి పాల్పడ్డారనీ, ఆరుగురు పోలీస్ స్టేషన్ వెలుపల కార్లను తగులబెట్టారనీ, ఏడుగురు కూల్చివేత సమయంలో హింసలో పాల్గొన్నారని పోలీసులు ఆరోపించారు. హింసాకాండకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 30 మందిని అరెస్టు చేసినట్టు నైనిటాల్ సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ ప్రహ్లాద్ నారాయణ్ మీనా తెలిపారు. ఈ వ్యవహారంపై ఇప్పటి వరకు మూడు ఎఫ్ఐఆర్‌లు దాఖలయ్యాయని చెప్పారు.

ముస్లిముల ఆందోళన

ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో పోలీసుల వ్యవహార శైలిపై స్థానిక ముస్లింలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల అణచివేత తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని చెప్పారు. ఈ నెల 8న హల్ద్వానీలో స్థానిక అధికార యంత్రాంగం ఒక మసీదు, మదర్సా కూల్చివేసిన ఘటన.. అక్కడ హింసాత్మక పరిస్థితులకు కారణమైన విషయం విదితమే. ఈ ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత పోలీసులు వ్యవహరించిన తీరు తమను ఆందోళనకు గురి చేసిందని ముస్లింలు చెప్తున్నారు. రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాల మేరకే ఇదంతా జరుగుతున్నదని విమర్శిస్తున్నారు.

కూల్చివేత తర్వాత ఫిబ్రవరి 8న స్థానిక ప్రజలు, పోలీసులు ఘర్షణ పడిన బన్‌భూల్‌పురా నివాసితులు మాట్లాడుతూ.. పోలీసు అధికారులు తమ ఇళ్లలోకి చొరబడి, మహిళలతో సహా కుటుంబ సభ్యులపై దాడి చేశారని విమర్శించారు. ఆస్తులను ధ్వంసం చేసి, అనేక మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. "పోలీసు అధికారులు మా ఇంట్లోకి చొరబడ్డారు. వారు మా వస్తువులను చిందరవందర చేశారు. నా భర్తపై దాడి చేశారు. మమ్మల్ని కూడా నెట్టారు. వారు అతనిని తీసుకెళ్లారు. అతను ఎక్కడ ఉన్నాడో ఎలా ఉన్నాడో మాకు తెలియదు" అని స్థానిక పాఠశాలలో వంట చేసే షామా (38) అన్నారు. షామా భర్త నయీమ్(45) హల్ద్వానీలోని నిర్మాణ స్థలాలకు ఇసుకను రవాణా చేసే రోజువారీ కూలీ.

"నేను నా భర్తను కలవాలనుకుంటున్నాను. పోలీసు అధికారులు నా భర్తను తీసుకెళ్లారు. ఆయన లేకుంటే నేను చనిపోతాను" అని 22 ఏళ్ల మెహ్రీన్ చెప్పింది. ఆమె భర్త ఆరిఫ్(25)ను నలుగురు పోలీసు అధికారులు తీసుకెళ్లా రని తెలిపింది. మెహ్రీన్, ఆరిఫ్‌లకు ఏడు నెలల క్రితమే వివాహమైంది. సాక్ష్యాధారాలు లేకుండా ఎవరిపైనా ఇలా ప్రవర్తించే ఉద్దేశం పోలీసులకు లేదని ఉత్తరాఖండ్ డిజిపి అభినవ్ కుమార్ అన్నారు.

పర్వీన్(30) అనే మహిళ మాట్లాడుతూ.. "నా భర్త ముకీమ్ రోజువారీ కూలీ. ఆయనను పోలీసు అధికారులు తీసుకెళ్లారు" అని చెప్పారు. షాహిద్(35) అనే కూరగాయల విక్రేతను కూడా పోలీసులు పట్టుకున్నారని ఆయన తల్లి వాపోయారు. ఫిబ్రవరి 8న పర్వీన్ బట్టలు ఆరేయటానికి వెళ్లాడనీ, ఆ సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు.

అదుపులోకి తీసుకున్న తమవారిపై పోలీసులు దాడులకు దిగారని పలువురు మహిళలు విలపించారు. పని చేసుకుంటే కానీ పూట గడవని తమ ఇండ్లలో.. మగవారే జీవనాధారమనీ, అలాంటి వారిని పోలీసులు ఉద్దేశపూర్వకంగానే అదుపులోకి తీసుకున్నారని స్థానిక ముస్లిం మహిళలు ఆరోపిస్తున్నారు. తమవారిని విడిచి పెట్టాలని కోరారు. పోలీసు చర్య హల్ద్వానీ నుంచి ముస్లింల వలసలను ప్రేరేపించినట్టు కనిపిస్తున్నది. ఫిబ్రవరి 11 ఉదయం, వందలాదిమంది ప్రజలు, చేతిలో సామానుతో పొరుగున ఉన్న పట్టణాలు, ఉత్తర ప్రదేశ్‌లోని నగరాలకు బస్సులు ఎక్కారు. పోలీసుల ఒత్తిడి లేని సురక్షితమైన ప్రదేశాల కోసం వారు వెతుకుతున్నారు.

పార్లమెంట్ సమావేశాల రోజులు తగ్గినయ్

- 17వ లోక్‌సభలో ఏడాదికి సగటున 55 రోజులే
- మొదటి లోక్‌సభలో ఇది 135 రోజులు
- పిఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ అధ్యయనం

న్యూఢిల్లీ : భారత్‌లో సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 17వ లోక్‌సభ రద్దు కావటానికి సమయం దగ్గరపడుతున్నది. 17వ లోక్‌సభ సమావేశాలు శుక్రవారం నాటికి ముగిశాయి. అయితే, మోడీ ప్రధానిగా ఉన్న కాలం నాటి ఈ పార్లమెంటు సమావేశాలు వివిధ అంశాలపై చర్చించటానికి ఏడాదికి సగటున 55 రోజుల మాత్రమే వెచ్చించటం గమనార్హం. ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సభా నాయకుడిగా ఉన్న మొదటి లోక్‌సభ సగటు వార్షిక సమావేశాలు 135 రోజులు జరగటం గమనార్హం. పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ద్వారా జూన్, 2019 నుంచి ఫిబ్రవరి, 2024 మధ్య పార్లమెంటు గణాంక అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది.

అతి తక్కువ సమావేశాలకు సంబంధించిన వివరణలలో ఒకటి కోవిడ్-19 మహమ్మారి. ఒక్కో సెషన్ ముందుగానే రద్దు కావటానికి వేర్వేరు కారణాలున్నాయి. ఐదేండ్లలో, పార్లమెంటు 2020లో అత్యల్ప రోజులు (మొత్తం 33) సమావేశమైంది. 17వ లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ లేకుండా తొలిసారిగా పని చేసింది. ఇది రాజ్యాంగబద్ధంగా ఉండాల్సిన స్థానం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం వీలైనంత త్వరగా లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లను ఎన్నుకోవాలి. కానీ, అలా జరగకపోవటం గమనార్హం.

మోడీ ప్రభుత్వం ఎలాంటి చర్చా లేకుండానే చాలాసార్లు హడావుడిగా బిల్లులు ఆమోదింపజేసుకుంటున్నదని ప్రతిపక్షాలు తరచూ విమర్శిస్తున్నాయి. గణాంకాలు సైతం ప్రతిపక్షాల వాదనకు మద్దతుగా కనిపిస్తున్నాయి. 58 శాతం బిల్లులు ప్రవేశపెట్టిన రెండు వారాల్లోనే ఆమోదించబడ్డాయి. జమ్మూకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు, 2019, మహిళా రిజర్వేషన్ బిల్లు, 2023 ప్రవేశపెట్టిన రెండు రోజుల్లోనే ఆమోదించబడ్డాయి. లోక్‌సభలో గంట కంటే తక్కువ చర్చతో 35 శాతం బిల్లులు ఆమోదం పొందాయి. రాజ్యసభలో ఇది 34 శాతంగా ఉన్నది. 16 శాతం బిల్లులు మాత్రమే పరిశీలన కోసం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలకు పంపబడ్డాయి. ఇది మునుపటి మూడు లోక్‌సభలకు సంబంధించిన గణాంకాల కంటే తక్కువ కావటం గమనార్హం.

17వ లోక్‌సభలో 729 ప్రయివేటు బిల్లులు (పీఎంబీ) ప్రవేశపెట్టబడ్డాయి. ఇది 16వ లోక్‌సభ మినహా మునుపటి అన్ని లోక్‌సభల కంటే ఎక్కువ. అయితే వాటిలో రెండు మాత్రమే చర్చకు వచ్చాయి. రాజ్యసభలో 705 పీఎంబీలు ప్రవేశపెట్టబడ్డాయి. ఇందులో 14 చర్చకు వచ్చాయి.

HINDUJA HOUSING FINANCE

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సాయిదాపేట, చెన్నై-600015.
మరియు దీని శాఖలు : హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, 54-20-10/1ఎ, ప్లాట్ నం.43, 3వ అంతస్తు, ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురు, మెయిన్ రోడ్డు, గురునానాక్ కాలనీ, విజయవాడ-520 008.
www.hindujahousingfinance.com
సిఐఎన్: U65922TN2015PLC10093, www.hindujahousingfinance.com

అనుబంధం-IV **స్వాధీనత నోటీసు** **(స్థిరాస్తి)**

ఏదైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్ మరియు ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002, కింద సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(2) క్రింద, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్ఎఫ్ఎల్) కంపెనీ యొక్క అధీకృత అధికారి ద్వారా రుణగ్రహీతలు/ హామీదారులకు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని నోటీసు రసీదు తేదీ నుండి 60 రోజులలోపు మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది. రుణగ్రహీతలు/ హామీదారులు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. దిగువసంతకందారు తనకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి ఇక్కడ వివరించిన ఆస్తిని రూల్ 8తో చదువుతూ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002,లోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (4) కింద స్వాధీనం చేసుకున్నట్లు రుణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. సురక్షితమైన ఆస్తులను రీడీమ్ చేయడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత దృష్టిని ఆహ్వానించారు. ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఆస్తితో వ్యవహరించవద్దని హెచ్చరిస్తూ, మరియు ఆస్తికి సంబంధించిన ఏదైనా లావాదేవీలు దానిపై వడ్డీతో పాటు ఇక్కడ పేర్కొన్న మొత్తానికి హెచ్‌హెచ్ఎఫ్ఎల్ చార్జీకి లోబడి ఉంటాయని తెలియజేస్తున్నారు.

క్ర.సం	రుణగ్రహీత/సహ రుణగ్రహీత/హామీదారుల పేర్లు	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	స్వాధీనతా తేది
1	1) శ్రీ.వీరేష్ కుమార్ పసుపులేటి, తండ్రి. పసుపులేటి రంగారావు (రుణగ్రహీత) 2. శ్రీమతి.కనకదుర్గా పసుపులేటి, భర్త. శ్రీ.వీరేష్ కుమార్ పసుపులేటి (సహ రుణగ్రహీత) ఎల్ఎఎన్ నెం. *(AP/VWD/BENZ/A000000315 & AP/VWD/VJDA/A000000217)* రూ.29,12,549/- (ఇరవై తొమ్మిది లక్షల పన్నెండు వేల ఐదు వందల నలభై తొమ్మిది రూపాయలు మాత్రమే)	14.09.2023 మరియు రూ॥29,12,549/- (ఇరవై తొమ్మిది లక్షల పన్నెండు వేల ఐదు వందల నలభై తొమ్మిది రూపాయలు మాత్రమే) 24.08.2023 నాటికి దానిపై వడ్డీ తో సహా.	07.02.2024
	(స్థిరాస్తి) సెక్యూర్డ్ అసెట్ వివరణ: కృష్ణాజిల్లా, ఇబ్రహీంపట్నం ఎస్.ఆర్.ఓ. పరిధిలోని గొల్లపుడి గ్రామం మరియు గ్రామ పంచాయతీ లో ఉన్న మూల్యాంకనం నం.6160, డో.నం.4-78/1, ఆర్.ఎస్.నం.554/2 లో అవిభక్త వాటా విస్తీర్ణం 65.0 చ.గ.లు. లేదా 54.34 చ.మీ.లు. నిర్మించబడిన మొత్తం పరిధి 194.4 చ.మీ.లు. "బి.వి.ఎన్.టవర్స్" పేరు మరియు శైలి క్రింద నిర్మించబడిన ఆ హౌసింగ్ గ్రూప్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆ ఫ్లాట్ నం.జి-3 తో ప్లింత్ ఏరియా 650.0 చ.అ.లు., 50.0 చ.అ.లు. కామన్ ఏరియా, 100.0 చ.అ.లు. కార్ పార్కింగ్ తో అన్నీ ఇతర సౌలభ్య హక్కులు మరియు సౌకర్యాలతో, నీటి పంపు కనెక్షన్, మెట్లకేస్ మొదలైనవి. ఉన్న హద్దులు : షెడ్యూల్ 2 : (మొత్తం స్థలం సరిహద్దులు : 194.4 చ.గ.లు.) తూర్పు : పి.వి.ప్రభాకరరావు ఆస్తి 50.0" అ.లు., దక్షిణం : పంచాయతీ బజార్ 35.0" అ.లు., పడమర : ధనేకుల వెంకటేశ్వరరావు మరియు ఇతరుల ఆస్తులు 50.0" అ.లు., ఉత్తరం : అయినాల రవీంద్రనాథ్, పొన్నం భాస్కర్‌రావు ఆస్తులు 35.0". 'బి' షెడ్యూల్ (ఫ్లాట్ సరిహద్దులు) : తూర్పు : కామన్ కారిడార్, మెట్లకేస్, దక్షిణం : పార్కింగ్ ఏరియా, పడమర : ధనేకుల వెంకటేశ్వరరావు మరియు ఇతరుల ఆస్తులు, ఉత్తరం : అయినాల రవీంద్రనాథ్ పొన్నం భాస్కర్‌రావు ఆస్తులు.		
2	శ్రీ.రవి సంగెపు, తండ్రి. సంగెపు సాంబశివరావు (రుణగ్రహీత) 2. శ్రీమతి. లక్ష్మీ ప్రసన్న సంగెపు (సహ రుణగ్రహీత) ఎల్ఎఎన్ నెం. *(AP/VWD/BENZ/A000000094)* రూ.37,02,160/- (ముప్పై ఏడు లక్షల రెండు వేల ఒక వందా అరవై రూపాయలు మాత్రమే) నివాసం : డో.నం.2-14, కుమ్మర్ల వీధి, నిడమానూరు, మంగళగిరి, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-522503.	25.09.2023 మరియు రూ॥37,02,160/- (ముప్పై ఏడు లక్షల రెండు వేల ఒక వందా అరవై రూపాయలు మాత్రమే) 08.09.2023 నాటికి దానిపై వడ్డీ తో సహా.	10.02.2024
	(స్థిరాస్తి) సెక్యూర్డ్ అసెట్ వివరణ : షెడ్యూల్-1 : గుంటూరు జిల్లా, ఎస్.ఆర్.ఓ.మంగళగిరి, మంగళగిరి మండలం, చిన్నకాకాని గ్రామం మరియు గ్రామ పంచాయతీ డో.నం.23, 30/3, 23/1ఎ2 వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ విస్తీర్ణం 2380.4 చ.గ.లు. బయట 55.0 చ.గ.లు. (యుడిఎస్ స్థలం) ఉన్న హద్దులు : తూర్పు : నాగేంద్రరెడ్డి మరియు ఇతరుల ఆస్తి, దక్షిణం : 60 అ.లు. హాయ్‌ల్యాండ్ రోడ్డు, పడమర : జగదీష్ మరియు జి.శ్రీకాంత్ ఆస్తి, ఉత్తరం : జి.జగదీష్ మరియు జి.శ్రీకాంత్ ఆస్తి. షెడ్యూల్-2 : పై షెడ్యూల్ 1 ఆస్తి లో "వెన్నెల హైట్స్" అపార్టుమెంట్ ఒకటవ అంతస్తు, ఫ్లాట్ నం.207, కొలత 1365 చ.అ.లు. ప్లింత్ ఏరియాతో పాటు కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్ తో అన్నీ సౌలభ్య హక్కులు. తూర్పు : కామన్ కారిడార్, దక్షిణం : ఓపెన్ టు స్కై మరియు ఫ్లాట్ నం.206, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై మరియు ఫ్లాట్ నం.208		
3	శ్రీ.శ్రీనివాసరావు గల్లా, తండ్రి. శ్రీ.పాండురంగారావు (రుణగ్రహీత), 2. శ్రీమతి. శివలీల గల్లా, భర్త. శ్రీ.శ్రీనివాసరావు గల్లా (సహ రుణగ్రహీత) ఎల్ఎఎన్ నెం. *(AP/VWD/BENZ/A000000100 & AP/VWD/VJDA/A000000256)* రూ.29,13,950/- (ఇరవై తొమ్మిది లక్షల పదమూడు వేల తొమ్మిది వందల యాభై రూపాయలు మాత్రమే)	14.09.2023 మరియు రూ॥29,13,950/- (ఇరవై తొమ్మిది లక్షల పదమూడు వేల తొమ్మిది వందల యాభై రూపాయలు మాత్రమే) 24.08.2023 నాటికి దానిపై వడ్డీ తో సహా.	07.02.2024
రుణగ్రహీత/ల నుండి బకాయి మొత్తాల రికవరీ కొరకు **సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002** క్రింద **పిరామల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిచే దిగువ పేర్కొన్న సెక్యూర్డు అసెట్ యొక్క స్వాధీనం చేసుకునేందుకు అనుగుణంగా భౌతిక స్వాధీనంలోని దిగువ వివరించినట్లుగా స్థిరాస్తి యొక్క కొనుగోలు కొరకు సీల్డు కవర్లలో **"ఎక్కడ ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ప్రతిపాదికన"** క్రింది సంతకందారుడు ఆఫర్లను ఆహ్వానిస్తున్నారు, వివరాలు దిగువ విధంగా ఉన్నాయి.

లోన్ కోడ్/ బ్రాంచ్/ రుణగ్రహీత(ల)/ సహ-రుణగ్రహీత(ల)/ హామీదారు(లు)	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	ఆస్తి వివరణ-ఫైనల్	రిజర్వు ధర	ధరావత్తు (ఈఎండి) (అర్‌పిలో 10%)	బాకీపడిన మొత్తం (07-02-2024)
లోన్ కోడ్ నెంబర్: 06600002487, రాజమండ్రి (బ్రాంచ్), బోసుబాబు పాలభల్లా (రుణగ్రహీత), దయారాణి పాలభల్లా (సహ రుణగ్రహీత 1)	తేది: 12.05.2021, **రూ.14,83,425/-** (రూపాయలు పద్నాలుగు లక్షల ఎనభైమూడువేల నాలుదువందల ఇరవైఐదు మాత్రమే)	ప్లాట్ నెం.151, హైవే సిటీఫేజ్-2, వేంపాడు గ్రామం, కొక్కిరపాడు జిపి, ఎన్‌హెచ్-5 ఏలూరు, రామచంద్ర కళాశాల ఎదురుగా, ఏలూరు కృష్ణ, ఆంధ్రప్రదేశ్ -520008లో విస్తీర్ణం కలిగియున్న ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం:152, దక్షిణం: ప్లాట్ నెం: 150, తూర్పు: 33అ.ల రోడ్డు, పడమర: ప్లాట్ నెం:162.	రూ. 998730/- (రూ.తొమ్మిది లక్షల తొంభై ఎనిమిదివేల ఏడువందల ముప్పై మాత్రమే)	రూ.99873/- (రూ.తొంభై తొమ్మిది వేల ఎనిమిది వందల డెబ్బైమూడు మాత్రమే)	రూ.1416434/- (రూ.పద్నాలుగు లక్షల పదహారు వేల నాలుగు వందల ముప్పై నాలుగు మాత్రమే)
లోన్ కోడ్ నెంబర్: 02400006524, విజయవాడ (బ్రాంచ్), దుర్గా చింతలచెరువు (రుణగ్రహీత), సునీల్ చింతలచెరువు (సహ రుణగ్రహీత 1)	తేది: 26.07.2019 **రూ. 25,68,572/-** (రూపాయలు ఇరవైఐదు లక్షల అరవైఎనిమిది వేల ఐదువందల డెబ్బైరెండు మాత్రమే)	ఫ్లాట్ నెం.ఎస్ఎఫ్-203, రెండవ అంతస్తు, సద్గురు టవర్స్, రామాలయం వీధి, తాడిగడప (గ్రా) పెనమలూరు మండలం, కృష్ణా(జి) విజయవాడ కృష్ణా, ఆంధ్రప్రదేశ్ 520008లో విస్తీర్ణం కలిగియున్న ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: ఒపెన్ టు స్కై, దక్షిణం:ఫ్లాట్ నెం.203& ఫ్లాట్ 204మధ్య ఉమ్మడి గోడ, తూర్పు: ఒపెన్ టు స్కై, పడమర: ఉమ్మడి కారిడార్& మెట్లు.	రూ. 12,00,000/- (రూ. పన్నెండు లక్షలు మాత్రమే)	రూ. 1,20,000/- (రూ.ఒకలక్ష ఇరవై వేలు మాత్రమే)	రూ. 2149981/- (రూ.ఇరవై ఒక్క లక్షా నలభై తొమ్మిది వేల తొమ్మిది వందలఎనభై ఒకటి మాత్రమే)
లోన్ కోడ్ నెంబరు: 02400006229, విజయవాడ (బ్రాంచ్), రవి కుమార్ చలసాని (రుణగ్రహీత), సుష్మా చలసాని (సహ రుణగ్రహీత 1)	తేది: 12.05.2021, **రూ.16,92,245/-** (రూపాయలు పదహారులక్షల తొంభైరెండువేల రెండువందల నలభైఐదు మాత్రమే)	'ప్లాట్ నెం 1 మరియు 2, ఎల్‌పి నెం.:148/2015/ vja, మంగళపురం రోడ్, చల్లపల్లి షుగర్ ఫ్యాక్టరీ దగ్గర, లక్ష్మీపురం, చల్లపల్లి, కృష్ణ ఆంధ్రప్రదేశ్-520002 లో విస్తీర్ణం కలిగియున్న ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం:40'వె.ల రోడ్డు, దక్షిణం:ప్లాట్ నెం-3, తూర్పు: ఇతరులసైట్, పడమర:40' వెడల్పు రోడ్డు	రూ. 18,63,000/- (రూ.పద్దెనిమిది లక్షల అరవైమూడు పదివేలు మాత్రమే)	రూ. 1,86,300/- (రూ.ఒకలక్ష ఎనభైఆరువేల మూడువందలు మాత్రమే)	రూ. 1561138/- (రూ.పదిహేను లక్షల అరవై ఒక్క వేల నూట ముప్పై ఎనిమిది మాత్రమే)
లోన్ కోడ్ నెంబర్: 02400005576, విజయవాడ (బ్రాంచ్), సమాధానం చల్లగాలి (రుణగ్రహీత), డేవిడ్ మనోహర్ చల్లగాలి (సహ రుణగ్రహీత 1)	తేది: 26.07.2019, **రూ.12,80,418/-** (రూపాయలు పన్నెండులక్షల ఎనభైవేల నాలుగువందల పద్దెనిమిది మాత్రమే)	ప్లాట్ నెం:79, వాటర్ ట్యాంక్ ఎదురుగా, రోడ్ నెం:2, ఫేజ్-2, డ్రీమ్ సిటీ, B.j.j.r విగ్రహం దగ్గర, కొమరవోలుగ్రామం, పామరుమండలం, కృష్ణా ఆంధ్రప్రదేశ్-521157 లో విస్తీర్ణం కలిగియున్న ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు :ఉత్తరం: ఓపెన్ ప్లాట్ నెం:78, దక్షిణం: ఒపెన్‌ప్లాట్ నెం: 80, తూర్పు: ఇతరుల స్థలం, పడమర: 40 అ.ల వెడల్పు రోడ్డు.	రూ. 5,60,000/- (రూ.ఐదు లక్షల అరవై వేలుమాత్రమే)	రూ. 56,000/- (రూ.యాభై ఆరు వేలు మాత్రమే)	రూ.1185376/- (రూ.పదకొండు లక్షల ఎనభైఐదు వేల మూడు వందల డెబ్బై ఆరు మాత్రమే)
లోన్ కోడ్ నెంబర్: 02400006910, విజయవాడ (బ్రాంచ్), సురేష్ సుందరదాసు (రుణగ్రహీత), సుజాత సుందరదాసు (సహ రుణగ్రహీత 1)	తేది: 20.02.2020, **రూ.40,32,689/-** (రూపాయలు నలభైలక్షల ముప్పైరెండువేల ఆరువందల ఎనభైతొమ్మిది మాత్రమే)	డోర్ నెం.20-28/1, రమ్య అపార్ట్‌మెంట్ రోడ్ వెస్ట్‌ఇబ్రహీంపట్నం, రమ్య అపార్ట్‌మెంట్ దగ్గర, కృష్ణ ఇబ్రహీంపట్నం, విజయవాడ, కృష్ణా ఆంధ్రప్రదేశ్ - 521456 లో విస్తీర్ణం కలిగియున్న ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: మెట్లు, ఉమ్మడి కారిడార్ &ఒపెన్ టు స్కై, దక్షిణం: ఒపెన్ టు స్కై, తూర్పు: ఒపెన్ టు స్కై, పడమర:ఒపెన్ టు స్కై.	రూ.40,23,000/- (రూ.నలభైలక్షల ఇరవైమూడు వేలు మాత్రమే)	రూ. 402300/- (రూ.నాలుగు లక్షల రెండువేల మూడువందలు మాత్రమే)	రూ.3860061/- -, (రూ.ముప్పై ఎనిమిది లక్షల అరవైవేల అరవై ఒకటి మాత్రమే)
లోన్ కోడ్ నెంబర్: 02400005624, విజయవాడ (బ్రాంచ్), ఉషా కిరణ్ కోకా (రుణగ్రహీత), వెంకట నాగ మహేష్ కోకా (సహ రుణగ్రహీత 1)	తేది: 22.05.2021 **రూ.24,69,453/-** (రూపాయలు ఇరవైనాలుగు లక్షల అరవైతొమ్మిది వేల నాలుగువందల యాభై మూడు మాత్రమే)	డి.నెం:18/299, వార్డ్ నెం:18, కొక్కువారి వీధి, షాదీఖానా రోడ్ ఏరియా, అప్సర లాడ్జ్ వెనుక వైపు ప్రాంతం, ఇంగ్లీష్-పల్లెం, మచిలీపట్నం, కృష్ణా ఆంధ్రప్రదేశ్ -521001లో విస్తీర్ణం కలిగియున్న ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: ఇతరుల డోర్ నెం.18/278 & ఇతరుల ఇల్లు, దక్షిణం: ఇతరుల ఇల్లు & డోర్ నెం.18/299 పార్ట్, తూర్పు: దాతల భూమి లాక్‌చేయబడిన ఆస్తి, పడమర: రోడ్డు & కె.ఎన్.ఎస్.ఎస్.రావు ఇల్లు.	రూ.27,21,600/- (రూ.ఇరవైఏడు లక్షల ఇరవైఒకవేల ఆరువందల మాత్రమే)	రూ. 2,72,160/- (రూ.రెండు లక్షల డెబ్బైరెండువేల ఒకవంద అరవై మాత్రమే)	రూ. 1988064/- (రూ.పంతొమ్మిది లక్షల ఎనభై ఎనిమిది వేల అరవై నాలుగు మాత్రమే)
లోన్ కోడ్ నెంబరు: 02400005317, విజయవాడ (బ్రాంచ్), విజయలక్ష్మి బత్తుల (రుణగ్రహీత),	తేది: 09.09.2020, **రూ.11,40,001/-** (రూపాయలు పదకొండు లక్షల నలభైవేల ఒకటి మాత్రమే)	ప్లాట్ నెం:90, రోడ్ నెం:2, ఫేజ్-2, డ్రీమ్, సిటీ, కొమరవోలు గ్రామ రోడ్, B.j.j.r విగ్రహం దగ్గర, కొమ్రవోలు గ్రామం, పామరుమండలం, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-520008లో విస్తీర్ణం కలిగియున్న ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం:ప్లాట్ నెం:89, దక్షిణం: ప్లాట్ నెం:91, తూర్పు:ఇతరుల భూమి, పడమర: 40 అ.ల రోడ్డు.	రూ. 7,90,000/- (రూ.ఏడు లక్షల తొంభై వేలుమాత్రమే)	రూ.79000/- (రూ.డెబ్బై తొమ్మిది వేలు మాత్రమే)	రూ. 1124038/- (రూ.పదకొండు లక్షల ఇరవై నాలుగు వేల ముప్పై ఎనిమిది మాత్రమే)
లోన్ కోడ్ నెంబరు: 10600001221, గుంటూరు (బ్రాంచ్), యోగేష్ కుమార్ అవస్థి (రుణగ్రహీత), విజయ్ కుమార్ అవస్థి (సహ రుణగ్రహీత 1)	తేది: 19.08.2020, **రూ.15,13,842/-** (రూపాయలు పదిహేనులక్షల పదమూడువేల ఎనిమిది వందల నలభైరెండు మాత్రమే)	ఆస్తి అసిస్ట్ నెం.160839, డోర్ నెం.23/1 గాయత్రీ నగర్ 1వ లైన్, భవానీ టవర్స్ దగ్గర, భానుప్రసాద్ కాలనీ దగ్గరలో, లాల్‌పురం రోడ్ దగ్గర, గుంటూరు గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522001లో విస్తీర్ణం కలిగియున్న ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: రోడ్డు, దక్షిణం: ఇతరులు, తూర్పు: గౌస్ పీరా, పడమర: ఎస్‌కె. ఇస్మాయిల్, జబీవుల్లా, మక్బుల్ అహ్మద్.	రూ. 13,41,000/- (రూ.పద మూడు లక్షల నలభైఒక వేలుమాత్రమే)	రూ. 1,34,100/- (రూ.ఒకలక్షల ముప్పైనాలుగు వేల ఒకవంద మాత్రమే)	రూ. 1469550/- (రూ.పద్నాలుగు లక్షల అరవై తొమ్మిది వేల ఐదు వందల యాభై మాత్రమే)

ఇ-వేలం తేది: 29-02-2024, ఉ॥11.00గం.ల నుండి మ.2.00గం.ల వరకు (ప్రతి 5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో), బిడ్ దాఖలుచేయుటకు చివరి తేది: 28-02-2024, సా.4.00గం.లకు ముందు.
అమ్మకం యొక్క వివరణాత్మక నియమ నిబంధనల కొరకు దయచేసి, www.piramalfinance.com/e-Auction.html లో కల్పించిన లింక్‌ను చూడండి లేదా piramal.auction@piramal.com పై మాకు ఇమెయిల్ చేయండి.
రుణగ్రహీత/హామీదారు/తాకట్టుదారుకు SARFAESI చట్టం క్రింద చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకపు ప్రకటన
వేలం తేదీకి ముందు తేదీ వరకు వర్తించు వడ్డీతోసహా పూర్తి గా సెక్షన్ 13(2) నోటీసులో పేర్కొన్నట్లుగా పూర్తి బకాయిని చెల్లించవలసిందిగా పై పేర్కొన్న రుణగ్రహీత/హామీదారును కోరబడుచున్నది, విఫలం చెందిన ఏదైతే, ఆస్తి వేలంచేయబడుతుంది మరియు మిగతా బకాయిల కొరకు రుణగ్రహీత / హామీదారు నుండి వడ్డీ& ఖర్చులు ఏవేని ఉన్నట్లైతే వారి నుండే వసూలు చేయబడుతుంది.
తేది: 13-02-2024, ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ — సం/- (అధీకృత అధికారి) పిరామల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

పాలస్తీనా రచయితలకు అండగా నిలవండి

న్యూఢిల్లీ : పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సైనికులు సాగిస్తున్న మారణహోమంపై స్పందించాలని 600 మందికి పైగా రచయితలు, కవులు 'పెన్ అమెరికా' సంస్థను కోరారు. సాహితీవేత్తల భావ ప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించేందుకు ఈ సంస్థ కృషి చేస్తోంది. పాలస్తీనాలోని రచయితల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయని, వారికి స్వేచ్ఛ లేకుండా పోయిందని కవులు, సాహితీవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలో పుస్తకాలను నిషేధించడంలో చూపిన తెగువ, ధైర్యాన్ని పాలస్తీనా ప్రజల విషయంలో కూడా చూపాలని వారు పెన్ అమెరికా సంస్థకు సూచించారు. పాలస్తీనా రచయితలపై గత సంవత్సరం అక్టోబర్ 7వ తేదీ నుండి ఆంక్షలు కొనసాగుతున్నాయని, వారి కలాలకు కళ్లెం వేశారని తెలిపారు. వేధింపులకు గురవుతున్న రచయితలకు ఓ వేదికను కల్పించి, వారికి రక్షణగా నిలవలేని పక్షంలో పెన్ అమెరికాను రద్దు చేయాలని హితవు పలికారు.

జెఇఇ మెయిన్ సెషన్ -1 తుది కీ విడుదల

న్యూఢిల్లీ : దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ మెయిన్ తొలి విడత పరీక్షల తుది కీ విడుదలైంది. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఈ పరీక్షలను ఎన్టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) నిర్వహించింది. ఇవాళ తుది కీని విడుదల చేసింది. త్వరలోనే ఫలితాలను వెల్లడించనుంది. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు నిర్వహించిన జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షలకు 12,95,617 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 12,25,529 మంది హాజరయ్యారు. తుది కీ కోసం https://jeemain.nta.ac.in./ అనే వెబ్‌సైట్‌ను సందర్శించొచ్చు. లేదా ఈ లింక్‌పై క్లిక్ చేసి జేఈఈ మెయిన్ సెషన్ -1 తుది కీ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు..

మనీష్ సిసోడియాకు మధ్యంతర బెయిల్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాకు మూడు రోజుల మధ్యంతర బెయిల్ మంజూరైంది. తనకు మూడు రోజులు బెయిల్ ఇవ్వాలని మనీష్ సిసోడియా రూస్ అవెన్యూ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తిపై విచారణ చేపట్టిన రూస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ ఈ నెల 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు మధ్యంతర బెయిల్ ఇచ్చారు.. ఈ మూడు రోజులు మనీష్ సిసోడియా తన మేనకోడలు వివాహానికి హాజరవుతారని సమాచారం. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి అవినీతి కేసులో సీబీఐ 26, ఫిబ్రవరి 2023న మనీష్ సిసోడియాను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

తగ్గిన ద్రవ్యోల్బణం సూచీ

న్యూఢిల్లీ : ప్రస్తుతేడాది జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) 5.10 శాతానికి తగ్గిందని నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీసు (ఎన్ఎస్ఒ) తెలిపింది. ఇది మూడు నెలల కనిష్ట స్థాయి అని పేర్కొంది. ఇంతక్రితం డిసెంబర్‌లో సిపిఐ 5.7 శాతంగా చోటు చేసుకుంది. జనవరిలో గ్రామీణ ప్రాంతాల్లో సిపిఐ 5.34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 4.92 శాతంగా నమోదయ్యింది.

కాంగ్రెస్‌కు అశోక్ చవాన్ రాజీనామా

ముంబై : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ సీనియర్ నేత, మహారాష్ట్ర మాజీ సిఎం అశోక్ చవాన్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశానని, తన రాజీనామా లేఖను ఆ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ చీఫ్ నానా పటోల్‌కు పంపించానని అశోక్ చవాన్ సోమవారం తెలిపారు. అశోక్ చవాన్ భోకర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన స్పీకర్ రాహుల్ నార్వేకర్‌ను కలిసి తన రాజీనామాను అందజేశారు. కొద్దిరోజుల్లో బిజెపిలో చేరేందుకే అశోక్ కాంగ్రెస్‌కి రాజీనామా చేసినట్లు సమాచారం.

ఎనిమిది మంది భారతీయుల్ని విడుదల చేసిన ఖతార్

న్యూఢిల్లీ : గూఢచర్యం ఆరోపణలపై మరణ శిక్ష విధించిన ఎనిమిదిమంది భారతీయులను ఖతార్ ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది.
ఈ విషయాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) సోమవారం ఉదయం ప్రకటన విడుదల చేసింది. వీరిలో ఏడుగురు ఇప్పటికే స్వదేశం బయలు దేరారని కూడా తెలిపింది. ఖతార్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లుగా కూడా వెల్లడించింది. గూఢచర్యం ఆరోపణలతో 2022 ఆగష్టులో అరెస్టు చేసిన ఎనిమిది మంది భారత నేవీ మాజీ అధికారులకు గత ఏడాది అక్టోబర్‌లో ఖతార్ కోర్టు మరణ శిక్ష విధించింది. తరువాత ఈ శిక్షను జైలు శిక్షగా మార్చింది. తాజాగా దాన్ని కూడా రద్దు చేసింది. ఖతార్ అరెస్టు చేసిన వారిలో కెప్టెన్ నవతేజ్ సింగ్ గిల్, కెప్టెన్ బీరేంద్ర కుమార్ వర్మ, కెప్టెన్ సౌరభ్ వశిష్ట్, కమాండర్ అమిత్ నాగ్‌పాల్, కమాండర్ పూర్ణేందు తివారీ, కమాండర్ సుగుణాకర్ పాకాల, కమాండర్ సంజీవ్ గుప్తా, సెయిలర్ రగేష్ ఉన్నారు.

కాగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 13 నుంచి 15 తేదీల్లో యుఏఇలో పర్యటించనున్నారు. ఈ పర్యటన ముగించుకునే వచ్చే ముందు 14 తేదీలో ఖతార్‌లో కూడా మోడీ పర్యటిస్తారని కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా విలేకరులకు తెలిపారు.

బుల్డోజర్ కూల్చివేతలు ఫ్యాషన్ అయిపోయింది

- స్థానిక సంస్థల అధికారులపై మధ్యప్రదేశ్ హైకోర్టు ఆగ్రహం
- క్రమశిక్షణా చర్యలకు ఆదేశం

న్యూఢిల్లీ : బుల్డోజర్లతో అక్రమంగా ఇళ్ల కూల్చివేత ఈ మధ్య ఫ్యాషన్‌గా మారిందని మధ్యప్రదేశ్ హైకోర్టు వ్యాఖ్యానించింది. అక్రమ ఇళ్ల కూల్చివేతకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేస్తూ సంబంధిత మున్సిపల్ అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించింది. పిటిషనర్‌కు నష్టపరిహారంగా లక్ష రూపాయలు చెల్లించాలని తీర్పు ఇచ్చింది.

ఉజ్జయిని మున్సిపల్ కార్పొరేషన్ (యుఎంసి) అనుసరించాల్సిన విధి విధానాలను సక్రమంగా అనుసరించకుండానే తన ఇళ్లను కూల్చివేసిందని, ఇందుకు తనకు నష్టపరిహారం ఇప్పించాలంటూ పిటిషనర్ రాధా లాంగ్రి కోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన జస్టిస్ వివేక్ రూయిసా తీర్పునిస్తూ, చట్టప్రకారం ఇళ్ల కూల్చివేతకు అనుసరించాల్సిన పద్ధతులేవీ చేపట్టకుండానే ఇళ్లను కూల్చివేయడమనేది స్థానిక యంత్రాంగానికి, స్థానిక సంస్థలకు ఒక ఫ్యాషన్‌గా మారిందని వ్యాఖ్యానించింది. ఈ విషయం అనేకసార్లు కోర్టు దృష్టికి వచ్చిందని చెప్పారు. సహజ న్యాయం ప్రకారం చేపట్టాల్సిన చర్యలు చేపట్టకుండా, పత్రికలో ప్రచురించకుండా ఏ ఇంటినైనా కూల్చివేయడమన్నది పరిపాటి అయిపోయిందని పేర్కొంది. ఈ కేసుకు సంబందించి పిటిషనర్ కుటుంబ సభ్యుల్లో ఒకరిపై కేసు నమోదు చేశారని కూడా న్యాయమూర్తి పేర్కొన్నారు. ఇంటి నెంబరు 466 పర్వేజ్ ఖాన్‌కు చెందినదిగా పత్రాలు వున్నాయని, అంతేకానీ ఆ ఇల్లు లాంగ్రికి చెందినదిగా లేదని యుఎంసి ఆరోపించింది. అయితే పర్వేజ్ ఖాన్ అనే పేరుతో ఎవరూ లేరని కోర్టు కనుగొంది. భవనాల అధికారి సంఘటనా ప్రదేశానికి వెళ్లలేదని, అక్కడ ఎవరితోనూ మాట్లాడి విషయాలు కనుగొనలేదని కోర్టు పేర్కొంది. కేవలం మౌఖిక సమాచారం ప్రాతిపదికన కూల్చివేతకు చర్యలు తీసుకున్నారని కోర్టు వ్యాఖ్యానించింది.

'ఢిల్లీ ఛలో'కు అన్నదాతలు

- రాజధానిలో నెల రోజుల పాటు సెక్షన్ 144 విధింపు

న్యూఢిల్లీ : మంగళవారం నాటి 'ఢిల్లీ ఛలో' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు రాజధానిలో 144 సెక్షన్ విధించారు. ఈ ఉత్తర్వులు సోమవారం నుండే అమలులోకి వచ్చాయి. మార్చి 12వ తేదీ వరకూ అమలులో ఉంటాయని తెలిపారు. 16వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చ దేశవ్యాపిత గ్రామీణ బంద్, రంగాల వారి పారిశ్రామిక సమ్మెకు పిలుపునిచ్చిన దృష్ట్యా దానిపై ఉక్కుపాదం మోపాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం నిర్బధాన్ని తీవ్రతరం చేస్తోంది. 13వ తేదీ 'ఢిల్లీ చలో' కార్యక్రమం సాకుగా చూపి ముందస్తు నిర్బంధ చర్యలకు పాల్పడుతుంది. ఇటువంటి బెదిరింపులకు లొంగేది లేదని ఎస్‌కెఎం స్పష్టం చేసింది. 16వ తేదీన చేపట్టే ఆందోళనకు దేశవ్యాపితంగా రైతాంగం, కార్మిక వర్గం సమాయత్తమవుత్నాయి. ఢిల్లీ వెళుతున్న కర్నాటక రైతులను భోపాల్‌లో అరెస్ట్ చేయడాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు. పలు రాష్ట్రాల నుండి రాజధాని వైపు వస్తున్న రైతులను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధిస్తున్నట్లు వార్తలందుతున్నాయి. పంటలకు కనీస మద్దతు ధరలు కల్పిస్తామన్న హామీకి చట్టబద్ధత కల్పించాలని రైతులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.

నిఖిల్ వాగ్లేపై దాడిని ఖండించిన జర్నలిస్టు సంఘాలు

న్యూఢిల్లీ : ఈ నెల 9న పూణేలో సీనియర్ జర్నలిస్టు నిఖిల్ వాగ్లేపై బిజెపి గూండాల పాశవిక దాడిని ప్రముఖ జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఇటీవల కాలంలో దేశంలో జర్నలిస్టులపై దాడులు చాలా సాధారణమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రజాస్వామ్య విలువలు, భావప్రకటనా స్వేచ్ఛను నిలబెట్టే మీడియాపై ఇటువంటి దాడులు ఆందోళనకరమని పేర్కొన్నాయి. పూణేలోని ఖండోజీ బాబా చౌక్‌లో జర్నలిస్టు నిఖిల్ వాగ్లే, మరో ఇద్దరిపై బిజెపి గూండాలు దాడికి పాల్పడ్డారు. బిజెపి నాయకుడు ఎల్‌కె అద్వానికి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడానికి వ్యతిరేకంగా నిఖిల్ వాగ్లే వ్యాఖ్యలపై ఎఫ్ఐఆర్ దాఖలైన తరువాత ఈ దాడి జరిగింది. దాడికి వ్యతిరేకంగా ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, భారతీయ మహిళా ప్రెస్ కార్ప్స్, ప్రెస్ అసోసియేషన్, ఇతర సంఘాలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. బాధిత జర్నలిస్టుకు తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేశాయి. జర్నలిస్టులపై హింస పెరగడం ప్రజాస్వామ్య స్వరూపానికి ఆందోళనకరమని, హానికరమని జర్నలిస్టు సంఘాలు తమ దిగ్భ్రాంతిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. జర్నలిస్టు వాగ్లేపై ఎఫ్ఐఆర్‌లో క్రిమినల్ చట్టాలతో సహా మోపిన తీవ్ర అభియోగాలను ఉపసంహరించుకోవాలని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

రైతు పక్షమా...అమెరికాకు దాసోహమా?

- డబ్ల్యూటిఓలో భారత్ వైఖరిపై సర్వత్రా ఆసక్తి

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్నదాతలకు ఆసరాగా నిలుస్తుందా లేక అమెరికాకు కొమ్ము కాస్తుందా అనే విషయం త్వరలోనే తేలిపోతుంది. ఈ నెల 26న అబుధాబీలో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటిఒ) మంత్రుల స్థాయి సమావేశం జరగబోతోంది. ఈ సమావేశంలో భారత్ తన వైఖరిని తెలియజేయాల్సి ఉంటుంది. మోడీ ప్రభుత్వంపై రైతులు ఇప్పటికే పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, వ్యవసాయ కార్పొరేటీకరణకు స్వస్తి చెప్పాలని వారు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.

మోడీ ప్రభుత్వం హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను ప్రకటించిన విషయం తెలిసిందే. దేశంలో లక్షలాది మంది రైతుల అభ్యున్నతి కోసం ఆయన సూచించిన వ్యవసాయ సంస్కరణల్ని అమలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. రైతుల దీర్ఘకాలిక డిమాండ్‌ను పట్టించుకోని ప్రభుత్వం పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు ఆహార ధాన్యాల కొనుగోలు, నిల్వ, పంపిణీ కోసం శాశ్వత పరిష్కారం కనుగొనాలని డబ్ల్యూటీఓలో గట్టిగా వాదిస్తుందని ఎలా అనుకోగలమని అంటున్నారు.

ఈ నెల 26న అబుధాబీలో జరిగే డబ్ల్యూటీఓ వాణిజ్య మంత్రుల సమావేశానికి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారు. వ్యవసాయానికి సంబంధించి వర్ధమాన దేశాలు చేస్తున్న డిమాండ్‌ను నెరవేర్చే అవకాశం ఉన్నదా లేదా అనే విషయంపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు. ఈ సమావేశంలో అమెరికా, యూరోపియన్ యూనియన్, చైనా పలు అంశాలను ప్రస్తావించే అవకాశం ఉన్నదని చెబుతున్నారు. ప్రపంచంలో మెజారిటీ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్న ప్రధాన అంశం ఆహార భద్రత. దీనికి ప్రభుత్వాలు గ్యారంటీ ఇవ్వగలవా అనేదే ప్రశ్న.

డబ్ల్యూటిఒ ప్రస్తుత నిబంధనలు వర్ధమాన దేశాల ప్రయోజనాల కన్నా సంపన్న దేశాల ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నాయి. ఈ నిబంధనలను సవరించే యత్నాలను అమెరికా, ఈయూ, జపాన్, స్విట్జర్లాండ్, నార్వే, కెనడా తదితర దేశాలు అనుమతించవు. మోడీ ప్రభుత్వం అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గి దేశ ప్రయోజనాలపై రాజీ పడినా ఆశ్చర్యం లేదు. ఆహార భద్రతకు శాశ్వత పరిష్కారం కనుగొనాలన్న డిమాండ్‌ను అమెరికా వ్యతిరేకిస్తోంది. ఇండొనేషియా నేతృత్వంలోని జీ-33 దేశాలు, ఆఫ్రికా గ్రూపు సహా వర్ధమాన దేశాలు శాశ్వత పరిష్కారం కోసం డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఈ దేశాలు ఇప్పుడు భారత్ వైపు చూస్తున్నాయి. భారత్ ముందుండి తమను నడిపించాలని అవి కోరుకుంటున్నాయి.

అయితే వాణిజ్య ఒప్పందాలకు కట్టుబడి ఉండే విషయంలో మోడీ ప్రభుత్వ రికార్డు దారుణంగా ఉంది. 2015లో వాణిజ్య మంత్రిగా ఉన్న ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎలాంటి ప్రతిఘటన చూపకుండానే అమెరికాకు దాసోహమన్నారు. ఏదేమైనా మరో రెండు నెలల్లో దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోడీ ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తుందా లేక దేశీయంగా, అంతర్జాతీయంగా కాడి కింద పడేసి అమెరికాకు లొంగిపోతుందా అన్నది వేచి చూడాల్సిందే.

వైజ్ఞానిక రంగంలో మహిళలకు సమ ప్రాధాన్యం

- ఐరాస చీఫ్ పిలుపు



ఐక్యరాజ్యసమితి : విజ్ఞానశాస్త్రంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించి, ప్రోత్సహించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి11న 'సైన్స్‌లో బాలికలు, మహిళలు' అంతర్జాతీయ దినోత్సవ సందర్భంగా ఆయన ఒక సందేశమిస్తూ, శాస్త్ర, సాంకేతిక రంగాలలో మహిళలు, బాలికల కీలక పాత్ర పోషించాల్సిన ఆవశ్యకత గురించి గుటెరస్ నొక్కిచెప్పారు. అందరికీ మంచి భవిష్యత్తును నిర్మించేందుకు సైన్స్‌లో లింగ సమానత్వం అత్యంత ఆవశ్యకమన్నారు. శాస్త్రీయ సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సవాళ్లను గుటెరస్ ప్రస్తావించారు. సైన్స్‌లో వత్తిని కొనసాగించకుండా నిరోధించే శారీరకపరమైన అడ్డంకులు, వివక్షను ఎదుర్కొంటూనే ఉన్నారని ఆయన చెప్పారు.

మహిళలు అంతర్జాతీయ సైన్స్ సమాజంలో మూడింట ఒక వంతు మాత్రమే ఉన్నారని, వారు నిధులు, ప్రచురణ అవకాశాలు ఉన్నత స్థానాలను పొందడంలో అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నారని అన్నారు. "వాతావరణ మార్పుల నుండి కత్రిమ మేధస్సు వరకు అన్ని రంగాల్లోను సరికొత్త ఆవిష్కరణల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగేలా చూడాలని ఆయన కోరారు. అందరికీ విజ్ఞానం అందేలా చూసేందుకు ఇదే ఏకైక మార్గం" అని ఆయన ఉద్ఘాటించారు. సైన్స్‌లో లింగ అంతరాన్ని తగ్గించడానికి, గుటెర్రెస్ "లింగ మూస పద్ధతులను తొలగించడం మరియు సైన్స్‌ని ఎంచుకోవడానికి బాలికలను ప్రోత్సహించే రోల్ మోడల్‌లను ప్రోత్సహించడం, సైన్స్‌లో మహిళల అభివద్ధికి తోడ్పడే కార్యక్రమాలను చేపట్టడం వంటివి చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

గాజాలో 67మంది పాలస్తీనియన్లు మృతి

గాజా : రఫా నగరంలో సోమవారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ బలగాలు జరిపిన వైమానిక, సముద్ర దాడుల్లో 67మంది పాలస్తీనియన్లు మరణించారు. రాత్రి సమయంలో ఆకాశం నుండి యుద్ధ విమానాలు చేసిన దాడులతో శరణార్థ శిబిరాల్లో బీభత్సం చోటు చేసుకుందని మీడియా పేర్కొంది. 20 నిముషాల పాటు ఈ పేలుళ్లు సాగాయి. గాయపడిన వారు, నిర్వాసితులు అందరూ షబౌరా ఏరియాలో తెరిచి వున్న ఒకే ఒక కువైటీ ఆస్పత్రికి మూకుమ్మడిగా పరుగులెత్తారని తెలిపింది. ఇజ్రాయిల్ సైన్యం దారుణాలతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయని, ఒక రకమైన నిస్సహాయత నెలకొంటోందని ఒక విలేకరి వ్యాఖ్యానించారు. ఇదిలావుండగా, హమాస్‌పై పూర్తి విజయాన్ని సాధించేవరకు యుద్ధం కొనసాగుతూనే ఉంటుందని నెతన్యాహు స్పష్టం చేశారు. హమాస్ చెరలో వున్న బందీలను విడిపించడమే లక్ష్యమన్నారు. డచ్ ప్రధాని మార్క్ రూట్‌తో భేటీ సందర్భంగా నెతన్యాహు పై వ్యాఖ్యలు చేశారు. రఫా శివారు ప్రాంతమైన షబౌరాలో ఒక ఇంట్లో బందీలుగా వున్న ఇద్దరిని విడిపించినట్లు ఇజ్రాయిల్ ఆర్మీ తెలిపింది. మరోవైపు ఖాన్ యూనిస్ నగరంలోని నాజర్ ఆస్పత్రిలో ఏడుగురిని చంపేశారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. జనంతో కిక్కిరిసిపోయి వున్న రఫా నగరంపై పదాతి దాడులకు దిగాలన్న ఇజ్రాయిల్ ప్రణాళికలు బందీల మార్పిడిపై జరిగే చర్చలను దెబ్బతీస్తాయని సీనియర్ హమాస్ నేత వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు గాజాపై దాడుల్లో 28,340మంది మరణించగా, 67,984మంది గాయపడ్డారు.

ఇయు దేశాలకు లేఖ

గాజాలో సాగుతున్న మారణకాండపై అంతర్జాతీయ న్యాయ స్థానం ఇచ్చిన ఆదేశాలను ఇజ్రాయిల్ అమలు చేసేలా చూడాలని కోరుతూ 16 ఇయు దేశాలకు మానవ హక్కుల గ్రూపులు, సంఘాలు లేఖ రాశాయి. ఇయు దేశాలిచ్చిన సమాధానం చాలా అసంతృప్తిగా వుందని ఆయా గ్రూపులు పేర్కొన్నాయి. ఇజ్రాయిల్‌పై ఆదేశాలను అమలు చేసేలా చూస్తామని కానీ లేదా వాటికి కట్టుబడే చట్టపరమైన బాధ్యత వుందన్న ఉద్దేశ్యం కానీ ఏ ఒక్క దేశమూ ప్రకటించలేదని పేర్కొన్నాయి.

(మొదటి పేజీ తరువాయి)

తమిళనాడు గవర్నర్ వికృత పోకడ

ఏర్పడుతుందని వ్యాఖ్యానించింది.

గతేడాది బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో కూడా గవర్నర్ రవి కొన్ని పేరాలను వదిలేసి చదివారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితులు, ద్రవిడ తరహా పాలన, అంబేద్కర్, ద్రవిడ నేతలు గురించి వున్న భాగాలను ఆయన వదిలేశారు. గవర్నర్ వ్యవహరించిన తీరును స్టాలిన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది.

కేంద్రం విపక్షపై సూటిగా విమర్శ

48పేజీల ఈ ప్రసంగంలో, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో తమిళనాడు సాధించిన విజయాలతో పాటు రాష్ట్రం పట్ల కేంద్రం అనుసరిస్తున్న వివక్షను సూటిగా పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో తమిళనాడు తీవ్రమైన వరదల్లో చిక్కుకుంటే కేంద్రం పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆర్థిక స్వయంప్రతిపత్తిని కూడా వదులుకుని, జిఎస్‌టిని అమలు చేయడానికి అంగీకరించాయని, రాష్ట్రాలకు తగిన నష్టపరిహారం అందుతుందని, చట్టబద్ధంగా తమకు రావాల్సిన రెవిన్యూ వస్తుందని ఆశించాయని, కానీ అలా జరగలేదని, కేంద్రం 2022 జూన్‌లో నష్టపరిహార నిబంధనలను రద్దు చేసిందని, దాంతో రాష్ట్రం ఏటా రూ.20వేల కోట్ల రెవిన్యూ లోటును ఎదుర్కొంటోందని ఇలా అడుగడుగునా రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తోందని విమర్శించింది.

చెన్నై మెట్రో రైలు ప్రాజెక్టులో సగం ఖర్చు భరిస్తామని తొలుత ఇచ్చిన హామీ నుండి కేంద్రం వెనక్కి మళ్ళిందని, దాంతో రెండేళ్ళకు పైగా ఈ ప్రాజెక్టులో జాప్యం జరుగుతోందని తెలిపింది. ఇటువంటి ప్రాజెక్టులకు ఇతర రాష్ట్రాల్లో అనుమతులు మంజూరు చేస్తున్నారని ఇక్కడ కూడా మొదట అనుకున్న రీతిలో పరిస్థితులను పునరుద్ధరించాలని కోరింది. రాష్ట్రంలో మత సామరస్యతను పరిరక్షించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని, దానికే కట్టుబడి వున్నామని తమిళనాడు ప్రభుత్వం స్పష్టం చేసింది. సిఎఎను అమలు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. 2021 నుండి ఆలస్యమవుతూ వస్తున్న జాతీయ జన గణనతో పాటూ కుల గణన కూడా చేపట్టాల్సిందిగా ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు.

రైతుల ఆందోళనపై నిరంకుశ విధానాలను విడనాడాలి

- ఎస్‌కెఎం డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పంజాబ్, ఢిల్లీ సరిహద్దుల్లోని హైవేలపై ఇనుప మేకులు, ముళ్ల తీగలు, కాంక్రీట్ బారికేడ్‌లు ఏర్పాటుచేసి ప్రజాస్వామ్యయుతంగా నిర్వహిస్తున్న రైతుల ఆందోళనలపై మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ ధోరణి పట్ల సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఢిల్లీ, హర్యానా పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ట్రాఫిక్‌ను దారి మళ్లించి భయాందోళనకు గురిచేస్తోందని విమర్శించింది. నిరసనకారులను దేశ శత్రువులుగా మోడీ ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తింది. ఈ మేరకు సోమవారం ఎస్‌కెఎం ప్రకటన విడుదల చేసింది. 'ఎఐకెఎస్ నేత రామ్ నారాయణ్ కురారియాతో సహా అతని భార్య, ఐద్వా నేత అంజనా కురారియా, కిసాన్ సంఘర్ష సమితి నాయకుడు ఆరాధనా భార్గవ, బికెయు (టికాయిత్) నేత అనిల్ యాదవ్, ఎన్‌ఎపిఎం నేత రాజ్‌కుమార్ సిన్హాలతో పాటు మధ్యప్రదేశ్ సహా ఐదు రాష్ట్ర నాయకులు, ఎస్‌కెఎం నాయకులపై సిఆర్‌పిసి సెక్షన్ 151 కింద అరెస్టు చేసి జైలులో పెట్టారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పలువురు కార్యకర్తలను అరెస్టు చేశారు' అని తెలిపింది

'ఫిబ్రవరి 13న ఢిల్లీ చలోకు తాము పిలుపునివ్వలేదని, ఈ ఆందోళనతో ఎస్‌కెఎంకు ఎలాంటి సంబంధం లేదని ఎస్‌కెఎం ముందే స్పష్టం చేసింది. అయితే, ఎస్‌కెఎం కాకుండా ఇతర సంఘాలకు నిరసన తెలిపే హక్కు ఉంది. మితిమీరిన రాజ్య అణచివేతకు పాల్పడానికి ఇటువంటి నిరసనలను ప్రజాస్వామ్య పద్ధతిలో చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది' అని తెలిపింది. 'ప్రజల జీవనోపాధి డిమాండ్లపై ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక/ సెక్టోరల్ సమ్మె పిలుపు నేపథ్యంలో రైతులు, కార్మికుల వేదికలతో చర్చలకు ప్రభుత్వం ఎందుకు సిద్ధంగా లేదో ప్రధాని మోడీ స్పష్టం చేయాలి' అని ఎస్‌కెఎం పేర్కొంది.

'ప్రజల జీవనోపాధి డిమాండ్లపై దేశమంతటా జరుగుతున్న పోరాటాలను, ప్రజల ఆందోళనను అణచివేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించవు. పౌరులందరికీ నిరసన తెలిపే హక్కును కల్పించే రాజ్యాంగం దేశంలో ఉందని ప్రధాని నరేంద్ర మోడీ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌కు ఎస్‌కెఎం గుర్తు చేసింది. ఎస్‌కెఎం అన్ని రాజకీయ పార్టీలు, అన్ని తరగతులకు చెందిన వర్గ, బహుజన సంఘాలు మోడీ పరిపాలన దురాక్రమణను ఖండించాలి' అని విజ్ఞప్తి చేసింది. 'బిజెపి హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న అణచివేతను ప్రజలు తిప్పికొట్టాలి. ప్రజల మద్దతుతో రైతులు, కార్మికులు ఫిబ్రవరి 16 పారిశ్రామిక/ సెక్టోరల్ సమ్మె, గ్రామీణ బంద్‌ను భారీగా, ఉత్సాహంగా, విజయవంతమయ్యేలా చేయాలి' అని పిలుపునిచ్చింది.

ఉప ముఖ్యమంత్రి నియామకం తప్పేమి కాదు

- సుప్రీంకోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఒక రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిని నియమించడం రాజ్యాంగ విరుద్ధం కాదని అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పు వెల్లడించింది. ఇలా చేయడం వల్ల రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించినట్లు కాదని స్పష్టం చేసింది. అధికార పార్టీలోని సీనియర్ నాయకులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడానికి దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఉప ముఖ్యమంత్రిని నియమించే పద్ధతిని అవలంభిస్తున్నారని పేర్కొంది. ఉప ముఖ్యమంత్రి నియామకాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీకి చెందిన పబ్లిక్ పొలిటికల్ పార్టీ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వాజ్యాన్ని సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జెబి పార్ధివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి నియామకం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగ విలువ ప్రకారం డిప్యూటీ సిఎంల నియామకం జరుగుతుందని ధర్మాసనం తెలిపింది. ముఖ్యమంత్రి పరిధిలో ఉండే మంత్రిమండలిలో డిప్యూటీ సిఎంలు భాగమని కోర్టు పేర్కొన్నది. 'ఉప ముఖ్యమంత్రి పదవి ప్రభుత్వంలో మొదటిది మాత్రమే కాకుండా అత్యంత ముఖ్యమైనది. ఇది రాజ్యాంగాన్ని ఉల్లంఘించదు. ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు)ను ఉప ముఖ్యమంత్రి పదవి ఉల్లంఘిస్తోందని పేర్కొన్న పిటిషన్‌లో వాస్తవం లేదు. ముఖ్యమంత్రికి సహాయం చేయడానికి, సీనియర్ నాయకులను మంత్రివర్గంలో ఉంచేందుకు ఉప ముఖ్యమంత్రులను నియమిస్తారు. పేరుకు డిప్యూటీ సీఎం అని పిలిచినప్పటికీ ఆయన కూడా మంత్రివర్గంలో ఒక మంత్రే. కొన్ని రాష్ట్రాల్లో ఒకరి కంటే ఎక్కువ మంది ఉప ముఖ్యమంత్రులు ఉండగా, మరికొన్ని రాష్ట్రాల్లో ఎవరూ లేరు' అని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ అన్నారు. ప్రస్తుతం దేశంలో 14 రాష్ట్రాల్లో డిప్యూటీ సిఎంలు ఉన్నారు. దేశంలోనే అత్యధిక (ఐదుగురు) ఉప ముఖ్యమంత్రులను కలిగి ఉన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది.

దేశంలో ఉద్యోగాలు లేవు

- ప్రజల జేబులు కొల్లగొడుతున్నారు
- కేంద్రంపై రాహుల్ మండిపాటు

కార్బా (ఛత్తీస్‌గఢ్) : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. దేశంలోని యువతకు ఉద్యోగాలు లేవని, ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఆయన సోమవారం ఛత్తీస్‌గఢ్‌లోని కార్బాలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించి వారి జేబులు కొల్లగొడుతోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వ కుటిల యత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

దేశ జనాభాలో వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు 74 శాతం మేర ఉన్నారని అంటూ భారత్‌లో అగ్రస్థానంలో ఉన్న 200 కంపెనీల్లో ఏ ఒక్కటీ వారి యాజమాన్యం కింద లేదని రాహుల్ గుర్తు చేశారు. కానీ దేశంలోని సొమ్మునంతటినీ ఆ కంపెనీలకే ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు.

'నాకు చెప్పండి. గత నెలలో జరిగిన రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో మీరు పేదలు, కార్మికులు, నిరుద్యోగులు లేదా చిన్న చిన్న వ్యాపారులను చూశారా? నేను అదానీ, అంబానీ, అమితాబ్ బచ్చన్, ఐశ్వర్యారాయ్, బడా వ్యాపారవేత్తలను మాత్రమే చూశాను. అదానీ, అంబానీ, వారి కుటుంబాలు పెద్ద పెద్ద ప్రకటనలు ఇస్తున్నారు' అని రాహుల్ ఎద్దేవా చేశారు. ప్రజలు ఉపాధి లేక అధిక ధరలతో వేగలేక నానా ఇబ్బందులు పడుతుంటే.. అదానీ, అంబానీ వందల వేల కోట్ల ఆస్తులకు పడగలెత్తుతున్నారని రాహుల్ విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లో జోడో యాత్రను కుదించాలని రాహుల్ నిర్ణయించారు. ముందుగా అనుకున్న ప్రకారం ఆయన పశ్చిమ ప్రాంతంలో పర్యటించడం లేదు. 10, 12 తరగతుల విద్యార్థులకు బోర్డు పరీక్షల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని కాంగ్రెస్ నేత ఒకరు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 16 రాహుల్ యాత్ర ఉత్తరప్రదేశ్‌లో ప్రవేశించి, 26వ తేదీ వరకూ కొనసాగాల్సి ఉంది. ఆ తర్వాత యాత్ర రాజస్థాన్‌లో ప్రవేశిస్తుంది. అయితే తాజా మార్పుతో ఐదు రోజుల ముందుగానే అంటే 21వ తేదీతో రాహుల్ యూపీలో తన యాత్రను ముగించుకొని మధ్యప్రదేశ్‌లో అడుగు పెడతారు.

మీ కోసం

వంకాయ ముక్కలను కొద్దిగా పాలు కలిపిన నీటిలో ఉంచితే రంగు మారకుండా ఎక్కువసేపు ఉంటాయి. రుచీ మారదు.

జీవన సౌరభం

వినేందుకు కటువుగా అనిపించినా మీ గురించి వాస్తవాలు చెప్పేవారి సలహాలు తీసుకోవడం మంచిది.

మార్గదర్శి

ఆలోచనలను
ఎదలో నిలిపి
అక్షరములతో
పదములు కలిపి..

కలాన్ని తీసి
నీతులు రాసి
బోధలగరిమను
మీకందిస్తా..

సమాజలోటును
సూటిగజూపి
నిద్దురలేపే
రచనలు చేస్తా..

మంచిని కోరే
త్రోవను చూపి
మార్గదర్శిగా
మీ ముందుంటా..

బాల వాక్యములు
గరిమముల నునటు
సందేశాలను అందిస్తా
సందేహాలను తొలగిస్తా..

- ఎన్.వి.ఆర్ సత్యనారాయణమూర్తి,
94408 94087.

నీడను కనిపెట్టండి.



పిల్లలూ, ఇక్కడ మొదటి వరుసలో రకరకాల డైనోసార్స్ ఉన్నాయి కదా! కింద వరుసలో వాటి పిల్లలు ఉన్నాయి. బయటకు వచ్చిన పిల్ల రంగును బట్టి వాటి తల్లి ఎక్కడుందో కాస్త చూసి పెట్టరూ.

నేను గీసిన బొమ్మ



మోతు లక్ష్మీపావని,
5వ తరగతి, మం.ప్ర.ప. ప్రాథమిక పాఠశాల, జె.తిమ్మాపురం, పెద్దాపురం మండలం, కాకినాడ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మంచి నిద్రతో మెరుగైన ఆరోగ్యం..

సాధారణంగా పిల్లలు ఎక్కువ నిద్రపోతే, వృద్ధులకు అస్సలు నిద్ర రాదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏ వయసు వారు ఎన్ని గంటలు నిద్రపోవాలి అనే విషయం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. 'ఎవరు, ఎన్ని గంటలు పడుకోవాలి?' అనేది వాళ్ల వయస్సు మీద ఆధారపడి ఉంటుంది. వయస్సు ప్రకారం.. తగినంత నిద్ర లేకపోతే, అనారోగ్యానికి గురవ్వడం ఖాయం.

ఆరోగ్యం బాగుండాలంటే సరైన నిద్ర చాలా అవసరం. సరైన నిద్ర అంటే నిద్ర వచ్చినప్పుడు పోవడం కాదు. నిద్రకు సరిపడా సమయం కేటాయించడం. కానీ చాలామంది నిద్రకు సరైన సమయం ఇవ్వరు. దీనివల్ల అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. నిద్రలేమి కారణంగా మానసిక, శారీరక ఆరోగ్యంలో చాలా మార్పులు వస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

నేషనల్ స్లీప్ ఫౌండేషన్ వివరాల ప్రకారం..

0 నుంచి 3 నెలల పిల్లలు 14 నుంచి 17 గంటల వరకు నిద్రపోవాలి. 4 నుంచి 12 నెలల పిల్లలు 12 నుంచి 16 గంటల వరకు, 1 నుంచి 2 సంవత్సరాల పిల్లలు 11 నుంచి 14 గంటలు, 3 నుంచి 5 సంవత్సరాల పిల్లలు 10 నుంచి 13 గంటలు, 6 నుంచి 9 సంవత్సరాల పిల్లలు 9 నుంచి 12 గంటలు, 14 నుంచి 17 సంవత్సరాల వారికి రోజుకు 8-10 నిద్ర అవసరం. టీనేజ్‌లో ఉన్న వాళ్లు 7 నుంచి 9 గంటల నిద్ర పోవడం చాలా ముఖ్యమంటున్నారు ఆరోగ్య నిపుణులు. అలాగే 65 ఏళ్లు పైబడిన వారు కూడా రోజూ 7-8 గంటలు నిద్రపోవాలి.

మహిళలు ఎక్కువ సమయం

ఈ జాబితాలో మహిళల నిద్ర సమయం ప్రత్యేకంగా పరిగణించారు. మహిళలు ఎక్కువగా నిద్రపోవాలని నేషనల్ స్లీప్ ఫౌండేషన్ పరిశోధన చెబుతోంది. టీనేజ్ అమ్మాయిలకు 8 నుంచి 10 గంటల నిద్ర అవసరం. అదే సమయంలో 24 నుంచి 64 సంవత్సరాల వయస్సు గల స్త్రీలు రోజుకు ఏడు గంటలు నిద్రపోవాలి. పురుషుల కంటే మహిళలకు ఎక్కువ నిద్ర అవసరమని ఓ పరిశోధనలో తేలింది. ప్రతి స్త్రీ పురుషుడి కంటే 20 నిమిషాలు ఎక్కువ నిద్రపోవాలని నిపుణులు సూచిస్తున్నారు

శరీరానికి ఏం ప్రయోజనం?

సరిపడా నిద్ర లేకపోతే శరీరం నిస్సత్తువుగా తయారవుతుంది. తరచూ తలనొప్పి లేదా కంటి కింద నల్లటి వలయాలు ఏర్పడతాయి. ఏకాగ్రత స్థాయి తగ్గుతుంది, చికాకును పెరుగుతుంది, శరీర బరువు, ఒత్తిడి ఎక్కువవుతాయి. రోజూ సరిపడానిద్ర పోతే మీ శరీరం, మనసు చాలా ఉత్సాహంగా పనిచేస్తాయి.

మెరుగైన జ్ఞాపకశక్తి

నిద్రలో, మన మెదడు జ్ఞాపకాలను బలపరుస్తుంది. మేల్కొన్నప్పుడు, వాటి అభ్యాస ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రతి రోజూ ఇలాగే జరుగుతుంది. మంచి నిద్ర పోయేవాళ్ల జ్ఞాపకశక్తితో పోల్చుకుంటే తక్కువ నిద్రపోయే వాళ్ల జ్ఞాపకశక్తి తక్కువగా ఉంటుంది. ఒక వ్యక్తి శారీరక, మానసిక ఆరోగ్యస్థితిని పోల్చిచూసినప్పుడు, సరిపడా నిద్ర పోయేవాళ్ల సామర్థ్యానికి తక్కువ నిద్ర పోయే వాళ్ల సామర్థ్యానికి చాలా వ్యత్యాసం ఉంటుంది.

హానికర సి-రియాక్టివ్ ప్రోటీన్ స్థాయిలు పెరుగుతాయి

సరిపడా నిద్ర లేకపోతే, ఇన్ఫ్లమేటరీ ప్రోటీన్ల స్థాయిలు విపరీతంగా పెరిగిపోతాయి. దీనివల్ల అధిక రక్తపోటు, మధుమేహం, స్ట్రోక్, ఆర్థరైటిస్, వృద్ధాప్యం మొదలైన వాటి ప్రమాదం పెరుగుతుంది. ఆరు లేదా అంతకంటే తక్కువ గంటలు నిద్రపోయే వ్యక్తుల శరీరంలో సి-రియాక్టివ్ ప్రోటీన్ ఎక్కువగా ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ ప్రోటీన్ హార్ట్ స్ట్రోక్, ఇతర గుండె సంబంధిత వ్యాధులకు కారణమవుతుంది.

ఇతర ఆరోగ్య సమస్యలు..

సరైన నిద్ర పోకపోతే.. రక్తపోటు పెరుగుతుంది. అధిక మోతాదులో ఒత్తిడి హార్మోన్లు విడుదలవుతాయి. సుదీర్ఘమైన నిద్ర లేమి వల్ల దైనందిన జీవనశైలిలో తీవ్ర మార్పులు చోటుచేసుకుంటాయి.

బరువు నియంత్రణ

బరువు నియంత్రణలో నిద్ర ప్రభావం చాలా ఉంది. సరిగ్గా నిద్రపోని కారణంగా రోజురోజుకూ శరీర బరువు పెరుగుతుంది. సరిపడా నిద్ర, ఆహారంలో మార్పులు చేసుకుంటే బరువు నియంత్రించుకోవచ్చు అని నిపుణులు చెబుతున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు

సరైన నిద్ర లేకుండా, ఆహారంలో మార్పులు చేసుకున్నంత మాత్రాన ఆరోగ్య సమస్యలు దూరం కావు. ఎంత మంచి ఆహారం తీసుకున్నా, తక్కువ నిద్రపోతే, శరీరం ఎండిపోయినట్లు అనిపిస్తుంది, ఒత్తిడి హార్మోన్లు ఎక్కువగా ఉంటాయి, జీర్ణక్రియ బలహీనంగా ఉంటుంది.

పిల్లల్లో ప్రభావాలు..

పిల్లలు రోజూ కనీసం 8 గంటలు నిద్రపోలేకపోతే వాళ్ల ఏకాగ్రత స్థాయి తగ్గుతుంది. హైపర్యాక్టివ్‌గా ఉంటారు. అంటే ఉద్రేక స్థాయిలు పెరుగుతాయి. చిరాకుగా ఉంటారు.

మంచి ఆరోగ్యానికి మంచి నిద్ర చాలా అవసరం. దైనందిన జీవితంలో కొన్ని అలవాట్లను మెరుగుపర్చుకుంటే రోజూ సరిపడా నిద్ర పోగలం. తద్వారా ఆరోగ్య సమస్యల నుంచి దూరం కావచ్చు.

పుల్లటి నారింజ... పోషకాల బొనాంజ

ప్రస్తుత సీజన్‌లో విరివిగా లభించే పండ్లలో నారింజ ఒకటి. మన ఆరోగ్యాన్ని పెంపొందించే అనేక పోషకాలున్నాయి. ఆకుపచ్చ రంగులో ఉండే నారింజ పండ్లు పుల్లగా ఉంటాయి. ఈ సీజన్‌లో దొరికే ఈ పండ్లను తప్పనిసరిగా తింటే శరీరానికి అవసరమైన అనేకపోషకాలు అందుతాయని నిపుణులు చెబుతున్నారు. కాల్షియం, మాంసకృత్తులు, పిండి పదార్థాలు, భాస్వరం, కొవ్వు, ఇనుము, సేంద్రియ లవణాలు, విటమిన్ ఎ, విటమిన్ బి1, విటమిన్ సి వంటివి సమృద్ధిగా ఉంటాయి. నారింజలో బెటా కెరోటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ కూడా ఉంటుంది. ఇది శరీరంలోని కణజాలాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణ సంబంధ సమస్యలేవీ రాకుండా చేస్తుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి. ఆహార నాళాల్లో విషక్రిములు చేరకుండా నిరోధిస్తుంది. వీటిలో ఉండే కాల్షియం ఎముకలు గుల్లగా మారకుండా బలంగా ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. కీళ్ల, మోకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కల్గిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేయటంలోనూ, రక్త ప్రసరణ సక్రమంగా జరగటంలోనూ దోహదపడుతుంది. విటమిన్ సితో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎలాంటి ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడతాయి. రక్తహీనత సమస్య, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

21న రకుల్ పెళ్లి..

రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నానీ వివాహం ఈ నెల 21న గోవాలో జరగనుంది. వీరి పెళ్లికి సంబంధించిన వెడ్డింగ్ కార్డు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వేడుకకు టాలీవుడ్ నుంచి మంచు లక్ష్మితో పాటు ప్రగ్యా జైస్వాల్, సీరత్ కపూర్ తదితరులు హాజరుకానున్నట్లు సమాచారం. రకుల్ ప్రస్తుతం హిందీలో 'మేరీ పత్నీ కా' రీమేక్‌లో నటిస్తోంది. ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉంది. తమిళంలో తెరకెక్కుతున్న ఇండియన్ 2 సినిమాలో కీలక పాత్ర పోషిస్తోంది.

'మసూద'కి ప్రీక్వెల్ వస్తోంది..

తిరువీర్, కావ్య కళ్యాణ్ రామ్ జంటగా నటించిన 'మసూద' చిత్రానికి ప్రీక్వెల్ రానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా తెలిపారు. 'భూతద్దం భాస్కర్ నారాయణ' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న రాహుల్ ఈ విషయాన్ని వెల్లడించారు. "కొత్త టాలెంట్ వస్తోంది. అదే నా బిగ్గెస్ట్ సపోర్ట్. కొత్త ప్రొడ్యూసర్లు, కొత్త డైరెక్టర్లు, కొత్త రైటర్లు వచ్చినప్పుడు తాజా విషయాలు బయటికి వస్తాయి. రిస్క్ ఎక్కువ తీసుకుంటారు. సినిమా ఇలానే తీయ్యాలి, అలానే తియ్యాలి అనే నోషన్స్ ఏమీ ఉండవు. ఈ రూల్స్ పాటించాలి అనేవి ఉండవు. భయం తెలియకుండా ధైర్యం వస్తుంది' అని చెబుతూ 'మసూద' ప్రీక్వెల్ కూడా ప్లాన్ చేస్తున్నామ'ని ప్రకటించారు.

23న తెలుగు 'సైరన్'

జయం రవి హీరోగా, కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'సైరన్' చిత్రం తెలుగులో విడుదలకు సిద్ధం అయ్యింది. ఆంటోని భాగ్యరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని తెలుగులో 'గంగ ఎంటర్టైన్మెంట్స్' పతాకంపై మహేశ్వర్ రెడ్డి ఫిబ్రవరి 23న విడుదల చేయనున్నారు. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్లుగా కనిపించనున్న ఈ సినిమా తెలుగు టీజర్ ఇటీవల విడుదలైంది.

లవ్ యువర్ ఫాదర్ సినిమా షూటింగ్ ప్రారంభం

మనిషా ఆర్ట్స్ అండ్ మీడియా ప్రయివేటు లిమిటెడ్, అన్నపరెడ్డి స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'లవ్ యువర్ ఫాదర్'. హర్ష, కషిక కపూర్ హీరో హీరోయిన్లుగా పవన్ కేతరాజు దర్శకత్వంలో కిశోర్ రాఠీ, మహేష్‌రాఠీ నిర్మాతలు. ఈ సినిమా ప్రారంభ కార్యక్రమం మల్లారెడ్డి కాలేజీలో జరిగింది. మల్లారెడ్డి విద్యాసంస్థల కమిటీ సభ్యురాలు కామకూర శాలని కెమెరా స్విచ్చాన్ చేశారు. సిఎంఆర్‌గ్రూపు చైర్మన్ గోపాల్‌రెడ్డి క్లాప్‌కొట్టారు. గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీశైలంరెడ్డి, సంతోష్‌రెడ్డి స్క్రిప్ట్‌ను అందజేశారు. ముఖ్య అతిథులుగా మల్లారెడ్డి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ భద్రరెడ్డి, మల్లారెడ్డి హెల్త్‌సిటీ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ ప్రీతిరెడ్డి, మల్లారెడ్డి కాలేజీ ప్రిన్సిపల్ ఎ.రామస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ ఔట్... పడిక్కల్ ఇన్..

- తుదిజట్టులో కోసం సర్ఫరాజ్ నిరీక్షణ

రాజ్‌కోట్: మూడోటెస్ట్ ప్రారంభానికి ముందు టీమిండియాకు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి వ్యక్తిగత కారణాలతో, శ్రేయస్ అయ్యర్ గాయం కారణంగా సిరీస్ మొత్తానికి దూరం కాగా.. తాజాగా రాజ్‌కోట్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగే మూడోటెస్ట్‌కు ముందు కెఎల్ రాహుల్ దూరమయ్యాడు. ఇంగ్లండ్‌తో మిగిలిన మూడు టెస్ట్‌లకు బిసిసిఐ ప్రకటించిన జట్టులో కెఎల్ రాహుల్, రవీంద్ర జడేజా చోటు దక్కించుకున్నా.. ఫిట్‌నెస్ నిరూపించుకోవడంలో అతడు విఫలమయ్యాడు. దీంతో అతడు మూడోటెస్ట్‌కు దూరమైనట్లు బిసిసిఐ సోమవారం ప్రకటించింది. అతడి స్థానంలో దేవదత్ పడిక్కల్‌కు చోటు కల్పించింది. రాహుల్‌తో పాటు జస్ప్రీత్ బుమ్రా కూడా సోమవారం రాజ్‌కోట్‌కు జట్టు సభ్యులతో కలిసి రావల్సి ఉండగా.. అతడు ఇంకా బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సిఎ)లోనే ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్ వేదికగా జరిగిన తొలిటెస్ట్ అనంతరం గాయపడ్డ రాహుల్ విశాఖలో జరిగిన రెండో టెస్ట్ ఆడలేదు. రాహుల్ స్థానం దక్కించుకున్న 23ఏళ్ల కర్ణాటక బ్యాటర్ దేవదత్ పడిక్కల్ ఈ సీజన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్నాడు. తమిళనాడుతో జరిగిన రంజీట్రోఫీ మ్యాచ్‌లో 151పరుగులతో రాణించిన పడిక్కల్.. ఈ సీజన్ రంజీట్రోఫీలో మూడు సెంచరీలతో చెలరేగి ఆడుతున్నాడు. అలాగే ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ(105 పరుగులు) సెంచరీతో మెరిసాడు. ఛటేశ్వర పుజారా, అజింక్యా రహానేలను పక్కన బెట్టి బిసిసిఐ సెలక్టర్లు పడిక్కల్ మొగ్గు చూపిన విషయం తెలిసిందే.

ఇంగ్లండ్ స్పిన్నర్ లీచ్ సిరీస్ మొత్తానికి...

ఇంగ్లండ్ జట్టు ఎడమచేతి వాటం స్పిన్నర్ జాక్ లీచ్ భారత్‌తో జరిగే మిగిలిన మూడు టెస్ట్‌లకు దూరమయ్యాడు. తొలి టెస్ట్‌లో మోకాలి గాయంతో వైజాగ్ టెస్ట్‌కు దూరమైన లీచ్.. కోలుకొనేందుకు ఇంకా సమయం పట్టనున్న దృష్ట్యా ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. అతడు అబుదాబినుంచి స్వదేశానికి తిరిగి వెళ్తాడని, మూడోటెస్ట్ కోసం అతడి పేరును పరిశీలించవద్దని, అతనికి ప్రత్యామ్నాయంగా మరో స్పిన్నర్‌నూ భారత్‌కు పంపడం లేదని సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

ఆంధ్ర-యుపి మ్యాచ్ డ్రా

విశాఖపట్నం: ఆంధ్ర- ఉత్తర ప్రదేశ్ జట్ల మధ్య జరిగిన రంజీట్రోఫీ గ్రూప్ లీగ్ మ్యాచ్ డ్రా అయ్యింది. ఓవర్‌నైట్ స్కోర్ 5వికెట్ల నష్టానికి 271పరుగులతో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్రప్రదేశ్ జట్టు 9వికెట్ల నష్టానికి 429పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. ఆ తర్వాత ఇరుజట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించడంతో ఉత్తరప్రదేశ్ జట్టు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించలేదు. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్రజట్టు 261పరుగులు చేయగా.. యుపి జట్టు 198పరుగులకు కుప్పకూలిన సంగతి తెలిసిందే. దీంతో ఆంధ్రజట్టుకు తొలి 63పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించడంతో మూడు పాయింట్లు జమ అయ్యాయి. దీంతో ఎలైట్ గ్రూప్-బిలో ఆంధ్రప్రదేశ్ జట్టు 25పాయింట్లతో 2వ స్థానంలో నిలిచి క్వార్టర్స్‌కు చేరువైంది. 16నుంచి జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు కేరళతో తలపడనుంది.

దక్షిణాఫ్రికా టి20 లీగ్ టైటిల్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టు చేజిక్కించుకుంది. న్యూల్యాండ్స్‌లో జరిగిన ఫైనల్లో సన్‌రైజర్స్ జట్టు 89పరుగుల తేడాతో డర్బన్ సూపర్‌జెయింట్స్‌పై విజయం సాధించింది. టైటిల్‌ను కెప్టెన్ మార్క్‌క్రమ్‌తో కలిసి అందుకుంటున్న ఆ ఫ్రాంచైజీ యజమాని కావ్య మారన్. ఈమె ఐపిఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకూ సిఇవో.

యాక్సిడెంట్‌లో కెన్యా మారథాన్ రన్నర్ కెల్విన్ మృతి

నైరోబి: కెన్యా మారథాన్ స్టార్ అథ్లెట్, 24ఏళ్ల కెల్విన్ కిప్టుమ్ కారు ప్రమాదంలో కన్నుమూశాడు. కెన్యాలోని కప్తగట్ నుంచి ఎల్డోరెట్‌కు వెళ్తుండగా రాత్రి 11 గంటల సమయంలో అతని కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదం సమయంలో కారులో కెల్విన్‌తోపాటు కోచ్ గెర్వైస్ హకిజిమానా కూడా ఉన్నాడు. ఈ ప్రమాదంలో కెల్విన్‌తోపాటు అతని కోచ్ కూడా సంఘటనా స్థలంలోనే మరణించారు. తీవ్ర గాయాలతో కారులో ఉన్న మరో మహిళను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం సమయంలో కారులో మొత్తం ముగ్గురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. ఆ సమయంలో కెల్విన్ కిప్టుమే కారు డ్రైవింగ్ చేసినట్లు సమాచారం. పోలీస్ కమాండర్ పీటర్ ములింగే మాట్లాడుతూ.. "ప్రమాదం జరిగిన సమయంలో కారును కిప్టుమే డ్రైవింగ్ చేసినట్లు, అతి వేగం కారణంగానే వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగిందని తెలిపారు. మారథాన్‌లో ప్రపంచ రికార్డును బద్దలుకొట్టి 5 నెలలు కూడా పూర్తి కాకముందే అతడు మరణించడంతో క్రీడా ప్రపంచ విషాదంలో మునిగిపోయింది. కాగా గతేడాది అక్టోబర్ 8న చికాగోలో జరిగిన మారథాన్ పోటీల్లో కెల్విన్ కిప్టుమ్ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఆ పోటీల్లో 2 గంటల 35 సెకన్లలోనే తన పరుగును పూర్తి చేశాడు. దీంతో మారథాన్‌లో అత్యంత వేగంగా పరుగును పూర్తి చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. 2 గంటల ఒక నిమిషంలోపు మారథాన్‌ను పూర్తి చేసిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించాడు. కెరీర్‌లో తాను పాల్గొన్న మూడో మారథాన్ పోటీలోనే అతను ఈ రికార్డును సాధించడం విశేషం. అంతేకాకుండా అప్పటికీ అతను వయసు 23 సంవత్సరాలు మాత్రమే. లండన్ మారథాన్‌లో కూడా కెల్విన్ విజేతగా నిలిచాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగే రోటర్‌డ్యామ్ మారథాన్, పారిస్ ఒలింపిక్స్‌లోనూ పాల్గొనాల్సి ఉంది. కానీ ఇంతలోనే ఈ విషాదం చోటు చేసుకొంది. కెల్విన్ కిప్టుమ్ మృతిపై ప్రపంచ అథ్లెటిక్స్ అధ్యక్షుడు సెబాస్టియన్ కో స్పందిస్తూ.. కెల్విన్ మరణం తీరని లోటు అని అన్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68